ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్

fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

17-7-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 167 పేజీలు: 10+4 వెల: 6.50

విదేశీ భాషల్లో శిక్షణకు ఇఫ్లూతో కీలక ఒప్పందం 3

రూ. 32.50 లక్షల కోట్ల సాగు రుణాలు పంపిణి 5

యాత్రలో తొక్కిసలాట..

## ఇద్దరు మృతి

120 మందికిపైగా గాయాలు





క్షత గాత్రులను తరలిస్తున్న దృశ్యం

గురువారం పూరీలో భారీ భక్తజనసందోహం మధ్య కదిలిన రథయాత్ర

# కదిలిన జగన్నాథుడు

## పూరీ రథయాత్రకు పది లక్షలు పైగా భక్తులు రాక

**పూరి,జులై 16:** ఒడిశాలోని పూరీ క్షేత్రంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన జగన్నాథ రథయాత్రలో అపశృతి చోటుచేసుకుంది. లక్షలాది మంది తరలివచ్చిన ఈ యాత్రలో తొక్కిసలాట కారణంగా ఒకరు తీవ్ర అస్వస్థతకు లోనుకావడంతో ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి చేరేలోపే మరణించినట్లు >>2



లంగర్‌హౌస్‌లో గురువారం బోనమెత్తిన మంత్రి సురేఖ 6

సంస్కృతి, ఐక్యతకు ప్రతీకగా

# బోనాలు

గోల్కొండ బోనాలు ఉత్సవాలకు రూ.11 లక్షల నిధులు మంజూరు

తొలి బోనాన్ని ప్రారంభించి, పట్టు వస్త్రాలను సమర్పించిన మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్

# నీట్ రీ ఎగ్జామ్ ఫలితాలు విడుదల

## 11.21 లక్షల మందికి అర్హత

మహిళలు 56.8 %, పురుషులు 55.1% పాస్

**715 మార్కులతో ఆర్యన్ గుప్తా, పాన్షుల్ బన్సాల్ టాపర్లు**

ఫలితాలను విడుదల చేసిన ఎన్‌టిఎ



**హైదరాబాద్, ప్రభాతవార్త, జులై 16:** దేశంలోని ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో ఎంబీబీఎస్, బీడీఎస్‌తోపాటు ఇతర మెడికల్ కోర్సుల్లో అడ్మిషన్ల కోసం జాతీ య స్థాయిలో నిర్వహించే నేష నల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్)-యుజీ- 2026 రీ ఎగ్జామినేషన్ ఫైనల్ కీ విడుదల చేసిన ఎన్‌టీఏ తుది ఫలితాలను విడుదల చేసింది. 720 మార్కులకు గానూ పంజాబ్‌కి చెందిన ఆర్యన్ గుప్తా, హర్యానాకి చెందిన పాన్షుల్ బన్సాల్ ఇద్దరు 715 మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారు. పరీక్షకు హాజరైన వారిలో 56.8 శాతం మంది మహిళలు, 55.1 శాతం మంది పురుషులు అర్హత సాధించారు. పరీక్షకు హాజరైన వారిలో 11.21 లక్షల మంది అర్హత సాధించినట్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ప్రకటించింది. మే 3న జరిగిన నీట్-యుజీ-2026 ప్రశ్నాపత్రం లీకేజీ కావడంతో నీట్ యుజీ రీఎగ్జామ్‌ను జూన్ 21న మరోసారి ఎన్‌టిఏ నిర్వహించిన విషయం తెలిసిందే. దేశ వ్యాప్తంగా 1.80 లక్షల మందితో భద్రతను ఏర్పాటు చేసి, పరీక్షకి అదనంగా 15 నిమిషాల సమయం కేటాయించింది ఎన్‌టీఏ. పరీక్షను మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు నిర్వహించారు. పరీక్షను దేశ వ్యాప్తంగా 551 నగరాలతోపాటు విదేశాల్లోని 14 నగరాల్లో నిర్వహించారు. నీట్ యుజీ- 2026 పరీక్ష కోసం దరఖాస్తు చేసుకున్న 22,79,743 అందరికీ రీ ఎగ్జామ్ రాయడానికి ఎన్‌టిఏ అనుమతించింది. నీట్ రీ ఎగ్జామ్‌కి సుమారు 90 శాతం మంది హాజరైనట్టు ఎన్‌టిఏ ప్రకటించింది. పరీక్షను మొత్తం 13 భాషల్లో నిర్వహించారు. తెలుగు, ఇంగ్లీష్, హిందీ, అస్సామీ, బెంగాలీ, గుజరాతీ, కన్నడ, మలయాళం, మరాఠీ, ఒడియా, పంజాబీ, తమిళంతోపాటు ఉర్దూ భాషల్లో పరీక్షను నిర్వహించారు. నీట్ రీ ఎగ్జామ్‌కి హాజరైన వారిలో 11.21 లక్షల మంది అభ్యర్థులు అర్హత సాధించారు. నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (అండర్ గ్రాడ్యుయేట్) నీట్(యుజి)-2026 >>2



గురువారం అశ్వాపురం మండలంలోని సీతారామ ప్రాజెక్టు పనులను పరిశీలించిన డి.సిఎం భట్టి, మంత్రులు ఉత్తమ్, పొంగులేటి

# ఇక వడివడిగా 'సీతారామ'

## గోదావరి జలాలను గరిష్ఠంగా వినియోగిస్తాం

సీతమ్మ సాగర్, సీతారామ, దేవాదుల లిఫ్ట్‌తో సాగు సామర్థ్యం పెంపు

గ్రావిటీ, లిఫ్ట్‌ల ద్వారా నీరు తరలించేందుకు ప్రణాళిక

ప్రాజెక్టుల పనులు పరిశీలించిన డి.సిఎం భట్టి, మంత్రులు ఉత్తమ్, పొంగులేటి

**అశ్వాపురం, ప్రభాతవార్త జూలై 16:** అశ్వాపురం మండలంలోని సీతమ్మ సాగర్,సీతారామ ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క,మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిభద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం సీతమ్మసాగర్ బ్యారేజ్, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క,రాష్ట్ర నీటిపారుదల మరియు పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచారం మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రాజెక్టు వ్యూ పాయింట్ నుంచి నిర్మాణ పనులను పరిశీలించిన అనంతరం నీటిపారుదల శాఖ అధికారులు మ్యాప్‌లు, సాంకేతిక నమూనాల ద్వారా బ్యారేజ్, పంప్‌హౌస్‌లు, కాలువలు, విద్యుత్ అనుసంధానం, పంపింగ్ వ్యవస్థ, ఆయకట్టు, ఇప్పటివరకు పూర్తయిన పనులు, మిగిలిన పనులు, అవసరమైన నిధులు తదితర అంశాలను మంత్రులకు వివరించారు. గోదావరి జలాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యం.. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ గోదావరి నదిలో ప్రవహిస్తున్న నీటినిసాధ్యమైనంత మేర పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతోందన్నారు. అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో గ్రావిటీ ద్వారా, అవసరమైన చోట లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీటిని తరలించేలా ప్రణాళిక అమలు చేస్తున్నట్లు తెలిపారు. జలయజ్ఞం కార్యక్రమంలో >>2

## విద్యాసంస్థల్లో వివక్షకు చరమగీతం 2

రోహిత్ వేముల చట్టం ముసాయిదాపై కేబినెట్ సబ్‌కమిటీ సమావేశం చర్చ







**నీట్ కెమిస్ట్రీ ప్రశ్నలు రూ.5 లక్షలు!**

కొనుగోలు చేసిన ఓ కోచింగ్ సెంటర్ యజమాని

ఆ ప్రశ్నల రూపకర్త నుంచే తెప్పించుకొన్నట్లు ఆరోపణలు

నీట్ పేపర్ లీక్ దర్యాప్తులో కీలక విషయాలు వెలుగులోకి

**హైదరాబాద్, ప్రభాతవార్త, జులై 16:** నీట్ పేపర్ లీక్ కేసు విచారణ సందర్భంగా పలు కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్‌యూజీ -2026 ప్రశ్నాపత్రం లీక్ కేసు దర్యాప్తులో కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) మరో కీలక విషయాన్ని వెలుగులోకి తీసుకొచ్చింది. మహారాష్ట్రలోని లాతూర్‌కు చెందిన కోచింగ్ >>2

# మైనింగ్ శక్తిగా భారత్

రైతుల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధే లక్ష్యం

యూరియా సబ్సిడీగా రూ.1.51 లక్షల కోట్లు

**సంస్కరణలతో 306.67 లక్షల టన్నులకు పెరిగిన ఉత్పత్తి**

**యూరియాపై తెలంగాణ రైతులకు రూ.86,729 కోట్ల సబ్సిడీ**

కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి



**హైదరాబాద్, జులై 16, ప్రభాతవార్త:** ప్రపంచ మైనింగ్ శక్తిగా భారత్‌ను తీర్చిదిద్దడమే కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. ఇదే సమయంలో రైతుల సంక్షేమానికి, వ్యవసాయ రంగాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని స్పష్టం చేశారు. ప్రతికూల అంతర్జాతీయ పరిస్థితులు, అధిక ధరల భారం అన్నదాతలపై పడకుండా మోదీ సర్కార్ ఎన్నో చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఎరువుల ధరలు భారీగా పెరిగినా, దేశంలో రైతులపై ఒక్క రూపాయి అదనపు భారం పడకుండా కేంద్రం భారీగా సబ్సిడీలను భరిస్తోందన్నారు. ఈ మేరకు ఢిల్లీలో గురువారం మీడియాతో మాట్లాడుతూ యూరియా, డీఏపీ బస్తాపై రూ.2 వేలకు పైగా సబ్సిడీ అందిస్తూ రైతులను ఆదుకుంటున్నట్లు చెప్పారు. ఇదే క్రమంలో రూ.1.51 లక్షల కోట్లకు పైగా వ్యయంతో యూరియా సబ్సిడీ పథకాన్ని కొనసాగిస్తూ కేంద్రం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందన్నారు. దీని వల్ల దేశ వ్యాప్తంగా కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. కోవిడ్ సమయంలో, తర్వాత >>2

# 9 తరగతి నుంచి మూడో భాషా?

విద్యార్థులపై మానసిక ఒత్తిడి

5, 6 క్లాసులైతే మంచిది..

సిబిఎస్ఇకి 'సుప్రీం' సూచన




2



జమ్మూ కాశ్మీర్‌లోని అనంతనాగ్ జిల్లా పహల్గామ్ మార్గంలో అమర్‌నాథ్ యాత్ర సందర్భంగా ఒక యాత్రికుడికి సహాయంగా మోసుకువెళ్తున్న రెస్క్యూ టీం పోలీసులు

## కదిలిన జగన్నాథుడు

>> నిర్వాహకులు తెలిపారు. మృతుడు కటక్‌కు చెందిన అనిల్ దాస్‌గా గుర్తించారు. అలాగే మరొక సంఘటనలో 35 ఏళ్ల వ్యక్తి గుండెపోటుకు గురై మృతిచెందినట్లు తేలింది. వీరితోపాటుగా మొత్తం 120 మందికిపైగా గాయాలపాలయ్యారు. లక్షలాదిమంది తరలిరావడంతో రథాలు లాగేందుకు భక్తులు ఎగబడటంతో తొక్కిసలాట తీవ్రమయింది. ఈకారణంగానే ఇరువురు మృతిచెందడం సుమారుగా వందకుపైగా భక్తులు గాయపడటం జరిగింది. గుండిచా ఆలయం సమీపంలో మరీచకోట్‌కు చేరువలో ఈ దుర్ఘటన సంభవించింది. భక్తులు భారీ సంఖ్యలో రావడంతో అదుపుతప్పి తొక్కిసలాటకు దారితీసినట్టు తెలుస్తోంది. క్షతగాత్రులను చికిత్స కోసం సమీపంలో ఆసుపత్రులకు తరలించారు. బోడా దండాపై రథం లాగుతుండగా ఈ ఘటన జరిగింది. ఊపిరాడకపోవడంతో ఒక భక్తుడు స్పృహ కోల్పోయినట్లు సమాచారం. అతడిని వెంటనే పూరీ జిల్లా ప్రధాన ఆసుపత్రికి తరలించారు. దురదృష్టవశాత్తు, ఆసుపత్రికి చేరుకునేసరికే అతడు మరణించినట్లు వైద్యులు ప్రకటించారు. గాయపడిన వారికి అత్యవసర వైద్య బృందాలు చికిత్స అందిస్తున్నాయి. ఒక్కసారిగా తొక్కిసలాట జరగడంతో ఇద్దరు మృతిచెందడంతోపాటు కిందపడి అనేకమంది గాయాలపాలయ్యారు. ఇక రథయాత్ర కోసం ప్రభుత్వం కూడా భారీగా ఏర్పాట్లు చేసింది. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, వైద్య సిబ్బంది మోహరించారు. అయినా కూడా ఒకేచోట పెద్ద ఎత్తున గుమిగూడడంతో ఈ తొక్కిసలాట జరిగినట్లుగా తెలుస్తోంది. వెంటనే పోలీసులు స్పందించి పలువురిని రక్షించారు. భారీ వర్షం కురుస్తున్నప్పటికీ లక్షలాది మంది భక్తులు పూరీకి చేరుకున్నారు. ఈ క్రమంలో ఒక్కసారిగా భక్తులు రథాలవైపు దూసుకురావడంతోనే ఒకరినొకరు నెట్టుకుని, కిందపడిపోయి ఊపిరాడక అస్వస్థతకు గురయ్యారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఘటనా స్థలిలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల్లో పలువురు పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది.

అత్యంత వైభవంగా గురువారం ప్రారంభమైన రథయాత్ర మహోత్సవంలో పాల్గొనేందుకు దేశ నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు పూరీకి తరలివచ్చారు. జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్ర దేవి కొలువై ఉన్న రథాలను లాగేందుకు భక్తులు పోటీ పడ్డారు. జై జగన్నాథ్ నినాదాలతో పూరీ వీధులు మార్మోగాయి. ఏడాదికి ఒకసారి గర్భగుడి నుంచి బయటకు వచ్చి, గుండిచా ఆలయంలోని తన అత్తవారింటికి వెళ్లే జగన్నాథుడిని దర్శించుకునేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ యాత్ర భారతదేశ ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక అని ప్రధాని నరేంద్ర మోడీ ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. జగన్నాథుడి ఆశీస్సులతో అందరూ ఆరోగ్యంగా, సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. రథయాత్రకు భారీ సంఖ్యలో భక్తులు వస్తారన్న అంచనాతో ఒడిశా ప్రభుత్వం కనీవినీ ఎరుగని రీతిలో ఏర్పాట్లు చేసింది. భద్రత కోసం 13వేల మందికి పైగా పోలీసు సిబ్బందిని, కేంద్ర బలగాలను మోహరించారు. 19 మంది సీనియర్ ఐపీఎస్ అధికారులు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. 473 సీసీటీవీ కెమెరాలు, 65 భారీ ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేశారు.

## నీట్ కెమిస్ట్రీ ప్రశ్నలు రూ.5 లక్షలు!

>> సెంటర్ యజమాని శివరాజ్ రఘునాథ్ మోటేగావ్‌కర్, పరీక్షకు ముందే కెమిస్ట్రీ ప్రశ్నలు సంపాదించేందుకు రూ.5 లక్షలు చెల్లించినట్లు ప్రత్యేక కోర్టుకు సీబీఐ తెలిపింది. ప్రశ్నాపత్రం లీక్ కుట్రలో మోటేగావ్‌కర్ పాత్ర ఉందని, అతడికి బెయిల్ మంజూరు చేయవద్దని ప్రత్యేక కోర్టును సీబీఐ కోరింది. ఢిల్లీ రౌస్ అవెన్యూ ప్రత్యేక కోర్టులో దాఖలు చేసిన అఫిడవిట్‌లో, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ప్రశ్నాపత్రాల రూపకల్పన కమిటీలో సభ్యుడిగా ఉన్న పీవీ కులకర్ణి నుంచి కెమిస్ట్రీ ప్రశ్నలు సేకరించినట్లు ఆరోపించింది. రూ.5 లక్షలు చెల్లించి మోటేగావ్‌కర్ తన సహ నింది తులతో కలిసి కుట్రపూరితంగా పరీక్షకు ముందే ప్రశ్నలు తెప్పించుకున్నట్లు కోర్టులో పేర్కొంది. ఈ వ్యవహారంలో మోటేగావ్‌కర్ కీలక పాత్ర పోషించాడని సీబీఐ తెలిపింది. మోటేగావ్‌కర్ కుమారుడు కులకర్ణి నిర్వహిస్తున్న కెమిస్ట్రీ కోచింగ్ తరగతులకు హాజరవుతున్నట్లు తెలిపింది. ఆ తరగతుల్లోనే లీకైన ప్రశ్నలు అందించినట్లు పేర్కొన్న సీబీఐ.. తనకు అందిన ప్రశ్నలను మోటేగావ్‌కర్ స్వయంగా చేతితో నోట్స్ రూపంలో రాసుకున్నట్లు పేర్కొంది. సీబీఐ తన దర్యాప్తులో భాగంగా స్వాధీనం చేసు కున్న మోటేగావ్‌కర్ మొబైల్‌లో 36చిత్రాలు లభించినట్లు వెల్లడించింది. వాటిలో ఐదు డూప్లికేట్ చిత్రాలు ఉండగా, మొత్తం 132 చేతిరాత కెమిస్ట్రీ ప్రశ్నలు ఉన్నట్లు తెలిపింది. వాటిల్లో 111 ప్రశ్నలు ఎన్టీఏ రూపొందించిన నీట్ యూజీ-2026 ఒరిజినల్ మాస్టర్ ప్రశ్నాపత్రంలోని ప్రశ్నలతో సరిపోలినట్లు సీబీఐ తెలిపింది. తాము సేకరించిన డిజిటలన ఆధారాలు కేసులో కీలక సాక్ష్యాలుగా నిలుస్తాయని తెలిపింది. నీట్ మొదటిసారి మే 3న జరగిన నీట్ పరీక్ష కంటే ముందుగానే ఏప్రిల్ 23న మోటేగావ్‌కర్‌కు కెమిస్ట్రీ ప్రశ్నలు, వాటి సమాధానాలు అందినట్లు దర్యాప్తులో తేలిందని సీబీఐ తెలిపింది. లీకైన ప్రశ్నలు సమకూర్చేందుకు చెల్లించినట్లు ఆరోపిస్తున్న రూ.5 లక్షల నగదును సహ నిందితుడు మనోజ్ భగవాన్‌రావ్ షిరురే ఇచ్చిన సమాచారం ఆధారంగా స్వాధీనం చేసుకున్నట్లు సీబీఐ కోర్టుకు తెలిపింది. మోటేగావ్‌కర్ విద్యార్థులకు తాను ఇచ్చిన ప్రశ్నలే అసలు నీట్ పరీక్షలో వస్తాయని చెబుతున్న వీడియో తమ వద్ద ఉందని, ఆ వీడియో కూడా కేసులో సాక్ష్యంగా మారే అవకాశం ఉందని సీబీఐ తెలిపింది. నీట్ ప్రశ్నాపత్రం లీకైన కేసులు ఇప్పటికే అరెస్టు అయిన 13 మంది నిందితుల జ్యుడీషియల్ కస్టడీని రౌస్ అవెన్యూ కోర్టు ఈ నెల 24 వరకు పొడిగించింది. కస్టడీ పొడిగించిన వారిలో శివరాజ్ రఘునాథ్ మోటేగావ్‌కర్, తేజస్ హర్షద్ కుమార్ షా, దినేశ్ బివాల్, వికాస్ బివాల్, మంగీలాల్ బివాల్, యశ్ యాదవ్, ప్రహ్లాద్ కులకర్ణి, డాక్టర్ మనోజ్ షిరురే, ధనంజయ్ లోఖండే, శుభమ్ ఖైర్నార్, మనీషా వాఘ్‌మారే, మనీషా మండారే, మనీషా సంజయ్ హవల్దార్ ఉన్నారు. జైలు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వారిని కోర్టులో హాజరుపరిచారు. కేసు దర్యాప్తు ఇంకా కొనసాగుతోందని, ఈ వ్యవహారంలో మరికొంత మందిని అరెస్టు చేసే అవకాశం ఉందని కోర్టుకు వెల్లడించింది. నిందితుల జ్యుడీషియల్ కస్టడీని మరో 14 రోజులు పొడిగించాలని సీబీఐ కోర్టును కోరింది.

## రీ ఎగ్జామ్ ఫలితాలు విడుదల

>> ఫలితాలను ఎన్టిఏ ప్రకటించింది. అభ్యర్థుల మెడికల్ అడ్మిషన్. కౌన్సెలింగ్ ప్రక్రియ షెడ్యూల్ ప్రకారం సాగేలా చూసేందుకు ఈ ఫలితాలను సకాలంలో విడుదల చేశారు. భారతదేశంలోని 551 నగరాలు, విదేశాల్లోని 14 నగరాల్లో ఉన్న 5,440 కేంద్రాలలో సుమారు 20 లక్షల మంది అభ్యర్థులు నీట్ రీఎగ్జామ్‌కి హాజరయ్యారు. అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్, డెంటల్, ఆయుష్ అనుబంధ కోర్సుల్లో ప్రవేశానికి 11.21 లక్షల మంది అభ్యర్థులు అర్హత సాధించారు. అభ్యర్థులందరి స్కోర్‌కార్డులు అధికారిక ఎన్టీఏ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. 720 మార్కులకు గాను 138 మంది అభ్యర్థులు 690కి పైగా మార్కులు సాధించారు. వారిలో 93 శాతానికి పైగా అభ్యర్థులు మొదటిసారిగా నీట్ పరీక్షకు హాజరయ్యారు. 99 శాతం మంది 17 నుండి 19 ఏళ్ల వయస్సు గలవారు. ఉత్తరప్రదేశ్‌లో 1.7 లక్షలకు పైగా ఉండగా, లక్షద్వీప్‌లో 43 మంది పరీక్షకు హాజరయ్యారు. 17 మంది రాష్ట్ర స్థాయి టాపర్లు 700 అంతకంటే ఎక్కువ మార్కులు సాధించగా, 26 మంది 690కి పైగా మార్కులు సాధించారు. అత్యుత్తమ ర్యాంకులు సాధించిన 138 మంది అభ్యర్థులు దేశవ్యాప్తంగా 66 నగరాల నుండి ఉన్నారు. 705 మార్కులకు పైగా సాధించిన మొదటి 17 మంది ర్యాంకర్లు పంజాబ్, హర్యానా, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలకు చెందినవారు. 720 మార్కులకు గాను 19 మంది అభ్యర్థులు 700కు పైగా మార్కులు సాధించారు. 1,492 మంది అభ్యర్థులు 650 అంతకంటే ఎక్కువ మార్కులు సాధించారు. 10,160 మంది అభ్యర్థులు 600 మరియు అంతకంటే ఎక్కువ మార్కులు సాధించారు. 90,780 మంది అభ్యర్థులు 500 అంతకంటే ఎక్కువ మార్కులు సాధించారు. జనరల్‌లో 2.91 లక్షలు, ఓబీసీ-ఎన్‌సీఎల్ అభ్యర్థులు 5.12 లక్షలు, ఎస్సీ 1.59 లక్షలు, ఎస్టీ 63,716, జనరల్ ఈడబ్ల్యూఎస్ 95,026, పిడబ్ల్యూబిడి 3,666మంది, పిడబ్ల్యూడి 303 మంది అర్హత సాధించారు.

### వారం - వర్జ్యం

17-07-2026, శుక్రవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆషాఢమాసం, దక్షిణాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, పునర్వసు కార్తె
తదియ ఉ.6.28, చవితి తె.4.44
మఖ సా.6.40
వర్జ్యం : ఉ.7.19-ఉ.8.50, 2) రా.2.29-తె.4.02
దు.ఉ.8.19-ఉ.9.11, 2) మ.12.39-మ.1.31
శుభసమయం : ఉ.6.00-7.00
రాహుకాలం - ఉ.10.30-12.00

### వార్తాఫలం

**మేషం:** మిత్రులతో కలిసి విందు, వినోదాలలో పాల్గొంటారు. రాజకీయ రంగాల వారికి ప్రభుత్వ రంగాల నుండి ఆహ్వానాలు అందుతాయి.

**వృషభం:** చేపట్టిన కార్యక్రమాలు సకాలంలో పూర్తి చేస్తారు. నూతన వ్యక్తులతో పరిచయాలు పెరుగుతాయి.

**మిథునం:** పెద్దల శ్రేయోభిలాషులు ఇచ్చిన సలహాలు పాటించడానికి కాలం కలిసి రాదు. జాగ్రత్తలు అవసరం.

**కర్కాటకం:** సంఘంలోని పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. దూర ప్రాంతాల నుండి కీలక సమాచారాలు అందుతాయి.

**సింహం:** సంక్షేమ పథకాల వలన లాభపడతారు. పొదుపు చేయాలనుకునే ఆలోచనలు కార్యరూపం దాల్చవు.

**కన్య :** కీలక విషయాలలో జీవిత భాగస్వామి సలహాలు తీసుకుంటారు. దీర్ఘకాలికి సమస్యలు తీరుతాయి.

**తుల :** పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు. శత్రువులు సైతం మిత్రులుగా మారి సాయం అందిస్తారు. ఆస్తివివాదాలు తీరుతాయి.

**వృశ్చికం:** మానవసేవే మాధవసేవని నమ్ముతారు. అనుకూల ఫలితాలు అధికంగా ఉంటాయి. విందులు, వినోదాలలో పాల్గొంటారు.

**ధనుస్సు:** ఉద్యోగస్తులు తమ తోటి వారితో అప్రమత్తంగా మెలగాలి. సంగీత, సాహిత్యాలపై ఆసక్తి చూపుతారు.

**మకరం:** కుటుంబంలో చెప్పుకోదగిన మార్పులు ఏర్పడవు. అంతా మంచికే అనుకొని సర్దుకు పోవటం మంచిది. వస్త్రలాభం.

**కుంభం:** వివాహ యత్నాలు ఫలిస్తాయి. పాతబాకీలు వసూలవుతాయి. శ్రమకు తగిన ఫలితం దక్కుతుంది.

**మీనం:** మనోధైర్యంతో మీరు తీసుకునే నిర్ణయాలు నలుగురిలో స్లాఘించ బడతాయి. సోదరుల కలయిక.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## ఇక వడివడిగా 'సీతారామ'

>> భాగంగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి నాయకత్వంలో రాజీవ్ సాగర్ ప్రాజెక్టు రూ.1,640 కోట్లతో రెండు లక్షల ఎకరాలకు, ఇందిరా సాగర్ ప్రాజెక్టు రూ.1,680 కోట్లతో మరో రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో ప్రారంభించబడినట్లు తెలిపారు. మొత్తం సుమారు రూ.3,500 కోట్ల అంచనా వ్యయంతో నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ప్రణాళిక రూపొందించ బడిందన్నారు. రాష్ట్ర విభజనకు ముందు ఈ రెండు ప్రాజెక్టులపై సుమారు రూ.2,000 కోట్ల వరకు వ్యయం జరిగిందని, మిగిలిన పనులకు సుమారు రూ.1,505 కోట్లు అవసరమయ్యే పరిస్థితి ఉండేదన్నారు. అనంతర కాలంలో ప్రాజెక్టు పునఃరూపకల్పనతో అంచనా వ్యయం సుమారు రూ.24 వేల కోట్లకు పెరిగిందని, ఇప్పటికే రూ.7,500-8,000 కోట్ల వరకు వ్యయం జరిగినట్లు వివరించారు.

**సీతారామ ప్రాజెక్టును నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేస్తాం : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

రాష్ట్ర నీటిపారుదల మరియు పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఉమ్మడి ఖమ్మం జిల్లాకు అత్యంత కీలకమైన సాగునీటి ప్రాజెక్టు అని అన్నారు. ఇప్పటికే ప్రాజెక్టుపై గణనీయమైన ప్రజాధనం వ్యయమైనందున మిగిలిన పనులను వేగంగా పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తోందన్నారు. రాష్ట్రంలో ఇరిగేషన్ రంగంపై గతంలో సుమారు రూ.1.81 లక్షల కోట్లకు పైగా వ్యయం జరిగినప్పటికీ అనేక ప్రాజెక్టులు ఇంకా వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై సుమారు రూ.27,500 కోట్లు వ్యయం జరిగినట్లు తెలిపారు. సీతమ్మ సాగర్ ప్రాజెక్ట్ పై ఉన్న న్యాయపరమైన చిక్కులను పరిష్కరించుకొని త్వరితగతిన పనులు పూర్తి అయ్యేలా చూస్తామన్నారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కెనాల్ పనులు కూడా త్వరితగతిన పూర్తి చేసి జిల్లా లో గోదావరి జలాలను వినియోగించే విధంగా అదేవిధంగా ఇల్లందు నియోజకవర్గంలో కూడా నీరు అందించే విధంగా చర్యలు చేపడతామన్నారు.

**ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి రైతులకు సాగునీరు అందిస్తాం : మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచారం మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో ప్రారంభమైన సాగునీటి ప్రాజెక్టులను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావడానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. సీతమ్మసాగర్ బ్యారేజ్, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను ప్రత్యక్షంగా పరిశీలించి మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాజెక్టుకు అవసరమైన ఎలక్ట్రికల్, మెకానికల్ తదితర పనుల కోసం సుమారు రూ.1,000 కోట్లకు పైగా నిధులు విడుదల చేసినట్లు తెలిపారు.

గోదావరి జలాలు వృథాగా సముద్రంలో కలిసిపోకుండా పంపింగ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చి నీటి వినియోగాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 1.25 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు అవసరమైన అన్ని పనులను వేగవంతం చేస్తున్నామని, అవసరమైన చోట అదనపు నిధులు కూడా విడుదల చేస్తామని చెప్పారు. రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించడంలో ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని అన్నారు .భూ సంబంధితమైన అంశాలను, త్వరితగతిన పరిష్కరిస్తున్నాం: జిల్లా కలెక్టర్ అంకిత్‌భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ ప్రాజెక్టు పనుల ప్రస్తుత పురోగతి, భూసేకరణ, పునరావాసం, విద్యుత్ అనుసంధానం, అనుబంధ మౌలిక సదుపాయాల కల్పన, శాఖల మధ్య సమన్వయంపై మంత్రులకు వివరించారు. ప్రాజెక్టు పనులకు అవసరమైన పరిపాలనా అనుమతులు, భూ సంబంధిత అంశాలను వేగవంతంగా పరిష్కరిస్తూ, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనులు పూర్తి చేసేందుకు జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తోందని తెలిపారు. ప్రాజెక్టు పనుల పురోగతిపై జిల్లా స్థాయిలో నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ, శాఖల సమన్వయంతో పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరిస్తున్నట్లు వివరించారు. అనంతరం మంత్రులు మారెళ్ళ పాడు ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య, వైరా శాసనసభ్యులు రామదాసు నాయక్, ఎస్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అంకిత్ జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, నీటిపారుదల శాఖ అధికారులు, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, సంబంధిత శాఖల అధికారులు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మైనింగ్ శక్తిగా భారత్

>> రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, ప్రస్తుతం కొనసాగుతున్న పశ్చిమాసియా సంక్షోభంతో ప్రపంచవ్యాప్తంగా ఎరువులు, సహజవాయువు ధరలు భారీగా పెరిగినా మన దేశంలో రైతులపై అదనపు భారం పడకుండా కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకుందన్నారు. 45 కిలోల యూరియా బస్తాపై రూ.1,680 సబ్సిడీ ఇస్తోందని చెప్పారు. మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలు, కొత్త ప్లాంట్ల ప్రారంభంతో దేశీయంగా యూరియా ఉత్పత్తి 2014-15లో సుమారు 225 లక్షల టన్నుల నుంచి 2024-25 నాటికి 306.67 లక్షల టన్నులకు పెరిగిందని వివరించారు. రామగుండం ఎరువుల కార్మాగారాన్ని రూ.6,400 కోట్లతో పునరుద్ధరించామని, దీని లాభం నేరుగా తెలంగాణకు లభిస్తోందని తెలిపారు. గత 12 ఏళ్లలో కేంద్రం తెలంగాణ రైతులకు యూరియాపై రూ.86,729 కోట్ల సబ్సిడీ అందించిందన్నారు. మోదీ సర్కారు నిర్ణయాలతో 2 ఎకరాలున్న రైతుకు ఏడాదికి యూరియా సబ్సిడీతోనే రూ.25,360 లబ్ధి చేకూరుతోందని వెల్లడించారు. కాగా 12ఏళ్లలో 700మైనింగ్ బ్లాక్‌ల వేలం పారదర్శకంగా జరిగిందని తెలిపారు. వరుసగా రెండో ఏడాదీ బిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి, డిస్పాచ్ మైలురాయిని అధిగమించామని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో గత దశాబ్ద కాలంలో చేపట్టిన పరివర్తనాత్మక సంస్కరణలతో పారదర్శక వేలంపాటలు, వాణిజ్య బొగ్గు తవ్వకం, వేగవంతమైన అన్వేషణ, వ్యాపార సౌలభ్యం మరియు సాంకేతికత ఆధారిత పాలన వంటివి దేశాన్ని ప్రపంచంలోనే అత్యంత ఆకర్షణీయమైన మైనింగ్ గమ్యస్థానాలలో ఒకటిగా నిలిపాయని ఆయన పేర్కొన్నారు. ఇంధన భద్రత, కీలక ఖనిజాలు మరియు స్థితిస్థాపక సరఫరా గొలుసులకు సంబంధించిన ప్రపంచ సవాళ్లను ప్రస్తావిస్తూ, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న మైనింగ్ పర్యావరణ వ్యవస్థను నిర్మించడానికి విధాన సంస్కరణలు, సాంకేతిక పురోగతి, విలువ జోడింపు, సుస్థిరత, అంతర్జాతీయ సహకారాన్ని మిళితం చేసే సమీకృత విధానాన్ని భారతదేశం అనుసరిస్తోందని పేర్కొన్నారు.



గురువారం హైదరాబాద్‌లో జగన్నాథ రథయాత్రలో చీపురుతో రోడ్లు శుభ్రం చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

## నేడు కేబినెట్ భేటీ

**హైదరాబాద్, ప్రభాతవార్త, జులై 16:** నేడు(శుక్రవారం) రాష్ట్ర మంత్రివర్గ అత్యవసర సమావేశం ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరగనుంది. మధ్యాహ్నం 3 గంటలకు తెలంగాణ రాష్ట్ర 35వ మంత్రివర్గ సమావేశం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో 6వ అంతస్తులోని కేబినెట్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. సమావేశంలో ప్రధానంగా సాగునీటి ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితి, మూసీ పునరుజ్జీవనం ఫేజ్-1 పనులు, రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులపై చర్చించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. వాటితోపాటు కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన పలు అభివృద్ధి ప్రాజెక్టులపై చర్చించి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. రాష్ట్రంపై ఎల్‌నినో ప్రభావం, లోటు వర్షపాతం నమోదు, రైతులకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై కేబినెట్ దృష్టి పెట్టే అవకాశం ఉంది. గోదావరి, బనకచర్ల ప్రాజెక్టు విషయంలో తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు పొరుగు రాష్ట్రాలకు నోటీసులు ఇవ్వడం, కృష్ణా, గోదావరి నదీ జలాల బోర్డుల అంశాలు, ఇతర రాష్ట్రాలతో చర్చించిన అంశాలపై కూడా సమీక్షి ంచే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

## విద్యాసంస్థల్లో వివక్షకు చరమగీతం

### రోహిత్ వేముల చట్టం ముసాయిదాపై కేబినెట్ సబ్‌కమిటీ సమావేశం చర్చ

### బిల్లు ముసాయిదాను వెంటనే సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశం

**హైదరాబాద్, ప్రభాతవార్త, జులై 16:** వివక్ష లేని విద్యా విధానమే తమ లక్ష్యమని, ఉన్నత విద్యాసంస్థల్లో వివక్షకు చరమగీతం పాడుతామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. రోహిత్ వేముల చట్టం ముసాయిదాపై గురువారం సచివాలయంలో క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశమైంది. బిల్లుకు సంబంధించి సమగ్ర ముసాయిదా నివేదికను వెంటనే సిద్ధం చేయాలని అధికారులకు కేబినెట్ సబ్ కమిటీ ఆదేశించింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన సమావేశంలో సబ్ కమిటీ సభ్యులైన మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. రోహిత్ వేముల తెలంగాణ (ఉన్నత విద్యలో గుర్తింపు ఆధారిత వివక్ష నివారణ) బిల్లు, 2026 రూపకల్పనపై ఏర్పాటైన కేబినెట్ సబ్ కమిటీ తొలి సమావేశం గురువారం రాష్ట్ర సచివాలయంలో జరిగింది. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఉన్నత విద్యాసంస్థల్లో విద్యార్థులపై జరిగే గుర్తింపు ఆధారిత వివక్షకు శాశ్వతంగా అడ్డుకట్ట వేస్తామని స్పష్టం చేశారు. విద్యాసంస్థల్లో వివక్ష లేని ప్రశాంత వాతావరణాన్ని తీసుకురావడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇందుకోసం చట్టాన్ని అత్యంత పటిష్టంగా రూపొందిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ(హెచ్‌సీయు)లో జరిగిన రోహిత్ వేముల విషాద ఉదంతం కేవలం తెలంగాణనే కాకుండా దేశం మొత్తాన్ని కదిలించిందన్నారు. ఆనాడు వివక్షకు వ్యతిరేకంగా విద్యార్థులు చేసిన పోరాటంలో ప్రస్తుత లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్వయంగా యూనివర్సిటీకి వచ్చి సంఘీభావం ప్రకటించారని, ఆనాడు విద్యార్థులకు జరిగిన అన్యాయాన్ని ప్రశ్నిస్తూ.. నాటి పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ యూనివర్సిటీ పూర్వ విద్యార్థిగా తాను, మంత్రి శ్రీధర్ బాబు, క్రియాశీలక నేత పొన్నం ప్రభాకర్ మేమంతా పెద్ద ఎత్తున పోరాడామన్నారు. భవిష్యత్తులో తెలంగాణలో ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత విశ్వవిద్యాలయాల్లో ఎటువంటి వివక్ష లేని విద్యా విధానాన్ని, చట్టాన్ని తీసుకువస్తామని ఆనాడు ప్రజలకు ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఈ రోజు నెరవేర్చడానికి రోహిత్ వేముల చట్టాన్ని తీసుకొస్తుందని తెలిపారు. సమాజంలో ప్రతి ఒక్కరూ ఆత్మగౌరవంతో బతకాలని, వివక్ష కారణంగా ఎవరూ ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు ఉండకూడదన్న రాహుల్ గాంధీ ఆకాంక్షలకు అనుగుణంగానే ఈ కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటయిందని తెలిపారు. బిల్లు రూపకల్పన ప్రక్రియను వేగవంతం చేయాలని డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు.

## 9 తరగతి నుంచి మూడో భాషా?

### విద్యార్థులపై మానసిక ఒత్తిడి

### 5, 6 క్లాసులైతే మంచిది..

### సిబిఎస్ఇకి 'సుప్రీం' సూచన

**హైదరాబాద్, ప్రభాతవార్త, జులై 16:** సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) తన పాఠ్యప్రణాళికలో భాగంగా 9వ తరగతి నుంచి థర్డ్ లాంగ్వేజ్ ప్రవేశపెట్టడంపై దేశ అత్యున్నత న్యాయస్థానం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. దానివల్ల విద్యార్థులపై అనవసరమైన మానసిక ఒత్తిడి పెరుగుతుందని అభిప్రాయపడింది. సీబీఎస్ఈ త్రిభాషను చేర్చాలనుకుంటే దానిని 5వ తరగతి, 6వ తరగతి నుంచి ప్రవేశపెట్టుకోవచ్చని తద్వారా విద్యార్థులు ఆ భాషను సులభంగా నేర్చుకోగలుగుతారని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. తమిళనాడులోని ప్రతి జిల్లాలో జవహర్ నవోదయ విద్యాలయాల స్థాపనకు అనుకూలంగా మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ ఆ రాష్ట్రం దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం విచారణ జరిపిన సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. 9వ తరగతి స్థాయిలో మూడో భాషను తీసుకురావద్దని జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఆర్.మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం సీబీఎస్ఈకి స్పష్టం చేసింది. 8వ తరగతి ముగింపు నుంచే విద్యార్థులపై బోర్డు పరీక్షల ఒత్తిడి మొదలవుతుందని, ఇప్పుడు ఈ త్రి భాష విధానాన్ని ప్రవేశపెట్టడం ద్వారా వారిపై మరింత ఒత్తిడి పడే అవకాశం ఉంటుందని తేల్చిచెప్పింది. నవోదయ పాఠశాలల్లో కేంద్ర ప్రభుత్వం అమలు చేసే త్రిభాషా సూత్రం తమ ద్విభాషా విధానానికి వ్యతిరేకమని తమిళనాడు ప్రభుత్వం వాదిస్తుండగా. ఈ విధానంలో హిందీనే మూడో భాషగా ఉండాలని తప్పనిసరి చేయలేదని జస్టిస్ నాగరత్న తెలిపారు. రాష్ట్ర భాషను, ఇంగ్లీష్‌ను బోధిస్తూ ఏదైనా మూడో భాషను బోధించాలని, అందులో హిందీనే బోధించాలని ఎక్కడా చెప్పలేదని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. ఎన్‌జీవో తరఫున హాజరైన న్యాయవాది జి. ప్రియదర్శిని వాదిస్తూ, ఏ రాష్ట్రం పైనా ఏ భాషనూ రుద్దకూడదని జాతీయ విద్యా విధానం స్పష్టంగా పేర్కొంటోందని వాదించగా, జస్టిస్ నాగరత్న మాట్లాడుతూ మీకు హిందీ వద్దు కానీ అదే సంస్కృతం అయితే సమస్య ఏమిటని ప్రశ్నించారు. నవోదయ పాఠశాలల ఏర్పాటుకు సంబంధించి కేంద్రం, రాష్ట్రం మధ్య చర్చలు జరుగుతున్నాయని, చర్చలు ఇంకా ముగియలేదని, ఒకవేళ అవి విఫలమైతేనే, ఆ అంశాల్లోని యోగ్యతను పరిశీలించే ప్రశ్న తలెత్తుతుందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ విషయంలో తదుపరి సూచనలు తీసుకునేందుకు తమిళనాడు తరఫు న్యాయవాది కొంత సమయం కోరారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, ఆ ప్రభుత్వం ఎలాంటి విధానపరమైన నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాల్సి ఉందని కోర్టు వ్యాఖ్యానించిన కోర్టు తదుపరి విచారణను ఆగస్టు 11కి వాయిదా వేసింది.

## యుకెకు ఎగుమతులు పెంచుతాం: మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్, ప్రభాతవార్త, జులై 16:** తెలంగాణ రాష్ట్రం నుంచి యూకేకు ఎగుమతులు పెంచుతామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. గురువారం యూకే డిప్యూటీ ట్రేడ్ కమిషనర్ (దక్షిణాసియా) చంద్రు కె అయర్ ఆధ్వర్యంలో మంత్రి శ్రీధర్‌బాబుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. భారత్ యూకే మధ్య కుదిరిన సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం (సీఈటీఏ) వల్ల తెలంగాణ గరిష్ఠ ప్రయోజనం పొందేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు వెల్లడించారు. బుధవారం నుంచి అమల్లోకి వచ్చిన ఈ ఒప్పందం వల్ల దేశం నుంచి ఎగుమతి అయ్యే 99 శాతం పారిశ్రామిక ఉత్పత్తులపై యూకే సుంకాలను తొలగించిన విషయాన్ని గుర్తు చేశారు. రెండు దేశాల మధ్య రూ.3.25 లక్షల కోట్ల వాణిజ్యానికి అవకాశం ఉందదని పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలను వృద్ధి చేస్తామని, యూకే పారిశ్రామికవేత్తలు వినియోగించుకోవాలని మంత్రి కోరారు. రాష్ట్రం నుంచి యూకేకు ప్రస్తుతం రూ.3,553 కోట్ల విలువైన ఎగుమతులు జరుగుతున్నాయని వెల్లడించారు. దేశంలోని ఫార్మా ఉత్పత్తుల్లో 40 శాతం ఇక్కడే జరుగుతున్నాయని, వ్యాక్సిన్ ఎగుమతుల్లో 30 శాతం రాష్ట్రానిదేనని తెలిపారు. ప్రపంచ ప్రఖ్యాత ఏవియేషన్ సంస్థలు ఎయిర్ బస్, బోయింగ్, రోల్స్ రాయిస్, విమాన ఇంజన్ల తయారీ సంస్థ ప్రాట్ అండ్ విట్నీస్, డసో ఏవియేషన్ ఉత్పత్తి చేసే రఫేల్ విమానాల విడిభాగాల తయారీ, ఓవర్ హాలింగ్ సదుపాయాలు ఇక్కడ ఉన్నాయని తెలిపారు. టాటా అడ్వాన్సుడ్ సిస్టమ్స్, సఫ్రాన్ ఏవియేషన్ సంస్థలు పరిశ్రమలను ఏర్పాటు చేసిన విషయాన్ని మంత్రి శ్రీధర్ బాబు గుర్తు చేశారు.

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన టిజి-20 విజేత

### అభినందించి చెక్కులను అందజేసిన సీఎం

**హైదరాబాద్, జులై 16, ప్రభాతవార్త:** రాష్ట్రంలో నిర్వహించిన టీజీ20 లీగ్ విజేతగా నిలిచిన ఈ-ఛాంపియన్స్ టీమ్ గురువారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా హైదరాబాద్ ఈ-ఛాంపియన్స్ జట్టును అభినందించిన ముఖ్యమంత్రి చెక్కులను అందజేశారు. ప్రముఖ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్, ఈ-ఛాంపియన్ అధినేత, క్రీడాకారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. క్రీడారంగంపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ఒక స్పష్టత ఉందని, గతంలో జాతీయస్థాయి క్రీడలను హైదరాబాద్ వేదికైందని సీఎం గుర్తు చేశారు. ప్రజా ప్రభుత్వం క్రీడలపై ప్రత్యేక దృష్టి సారించిందని, తెలంగాణ రాష్ట్రానికి ఒక స్పోర్ట్స్ పాలసీని తీసుకొచ్చామన్నారు. క్రీడల్లో రాణించిన క్రీడాకారులకు క్యాష్ రివార్డ్‌తోపాటు ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి ప్రోత్సహిస్తున్నామన్నారు. క్రీడలకు సంబంధించి మౌలిక వసతులపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని, స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని ముఖ్యమంత్రి తెలిపారు. గచ్చిబౌలి స్టేడియాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దబోతున్నామన్నారు. ఏ రంగంలోనైనా ఫోకస్ లేకపోతే రాణించలేమని, ఏ రంగాన్ని ఎంచుకున్నా ఆ రంగంపై గౌరవం ఉండాలని, ఆసక్తితో ముందుకు వెళ్లాలని సీఎం సూచించారు. గ్రామీణ క్రీడాకారులకు టీజీ20 ఒక మంచి అవకాశమన్నారు. టీజీ20లో విజయం సాధించిన అందరినీ అభినందిస్తున్నానని, మీరంతా దేశ ప్రతిష్ఠను పెంచే క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షిస్తున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రీడాకారులతో అన్నారు.

# విదేశీ భాషల్లో శిక్షణకు ఇఫ్లూతో కీలక ఒప్పందం

### తెలంగాణలో యువతకు స్కిల్ శిక్షణ భేషన్న ఇరాన్

### ఘనంగా తొలి స్కిల్స్ డే వేడుకలు

### ఇప్పటిదాకా 1,775 మంది విద్యార్థులకు ఉద్యోగాలు

### ఆఫర్ లెటర్లు పంపిణీ చేసిన మంత్రి వివేక్ వెంకటస్వామి

**హైదరాబాద్, జులై 16, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం జర్మన్, జపనీస్‌తోపాటు ఇతర విదేశీ భాషల్లో శిక్షణ అందించేందుకు ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. తెలంగాణ వ్యాప్తంగా యువత ఈ అవకాశం వినియోగించుకోవాలని కార్మిక, ఉపాధి, శిక్షణ ఫ్యాక్టరీస్ గనుల శాఖ మంత్రి డాక్టర్ జి వివేక్‌వెంకటస్వామి పిలుపునిచ్చారు. నైపుణ్యమే యువత జీవితాలను మార్చే అసలైన శక్తి అని, ప్రతి యువకుడికి నాణ్యమైన శిక్షణతోపాటు ఉద్యోగం కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. హైదరాబాద్‌లోని కొమరం భీం ఆదివాసీ భవన్‌లో డైరెక్టరేట్ ఆఫ్ ఎంప్లాయ్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన తెలంగాణ స్కిల్స్ డే కార్యక్రమంలో మంత్రి పాల్గొని ఉద్యోగాలు సాధించిన శిక్షణార్థులను అభినందించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జాబ్‌మేళాల ద్వారా ఉద్యోగాలకు ఎంపికైన యువతకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ విద్యార్థులకు ఆఫర్ లెటర్లను అందజేశారు. అలాగే విదేశీ ఉపాధి అవకాశాల కోసం ఎంపికైన 19 మంది ఫిజియోథెరపిస్టులకు ఆఫర్ లెటర్లను కూడా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు వచ్చే ప్రతి పరిశ్రమ మొదట అడిగేది స్కిల్డ్ మ్యాన్‌పవర్ గురించేనని అన్నారు. అందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణను దేశంలోనే నంబర్1 స్కిల్ డెవలప్‌మెంట్ రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం భారీ ఎత్తున పెట్టుబడులు పెడుతోందని చెప్పారు. గతంలో ఐటీఐల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ పొందలేకపోయారని, ఆ పరిస్థితిని పూర్తిగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకుందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 65 ప్రభుత్వ ఐటీఐలను టాటా టెక్నాలజీస్ భాగస్వామ్యంతో అత్యాధునిక అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా అభివృద్ధి చేసినట్లు మంత్రి తెలిపారు. సీఎన్‌సీ, ఇండస్ట్రియల్ రోబోటిక్స్, ఎలక్ట్రిక్ వెహికల్, డిజిటల్ మాన్యుఫ్యాక్చరింగ్, అడ్వాన్స్‌డ్ టూల్స్, ఆటోమేషన్ వంటి భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా 6 దీర్ఘకాలిక, 23 స్వల్పకాలిక కోర్సులు అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. ఈ మార్పులతో రాష్ట్రంలో శిక్షణ సామర్థ్యం 18,484 నుంచి 34,344 మందికి పెరిగిందని, 2025-27 విద్యాసంవత్సరంలో 99 శాతం సీట్లు భర్తీ కావడం యువతలో ఈ కోర్సులపై ఉన్న విశ్వాసానికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 65 ప్రభుత్వ ఐటీఐల్లో 35 ట్రేడ్లలో 15,860 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ డైరెక్టొరేట్ జనరల్ ఆఫ్ ట్రైనింగ్ ప్రమాణాల ప్రకారం శిక్షణ పూర్తిచేసిన వారికి జాతీయ స్థాయి ఎన్‌సీవీటీ సర్టిఫికేషన్ లభిస్తోందని, దీంతో ప్రభుత్వ, ప్రైవేట్, కేంద్ర సంస్థలతో పాటు విదేశాల్లో కూడా ఉద్యోగ అవకాశాలు పొందే అవకాశం కలుగుతోందన్నారు. ష్నైడర్, సీమెన్స్, ఇండోజర్మన్ గ్రీన్ స్కిల్స్ ప్రోగ్రామ్, ఎడ్యునెట్ ఫౌండేషన్, నిర్మాణ్ ఫౌండేషన్ వంటి సంస్థలతో భాగస్వామ్యం ద్వారా శిక్షకులకు శిక్షణ, ఆన్‌దిజాబ్ ట్రైనింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్వ్యూ నైపుణ్యాలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ శిక్షణ అందిస్తున్నామని మంత్రి తెలిపారు. టాటా టెక్నాలజీస్ సామాజిక బాధ్యతలో భాగంగా భారీగా పెట్టుబడులు పెట్టి ఆధునిక ల్యాబ్‌లు, యంత్రాలు, ఫ్యాకల్టీని అందించడం అభినందనీయమని మంత్రి పేర్కొన్నారు. ఈ వర్షం ఫలితంగా హైదరాబాద్, ఘట్కూర్, వరంగల్, నిజామాబాద్, హుస్నాబాద్ తదితర ప్రాంతాల్లో నిర్వహించిన ఏడు జాబ్‌మేళాల్లో 116 పరిశ్రమలు పాల్గొనగా, 2,572 మంది యువత ఇంటర్వ్యూలకు హాజరై 1,775 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని మంత్రి తెలిపారు. ఇందులో 1,216 మంది ఐటీఐ విద్యార్థులు, 559 మంది ఐటీఐ యేతర విద్యార్థులు ఉన్నారన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు నెలవారీ వేతనంతో ఉద్యోగాలు లభించాయని తెలిపారు. ప్రభుత్వ ఐటీఐ, ఏటీసీ విద్యార్థులకు నెలకు రూ.2,000 స్టైపెండ్ అందించనుందని, స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలకు నిధుల కొరత రానివ్వబోమని స్పష్టం చేశారు. వచ్చే ఏడాది నుంచి రాష్ట్రస్థాయి స్కిల్ కాంపిటీషన్లు నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సత్కరిస్తామని ప్రకటించారు. శిక్షణ పూర్తిచేసిన విద్యార్థులు అలుమ్నీ నెట్‌వర్క్ ఏర్పాటు చేసి ఉద్యోగ అవకాశాల సమాచారాన్ని పరస్పరం పంచుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఆధునిక నైపుణ్య శిక్షణను విస్తరించేందుకు 54 కొత్త అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్ల ఏర్పాటుకు ఇప్పటికే 281.39 ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయించామని మంత్రి తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరంలో 50 వేల మంది యువతకు శిక్షణ అందించడమే లక్ష్యమని చెప్పారు. ఇరాన్ ప్రతినిధి బృందం తెలంగాణలో అమలు చేస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ మోడల్, కార్మిక పరిపాలన, విదేశీ ఉపాధి కార్యక్రమాలు, సంక్షేమ విధానాలపై ఆసక్తి కనబరిచింది. భవిష్యత్తులో నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన, శిక్షణ, సంస్థాగత భాగస్వామ్యాలపై రెండు ప్రాంతాల మధ్య సహకార అవకాశాలను విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగే శ్వరరావు, ఇరాన్ సహకార, కార్మిక శాఖ ఉపమంత్రి సర్ఫీ, భారత దేశంలోని ఇరాన్ రాయబారి డాక్టర్ ఫత్ అలీ, హైదరాబాద్‌లోని ఇరాన్ కాన్సుల్ జనరల్ అహ్మదియే, వైస్ కాన్సుల్ మొహ్సెన్ మొఘద్దామి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ డిస్కంలు పటిష్టం

### అకౌంటింగ్, బిల్లింగ్, సబ్సిడీపై ఫోకస్

### రాష్ట్రాల నియమనిబంధనలు షురూ

### ఆర్థిక ఆరోగ్యం కల్పించేదిశగా కేంద్రం

**హైదరాబాద్, జులై 16, ప్రభాతవార్త:** విద్యుత్ పంపిణీ సంస్థలకు (డిస్కంలు) ఆర్థిక జవసత్వాలు కల్పించే దిశగా కేంద్రం అడుగులు వేస్తోంది. ప్రధానంగా విద్యుత్ పంపిణీ సంస్థలకు ఆర్థిక ఆరోగ్యాన్ని కల్పించేందుకు నియమాలను తెరముందుకు తీసుకొచ్చింది. ఈ మేరకు కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ అధికావర్గాలు వెల్లడించిన వివరాల ప్రకారం పంపిణీ సంస్థల ఆర్థిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి గాను డిస్కమ్‌లకు అకౌంటింగ్, రిపోర్టింగ్, బిల్లింగ్, సబ్సిడీ చెల్లింపు ప్రక్రియను క్రమబద్ధీకరించనుంది. విద్యుత్‌ను పంపిణీ చేయడంలో పంపిణీ సంస్థలు చేసిన పూర్తి వ్యయాలను రికవరీ చేయడానికి, విద్యుత్ సేకరణకు సంబంధించిన అన్ని ఖర్చులు పారదర్శకత్వ విధానంలో టారిఫ్‌ను ఆమోదించేటప్పుడు పరిగణనలోకి తీసుకోవడం జరుగేలా చర్యలు తీసుకుంటోంది. వివిధ వర్గాలు వినియోగించిన విద్యుత్ ఖాతాల ఆధారంగా సబ్సిడీ కోసం డిమాండ్లను సేకరించే విధానానికి తెరలేపింది. ముఖ్యంగా త్రైమాసికం చివరి తేదీ నుండి 30 రోజుల్లోగా విద్యుత్ పంపిణీ సంస్థలు సంబంధిత నివేదికను సమర్పించాలని, రాష్ట్ర విద్యుత్ నియంత్రణ కమిషన్ల (ఎస్‌ఈఆర్‌సి) నివేదికను పరిశీలించి, త్రైమాసిక నివేదికను 30 రోజుల్లో సమర్పించాలని సూచించింది. కేటగిరీల వారీగా వినియోగించే ఇంధన ఖాతాల ఆధారంగా సబ్సిడీ కోసం డిమాండ్ల సేకరణ, మరియు రాష్ట్ర ప్రభుత్వాలు ఈ వర్గాలకు చెల్లించాల్సిన బకాయిలను పెండింగ్ లేకుండా చూడాల్సి ఉంటుంది. విద్యుత్ రంగం స్థిరత్వం కోసం ఒక ఫ్రేమ్ వర్క్ అవసరం అయిన నేపథ్యంలో అనుచిత, పారదర్శకత లేని అకౌంటింగ్, అలాగే రాష్ట్రాలు వివిధ వర్గాలకు విద్యుత్ నిమిత్తం ఇస్తున్న సబ్సిడీల మొత్తాన్ని చెల్లించని లేదా ఆలస్యం చేయడం విద్యుత్ పంపిణీల ఆర్థిక ఇబ్బందులకు ఒక కారణంగా విద్యుత్ మంత్రిత్వ శాఖ పేర్కొంది. అలాగే ఈక్విటీపై సహేతుకమైన రాబడి (ఆర్ఓఈ) ఈ రంగంలో పెట్టుబడులు నిర్ధారించడానికి అవసరమైన ప్రధాన కారకాల్లో ఒకటిగా రాష్ట్రాలకు నొక్కి చెప్పింది. సెంట్రల్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిన్ (సిఇఆర్‌సి) పేర్కొన్న టారిఫ్ నిబంధలనలో ఒకటిగా సంబంధిత కాలానికి రాష్ట్రాల విద్యుత్ నియంత్రణ కమిషన్ విధిగా అమలు చేయాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. కొత్త నిబంధనల ప్రకారం సబ్సిడీ, అకౌంటింగ్, సబ్సిడీ బిల్లుల పెంపు చట్టం లేదా నియమ నిబంధన ప్రకారం ఉల్లంఘనలకు రాష్ట్రాల విద్యుత్ పంపిణీ సంస్థలు పాల్పడినట్లయితే వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని తేల్చిచెప్పింది. అంతేకాకుండా సాంతికే, వాణిజ్య (ఎటి అంట్ సి) నష్టాన్ని తగ్గించడానికి కచ్చితమైన, సహేతుకమైన లక్ష్యాన్ని నిర్వచించడానికి, సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలు అంగీకరించిన టారిఫ్ ప్రకారం ఎటి అండ్ సి నష్టాలను తగ్గించేలా రాష్ట్ర విద్యుత్ నియంత్రణ కమిషను ఆమోదించాల్సి ఉంటుంది.

## ఆత్మహత్యకు యత్నించిన విచారణ ఖైదీ చికిత్స పొందుతూ మృతి

**హైదరాబాద్ (సికిందరాబాద్), జులై 16, ప్రభాతవార్త:** ఆత్మహత్యకు యత్నించిన అండర్ ట్రయల్ ఖైదీ సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నివాసం ఉండే రోహిత్ పవార్ (20)పై గత మే నెలలో లైంగిక దాడి కేసు నమోదైంది. అతన్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా చర్లపల్లి కేంద్ర కారాగారంలో అండర్ ట్రయల్ ఖైదీగా ఉన్నాడు. కాగా రెండు రోజుల కిందట నిందితుడు జైలులోని బాత్‌రూమ్‌లో ఉరి వేసుకున్నాడు. అప్రమత్తమైన సిబ్బంది తక్షణమే గాంధీ ఆస్పత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతూ గురువారం తుదిశ్వాస విడిచాడు. కేసు దర్యాప్తులో ఉంది.

## విద్యుత్ శాఖలో నిరసనలపై ఆంక్షలు

**హైదరాబాద్, జులై 16, ప్రభాతవార్త:** విద్యుత్ శాఖలో అధికారులు, ఉద్యోగుల నిరసనల పై ఆంక్షలు విధిస్తూ రాష్ట విద్యుత్ ఉత్పత్తి సంస్థ జెన్కో నిర్ణయించింది. ఈ మేరకు దీనికి సంబంధించి గురువారం జెన్కో డైరక్టరు ఎస్‌వి కుమార్‌రాజు ఉత్తర్వులు విడుదల చేశారు.

హైదరాబాద్‌లోని విద్యుత్ సౌధతో పాటు, రాష్ట్రంలోని అన్ని విద్యుత్ ఉత్పత్తి సంస్థలు, నిర్వహణ కార్యాలయాల్లో నిరసనలపై నిషేధం విధిస్తున్నట్లు స్పష్టం చేశారు. నిరసనలు, సమీకరణ, నిర్వహణ, ర్యాలీలు, నినాదాలు చేయడంపై ఆంక్షలు అమల్లో ఉంటాయని తెలిపారు. వీటిని ఉల్లంఘించినట్లయితే వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# నేడు తొలి హైడ్రోజెన్ రైలు పట్టాల పైకి

### హర్యానాలో ప్రధాని మోడీ చేతుల మీదుగా ప్రారంభం




**న్యూఢిల్లీ, జులై 16:** దేశంలో తొలి హైడ్రోజన్ రైలు హర్యానాలోని జింద్ నుంచి ఆ రైలు ప్రారంభం కానున్నది. ప్రధాని మోడీ ఈనెల 17వ తేదీన ఆ కొత్త రైలుకు పచ్చజెండా ఊపనున్నారు. జింద్ నుంచి సోనిపట్ మధ్య ఆ రైలు నడుస్తుంది. ఈ రెండు స్టేషన్ల మధ్య 89 కిలోమీటర్ల దూరం ఉంది. ఈ రైలులో మొత్తం 10 కోచ్‌లు ఉంటాయి. గరిష్టంగా 75 కిలోమీటర్ల వేగంతో వెళ్తుంది. చెన్నైలోని ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీలో దీన్ని డిజైన్ చేశారు. ఫ్యూయల్ సెల్ డీపీఆర్ఎస్ విధానంలో రైలు నడవనున్నది. 1200 కిలోవాట్ల ప్రొపల్షన్ సిస్టమ్ ఆ రైలుకు ఉంటుంది. 2025లో జింద్ సోనిపట మధ్య ట్రయల్స్ విజయవంతంగా నిర్వహించారు. మే 22వ తేదీన 10 కోచ్‌ల హైడ్రోజన్ రైలు కోసం రైల్వే బోర్డు అనుమతి ఇచ్చింది. హైడ్రోజన్ ట్రైన్ నెంబర్ 74010 జింద్ రైల్వే స్టేషన్ నుంచి ఉదయం 7.40 నిమిషాలకు బయలుదేరుతుంది. ఆ తర్వాత సోనిపట్‌కు 9.40 నిమిషాలకు చేరుకుంటుంది. ఫ్యూయల్ సెల్స్ ఆధారంగా హైడ్రోజన్ రైలు విద్యుత్తను ఉత్పత్తి చేస్తుంది. హైడ్రోజన్, ఆక్సిజన్ మధ్య రియాక్షన్‌తో విద్యుత్తు ఉత్పత్తి అవు తుంది. ఆనోడ్‌పై హైడ్రో జన్, క్యాథోడ్‌పై ఆక్సిజన్ రియాక్ట్ అవుతుంది. ఆనోడ్‌లో హైడ్రోజన్ కణా లు ప్రోటాన్లు, ఎలక్ట్రాన్లుగా విభజన అవు తాయి. ప్లాటినం ఉత్ప్రేరకం ఆధారంగా ప్రోటా న్లతో ఆక్సిజన్ కలిసి వాటర్‌గా మారుతుంది. ఈ విధానంలో రైలు ఇంజిన్ నడుస్తుంది. హైడ్రోజన్ రైళ్లను 2018లో తొలిసారి జర్మనీలో ప్రవేశపెట్టారు. ఫ్రెంచ్ కంపెనీ ఆల్‌స్టామ్ వీటిని డెవలప్ చేశాయి. ఈ రైలు కోసం జింద్‌లో హైడ్రోజన్ జనరేషన్, రీఫ్యూయలింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేశారు. కంప్రెస్డ్ హైడ్రోజన్ గ్యాస్‌ను నిల్వ చేసేందుకు పెట్రోలియం శాఖ లైసెన్సు జారీ చేసింది. మొత్తం 12 స్టేషన్లలో రైలు ఆగుతుంది. జింద్ సిటీ, పాండు పిండర, లలిత్ ఖేరా, భంబేవా, ఇషాపూర్ ఖేరి, బూటానా, ఖంద్రాయి, గోహానా, రత్రా, లాత్, మోహానా హర్యానా, భర్యాస్ని స్టేషన్లలో ఆ రైలు ఆగనున్నది. శిలాజ ఇంధనాల తరహాలో హైడ్రోజన్ మూడు రెట్ల శక్తిని ఉత్పత్తి చేస్తుంది. అయితే ప్రస్తుతం ఈ విశ్వంలో హైడ్రోజన్ ఎక్కువ స్థాయిలో లభిస్తుంది. దీన్ని ఇంధనంగా వాడితే, అది కేవలం నీటి ఆవిరిని, వేడిని మాత్రమే బై ప్రోడక్ట్స్‌గా రిలీజ్ చేస్తుందని చెబుతున్నారు. దీని వల్ల పర్యావరణం పరిశుభ్రంగా ఉంటుందని భావిస్తున్నారు.

## సహకార రంగం స్థితిగతులపై మంత్రి తుమ్మలతో ఇరాన్ ప్రతినిధి బృందం భేటీ

**హైదరాబాద్, జులై 16, ప్రభాతవార్త:** తెలంగాణ సహకార రంగం పనితీరుపై రాష్ట్రంలో ఇరాన్ ప్రతినిధి బృందం పర్యటించింది. ఈ సందర్భంగా హైదరా బాద్‌లో గురువారం వ్యవసాయమంత్రి తుమ్మల నాగేశ్వరావు, రాష్ట్ర గనులు, భూగర్భ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామితో ఈ ప్రతినిధి బృందం భేటీ అయింది. తెలంగాణలో సహకార ఉద్యమం బలోపేతానికి ప్రభుత్వం చేపట్టిన చర్యలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పిఏసిఎస్) పనితీరు, సభ్యత్వ విస్తరణ, రైతులకు అందిస్తున్న సేవలు, సహకార రంగంలో రాష్ట్రం సాధించిన పురోగతిని మంత్రి తుమ్మల ప్రతినిధి బృందానికి వివరించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో సహకార రంగం కీలక పాత్ర పోషిస్తోందని, రైతు సంక్షేమ కార్యక్రమాల అమలులో సహకార సంఘాలు సమర్థవంతంగా పనిచేస్తున్నాయని తెలిపారు. రాష్ట్రంలో అమల వుతున్న సహకార విధానాలు, సంస్థాగత సంస్కరణలు, సభ్యులకు అందిస్తున్న సేవలపై ఇరాన్ ప్రతినిధి బృందం ఆసక్తి వ్యక్తం చేసింది. భవిష్యత్తులో సహకార రంగంలో పరస్పర అనుభవాల మార్పిడి, సహకారాన్ని మరింత బలోపేతం చేసుకునే అవకాశాలపై ఇరు పక్షాలు చర్చించాయి. ఈ ఇరాన్ ప్రతినిధి బృందంలో ఇరాన్ సహకార, కార్మిక, సామాజిక సంక్షేమ శాఖ మంత్రి హెచ్.ఎ. డాక్టర్ మెయిదారి, సహకార శాఖ ఉపమంత్రి డాక్టర్ సర్ఫీ, భారత దేశంలోని ఇరాన్ రాయబారి హెచ్. ఇ. హామీద్ అహ్మదీయే హైదరాబాద్‌లోని ఇరాన్ కాన్సుల్ జనరల్ మోసిన్ మొఘద్దామి, ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి హోష్మి ఉన్నారు.

## ధూల్‌పేటలో డ్రగ్స్ అమ్మకాలు!

### కొనేందుకు వచ్చిన ముగ్గురి అరెస్టు

### పోలీసుల రాకతో నలుగురు పరార్

### వారిలో ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి కుమారుడు?

### గంజాయితోపాటు హాష్‌ఆయిల్ జప్తు

**హైదరాబాద్ (గోషామహాల్) జులై 16, ప్రభాతవార్త:** నిన్నటి వరకు గుడుంబా అడ్డాగా వున్న ధూల్‌పేట్ నేడు గంజాయి సహా పలురకాల డ్ర గ్స్‌కు కేరాఫ్‌గా మారడం తెలిసిందే. నిత్యం ఇక్కడ గంజాయితో పాటు డ్రగ్స్ కొనేందుకు అనేక మంది వస్తుంటారు. దీనిపై నిఘా వుంచిన పో లీసులు గురువారం ఉదయం ఒక అడ్డాపై కాపుకాయగా కారులో ఏడుగురు యువకులు వచ్చి గంజాయితో పాటు హాష్ ఆయిల్ కొంటూ ధర వి షయంలో బేరం ఆడుతున్నారు. సరిగ్గా ఇదే సమయంలో పోలీసులు ఒక్కసారిగా దాడిచేయగా ముగ్గురు పట్టుబడ్డారు. మరో నలుగురు పారిపో యారు. పట్టుబడ్డ వారి వద్ద గంజాయితో పాటు హాష్ ఆయిల్ జప్తు చేశారు. కాగా పారిపోయిన నలుగురిలో విశ్రాంత ఐఎఎస్ అధికారి, బిఆర్ఎస్ ఎంఎల్‌సి వెంకట్రామిరెడ్డి కుమారుడు వున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఎఫ్ఐఆర్‌లో వెంకట్రామిరెడ్డి కుమారుడి పేరు వుండడం గమనార్హం. వివరాలు ఇలావున్నాయి. ధూల్ పేట్‌లోని పురానాపూల్ ప్రాంతంలో గురువారం ఉదయం ఎనిమిది గంటల సమయంలో కొందరు యువకు లు తమకు క్రమం తప్పకుండా గంజాయి అందించే అడ్డాకు వచ్చి అక్కడ రహస్యంగా అమ్మే ప్రాంతానికి వెళ్లారు. అనంతరం కొంత డబ్బులు ఇచ్చి 24 గ్రాముల హాష్ ఆయిల్, మరో 22 గ్రాముల గంజాయిని కొన్నారు. దీనిని దూరం నుంచి గమనించిన పోలీసులు ఒక్కసారిగా దాడిచేయ గా ముగ్గురు యువకులు పట్టుబడ్డారు.

మరో నలుగురు పారిపోయారు. పట్టుబడ్డ వారిని భరత్‌రాజ్ రెడ్డి, అభిషేక్, బొట్టు యూనిత్‌గా గుర్తిం చారు. పారిపోయిన నలుగురిలో విశ్రాంత ఐఎఎస్ అధికారి, బిఆర్ఎస్ ఎంఎల్‌సి వెంకట్రామి రెడ్డి కుమారుడు భరత్ రెడి వున్నట్లు తెలిసింది. ఘటనా స్థలంలో గంజాయి కొనేందుకు వచ్చిన యువకులు ప్రయాణించిన కారును పోలీసులు జప్తు చేశారు. పట్టుబడ్డ ముగ్గురికి ఉస్మానియా ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చే యగా వీరికి డ్రగ్స్ పాజిటివ్‌గా వచ్చినట్లు తెలిసింది. వీరిని పోలీసులు విచారిస్తున్నారు. పారిపోయిన వారిని పట్టుకునేందుకు రెండు బృందాలను రంగంలో దించారు. కాగా ఈ ఉదంతంపై పోలీసుల విచారణ గోప్యంగా సాగుతోంది. దీనిపై శుక్రవారంపూర్తి వివరాలు వెల్లడించే వీలుంది.

**గంజాయి కొనుగోలులో నా కుమారుడు లేడు: ఎంఎల్‌సి వెంకట్రామిరెడ్డి**

ఇదిలావుండగా ధూల్‌పేట్‌లో గంజాయి కొనేందుకు వచ్చి పోలీసుల దాడులతో పారిపోయిన వారిలో తన కుమారుడు భరత్ రెడ్డి వున్నట్లు వస్తున్న వార్తల్లో నిజం లేదని ఎంఎల్‌సి వెంకట్రామిరెడ్డి వెల్లడించారు. ఈ విషయమై వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ మా అబ్బాయి డ్రగ్స్ తీసుకున్నట్లు మీడియాలో వస్తున్న వార్తలు నిరాధారమని, గురువారం ఉదయం మంగళ్‌హాట్ పోలీసులు మా ఇంటికి వచ్చి డ్రగ్స్‌కు సంబంధించిన కేసు విచారణ జరుపుతున్నామని విచారణకు సహకరించాలని కోరినట్లు ఆయన తెలిపారు.

## రాష్ట్రంలో వర్షాభావ నేపథ్యంలో రికార్డుస్థాయికి విద్యుత్ వినియోగం

### 10 కోట్ల యూనిట్లకు పెరిగిన రోజువారీ డిమాండ్

**హైదరాబాద్, జులై 16, ప్రభాతవార్త:** వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వరణుడు ముఖం చాటేశాడు. వర్షాలతో ముసురు పట్టి ఉండాల్సిన ప్రస్తుత పరిస్థితుల్లో సూర్యుడు ప్రతాపం చూపిస్తున్నాడు. దీంతో సాధారణం కంటే మించి ఉష్ణోగ్రతలు పెరగడంతో పాటు, ఉక్కపోత తీవ్రమయింది. ఫలితంగా ప్రజలు ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో విద్యుత్ వినియోగం భారీగా పెరిగింది. విద్యుత్ వినియోగం ఒక్కసారిగా పెరగడంతో రికార్డు స్థాయికి చేరింది. నెల రోజుల వ్యవధిలోనే రోజువారీ విద్యుత్ వినియోగం ఏకంగా 10 కోట్ల యూనిట్లు పెరిగింది. గత నెల 14న రాష్ట్రంలో రోజువారీ విద్యుత్ వినియోగం 20.35 కోట్ల యూనిట్లుగా ఉండగా, సరిగ్గా నెల తిరిగేసరికి అంటే ఈ నెల అదే సమయానికి అది 30.90 కోట్ల యూనిట్లకు చేరుకుంది. అంటే నెల రోజుల వ్యవధిలో ఏకంగా 10 కోట్ల యూనిట్లు పెరుగుదల చోటు చేసుకుంది. ఏడాది క్రితం ఇదే సమయానికి అంటే 2025 జూలై 14న 28.60 కోట్ల యూనిట్లు నమోదయింది. దానితో పోల్చినా ఈసారి వినియోగం చాలా ఎక్కువగా ఉంది. సాధారణంగా వర్షాకాలంలో వ్యవసాయానికి విద్యుత్ డిమాండ్ తగ్గుతుంది. కానీ వనలు కనుచూపు మేరలో కూడా కనిపించకపోవడంతో రైతులు పంటలను కాపాడుకోవడానికి పూర్తిగా బోరు బావులపైనే ఆధారపడుతున్నారు. మరోవైపు హైదరాబాద్ లోనూ విద్యుత్ వినియోగం భారీగా పెరిగింది. జూలై 1 నుంచి 14 వరకు గత ఏడాది 95.77 కోట్ల యూనిట్ల విద్యుత్ వినియోగం కాగా, ఈ ఏడాది అదే సమయానికి 107.84 కోట్ల యూనిట్లకు చేరుకుంది.

## నేడు నూతన ఇహెచ్ఎస్ పథకం ప్రారంభం

### సచివాలయంలో ప్రారంభించనున్న డిప్యూటీసిఎం భట్టి

### ఇహెచ్‌సిటి ద్వారా అమలుకు ఉత్తర్వులిచ్చిన సర్కార్

**హైదరాబాద్, జులై 16, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రూపొందించిన ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్ఎస్)ను శుక్రవారం ప్రారంభించనున్నారు. మధ్యాహ్నం 1 గంటలకు సచివాలయంలో ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, వైద్య, ఆరోగ్య శాఖ మం త్రి దామోదర రాజనర్సింహ ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు.

ఇందులో భాగంగా కొత్త ఈహెచ్ఎస్ పోర్టల్‌ను ప్రారంభించడంతోపాటు హెల్త్‌కార్డుల పంపిణీ చేపట్టనున్నారు. ఈ పథకానికి సంబంధించి నెట్‌వర్క్ ఆసుపత్రులతో ఒప్పందాలు(ఎంవోయు) అమలు చేయనున్నారు. రాష్ట్రంలోని ఉద్యోగులు, పెన్షనర్ల ఎంప్లాయీస్ హెల్త్ కేర్ ట్రస్ట్ ద్వారా ఉద్యోగుల ఆరోగ్య పథకం అమలుకు అనుమతిస్తూ ప్రభుత్వ జీవోఎంఎస్ నంబర్ 50ను ప్రభు త్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

## అమెరికాలో నగరవాసిపై కత్తితో దాడి

**హైదరాబాద్ (మెహిదీపట్నం), జులై 16, ప్రభాతవార్త :** అమెరికాలోని ఓ షాపింగ్ మాల్‌లో వ్యాపార దుకాణాన్ని నిర్వహిస్తున్న హైదరాబాద్ యువకుడిపై కత్తితో దాడి చేశారు. హైదరాబాద్ టోలిచౌకికి చెందిన సయ్యద్ సోహెల్ పై ఓ దుండగుడు 15 సార్లు కత్తితో దాడి చేశాడు. జులై 13న జరిగిన సంఘటన సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. తీవ్రంగా గాయపడిన సయ్యద్ సోహెల్ అమెరికా వెస్ట్ వ్యాలీ సిటీలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందు తున్నాడు.



సయ్యద్ సోహెల్ గత రెండేళ్లుగా షాపింగ్ మాల్ లో చిన్న వ్యాపార దుకాణం నిర్వహిస్తూ తన భార్య పిల్లలతో అక్కడే నివాసం ఉంటు న్నాడు. స్థానికులు ఈ ఘటనపై పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు నిందితుడి వద్ద నుంచి కత్తిని తీసుకొని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని పీటర్ మైకేల్ గా గుర్తించారు. ఈ ఘటనపై భారత ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని కుటుంబ సభ్యులు కోరారు.

## మైనర్ బాలికపై లైంగిక దాడి

### నిందితుడికి 20 యేళ్ల జైలుశిక్ష

**చిన్నశంకరంపేట, జులై 16, ప్రభాతవార్త:** చిన్నశంకరంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో 2022లో మైనర్ బాలికపై జరిగిన లైంగికదాడి కేసులో నిందితుడికి న్యాయస్థానం 20 సంవత్సరాల జైలుశిక్ష, రూ.10వేల జరిమానా విధించినట్లు మెదక్ జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస్ గురువారం తెలిపారు. 2022 అక్టోబర్ 10న చిన్నశంకరంపేటకు చెందిన బాలిక (13) ఇంటి వద్ద ఒంటరిగా ఉండగా పక్కనే ఉన్న పంక్చర్ దుకాణ యజమాని మహ్మద్ షంషోద్దిన్ బాలిక వద్దకు వెళ్లి మీ అమ్మకు డబ్బులు ఇవ్వాలని బాలికను బయటకు పిలిచి బలవంతంగా పక్కనే ఉన్న చెట్ల చాటుకు తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక గట్టిగా కేకలు వేయడంతో నిందితుడు అక్కడి నుండి పరారయ్యాడు. ఇంటికి వచ్చిన కుటుంబసభ్యులకు జరిగిన విషయం తెలుపడంతో అప్పటి చిన్నశంకరంపేట ఎస్ఐ సుభాష్‌గౌడ్ పోక్సో కింద కేసు నమోదు చేశారు. తూప్రాన్ డిఎస్పీ యాదగిరిరెడ్డి విచారణ చేపట్టి బాధితురాలికి వైద్యపరీక్షలు నిర్వహించారు. బాధిత బాలికను భరోసా కేంద్రానికి తరలించగా, న్యాయ సలహాదారు శ్వేత పూర్తి సమాచారాన్ని అందించింది. పీపీ బాలయ్య న్యాయస్థానం ముందు బలంగా వాదనలు వినిపించారు. పూర్తి వివరాలను పరిశీలించిన మెదక్ ఫాస్ట్ ట్రాక్ పోక్సో కోర్టు న్యాయమూర్తి సుభావలి.. నిందితుడు మహ్మద్ షంషోద్దిన్‌ను దోషిగా నిర్ధారించి 20 యేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.10వేల రుపాయల జరిమానా విధించారు.

# సైదాబాద్‌లో ప్రైవేటు పాఠశాల వద్ద హైడ్రామా

### బిజెపి నాయకుల ధర్నాతో ఉద్రిక్తత

### రెండో తరగతి విద్యార్థికి అన్యమత హోంవర్క్ ఇవ్వడంపై తల్లిదండ్రుల అభ్యంతరం

**హైదరాబాద్ (సైదాబాద్), జులై 16, ప్రభాతవార్త:** నగరంలోని సైదాబాద్‌లో గల ఓ ప్రైవేటు పాఠశాలలో ఒక వర్గానికి చెందిన విద్యార్థికి అన్యమత అంశాన్ని హోంవర్క్‌గా ఇవ్వడం తీవ్రఉద్రిక్తతకు దారితీసింది. ఈ వివాదంలో బిజెపి నేతలు ఆందోళన చేబట్టడంతో పోలీసులు రంగంలో దిగి పరిస్థితులను చక్క దిద్దారు. వివరాలిలా ఉన్నాయి. సైదాబాద్‌లోని సక్సెస్ స్కూల్‌లో రెండో తరగతి చదువుతున్న ఒక విద్యార్థికి ఈ నెల 15న మరో మతానికి చెందిన అంశాన్ని హోంవర్క్‌గా చదవాలని క్లాస్ టీచర్ సదరు బాలుడి డైరీలో రాశారు. బాలుడి డైరీని గమనించిన తల్లిదండ్రులు దీనిపై గురువారం ఉదయం పది గంటలకు పాఠశాలకు వెళ్లి సదరు టీచర్‌ను నిలదీసి, దీనిపై పాఠశాల నిర్వాహకులతో గొడవకు దిగారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక బిజెపి నాయకులు గురువారం పెద్దఎత్తున పాఠశాల వద్దకు చేరుకుని నిరసనకు దిగడంతో పాఠశాల వద్ద ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొంది. తల్లిదండ్రులు, నాయకుల నిరసనతో పాఠశాల యాజమాన్యం దిగి వచ్చింది. తమ పాఠశాలలో పనిచేస్తున్న టీచర్ పొరపాటున అలా చేసిందని, ఇందుకుగానూ సదరు ఉపాధ్యాయురాలిని ఉద్యోగం నుండి శాశ్వతంగా తొలగిస్తున్నట్లు ప్రకటించింది. ఇదే సమయంలో పాఠశాల వద్ద బిజెపి నేతల నిరసన విషయం తెలియగానే పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.

చార్మినార్ డిసిపి కిరణ్‌ఖారేతోపాటు ఇతర అధికారులు అక్కడికి చేరుకుని పరిస్థితి అదుపు తప్పకుండా చక్కదిద్దారు. ఈ ఘటనలో పాఠశాల యాజమాన్యంపై బాధిత బాలుడి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు ఇవ్వకపోవడంతో వివాదం అంతటితో సమసిపోయింది. దీనిపై డిసిపి కిరణ్ ఖారే మాట్లాడుతూ పాఠ శాల వద్ద చిన్నపాటి వివాదం చెలరేగిందని, చివరకు అంతా సద్దుమణిగిందని తెలిపారు. కాగా ఈ ఘటనపై పాఠశాల యాజమాన్యం తమకు క్షమాపణలు చెప్పిందని విద్యార్థి తండ్రి రాజశేఖర్ పేర్కొన్నారు.

**హిందూ సంస్కృతిపై దాడి : కేంద్రమంత్రి బండి సంజయ్**

కాగా సైదాబాద్‌లో పాఠశాలలో జరిగిన ఘటన హిందూ సంస్కృతిపై దాడిగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తెలిపారు. ఒక వర్గానికి చెందిన బాలుడిని అన్యమతానికి చెందిన పాఠ్యాంశాన్ని ఎలా బోధిస్తారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో పాఠ శాల యాజమాన్యంపై వెంటనే చర్య తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

విద్యార్థిని అన్య మతానికి చెందిన కల్మా చదవాలని పాఠశాల యాజమాన్యం వత్తిడి చేయడం సిగ్గుచేటని ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు.

**పోలీసుల అదుపులో బిజెపి నాయకురాలు మాధవీలత**

సక్సెస్ స్కూల్‌లో చోటుచేసుకున్న వివాదం నేపథ్యంలో బిజెపి నాయకురాలు మాధవిలత ఢిల్లీ నుండి శంశాబాద్ విమానాశ్రయానికి చేరుకుని పాఠశాల వద్దకు వెళ్లడానికి సిద్ధమవుతుండగా పోలీసులు ఆమెను విమానాశ్రయంలోనే అదుపులోకి తీసుకున్నారు. కాగా ఈ ఘటనపై బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు తీవ్రంగా ఖండించారు. దీనిపై సిఎం రేవంత్‌రెడ్డి స మాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.


కొంత మందిని అదృష్టం వరిస్తుంది. చిత్రమేమిటంటే వారెప్పుడూ అదృష్టంపై ఆధారపడేవారు కాదు.

-ఫ్రాంక్లిన్

# ఆర్భాటాలే కానీ ఆచరణేది?

మాతృభాషను సంరక్షించుకోవాల్సిన అవసరం గురించి పెద్దలు పదేపదే చెప్తుంటారు. అమ్మ భాషలో ఉన్న ఆత్మీయత, ఆనందం మరెందులోనూ లభించదని తెలియని విషయం కాదు. ప్రపంచవ్యాప్తంగా ఎన్నో భాషలకు లిపి లేకపోవడంతో విద్యారూపంలో అందించే ప్రయత్నాలు చేయకపోవడం తదితర కారణాలతో కాలగర్భంలో కలిసిపోతున్నాయి. రెండువేల సంవత్సరాలకుపైగా చరిత్ర కలిగిన తెలుగు భాష పరిస్థితి అంత ఆశాజనకంగా కన్పించడం లేదు. ఒకనాడు సంస్కృతం, ప్రాకృతం, అరబిక్, పార్శీ, ఉర్దూ, పోర్చుగీసు, ఇంగ్లీషుతోసహా అనేక భాషల ప్రభావాన్ని తట్టుకొని నిలబడగలిగిన తెలుగు ప్రస్తుతం ఆశించిన మేరకు ఆదరణ లభించడం లేదేమోననిపిస్తున్నది. అయితే మాతృభాష తెలుగుపై పాలకులకు అభిమానం, ప్రేమావాత్సల్యం లేదనుకోలేం. తెలుగుకు ఉన్న ప్రాముఖ్యతను చాటి చేప్పేందుకు సభలు, సమావేశాలు ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నారు. ఇదంతా తెలుగుభాషపై ఉన్న మక్కువను చాటేందుకు, తెలుగును నలుదిశలా వ్యాప్తి చేసేందుకు చేస్తున్న ప్రయత్నాలే. మరొకపక్క తెలుగు రాష్ట్రాల్లోనే క్షేత్రస్థాయిలో ఇంగ్లీషు మోజులో పడి తెలుగుకు తీరని అన్యాయం చేస్తున్నారనే వాదనను కొట్టివేయలేం. తెలుగుభాషకు జరుగుతున్న ద్రోహం, అందువల్ల సామాన్యుడు పడుతున్న ఇబ్బందుల గురించి ఆలోచిస్తే ఆవేదన కలగక తప్పదు. ఇదంతా పరాయి ప్రభువులు ఎవరో చేస్తున్నది కాదు. ఉభయ రాష్ట్రాల్లో తెలుగు ప్రజల ప్రతినిధులమని చెప్పుకుంటున్న కొందరు నేతలే కావడం విచారకరం. ప్రపంచం గ్లోబల్ విలేజ్‌గా మారినమాట వాస్తవమే కావొచ్చు. సాంకేతికంగా ఎంతో అభివృద్ధిచెందుతుంటే తెలుగు, తెలుగు అంటూ పరిమితులు గీసుకుంటే ఎలా అని ప్రశ్నించేవారు ఉన్నారు. అభివృద్ధివైపు పరుగులు పెట్టవద్దని చెప్పడం లేదు. కానీ మాతృభాషపైన అభిమానం పెంచుకోవడం తప్పుకాదు. అన్యభాషలను ద్వేషించమని అనడం లేదు. కానీ తెలుగు రాష్ట్రాల్లో మమ్మీ, డాడీ చదువులు ఆరంభమైన తర్వాత తెలుగు బోధన తగ్గిపోతున్నది. తెలుగు భాష బోధించే ఎయిడెడ్ పాఠశాలలు దాదాపు కనుమరుగైపోయాయి. ఇంగ్లీషు చదివించడం స్టేటస్ సింబల్‌గా మారిపోయింది. తెలుగు మాట్లాడే వారిని ప్రభుత్వ కార్యాలయాల్లో చిన్నచూపుచూడడం పరిపాటిగా మారిపోయింది. స్వాతంత్య్రం వచ్చినప్పుడు హిందీతో పోటీపడిన తెలుగు క్రమేపీ తన ప్రభావాన్ని కోల్పోతున్నది. తమిళ,కన్నడ, మళయాలం వంటి వాడుకలో ఉన్న ఇరవైఆరు ద్రవిడ భాషల్లో తెలుగుది ఒక ప్రత్యేకస్థానమని చెప్పొచ్చు. ఒకప్పుడు రాజ్యాలేలిన భాషలు క్రమేపీ కనుమరగయ్యే పరిస్థితికి చేరుకుంటున్నాయి. గ్రీకు, లాటిన్, భారత్‌లో సంస్కృతం తదితర భాషల పరిస్థితి అలాగే ఉంది. ఎన్నో దేశాలు మాతృభాషలోనే విద్యాబోధన చేసుకుంటున్నాయి. ఉన్నతస్థాయిలో ఆంగ్లభాషలోకి భావాలను అనువదించుకుంటూ తల్లి భాషను కాపాడుకుంటున్నారు. జపాన్,సింగపూర్, కాంబోడియా, వియత్నాం, థాయిలాండ్ మలేషియా తదితర దేశాల్లో మాతృభాషలోనే పాఠశాల విద్యాబోధన జరుగుతున్నది. ఇక రష్యా,ఫ్రాన్స్, చైనా తదితర దేశాల అధ్యక్షులు ఆంగ్లభాషలో సరైనపరిజ్ఞానం ఉన్నా విదేశీ నాయకులతో తమతమ భాషల్లోనే మాట్లాడుతున్నారు. కానీ తెలుగు రాష్ట్రాల్లో తెలుగులో తమ భావాలను స్పష్టంగా చెప్పగలిగినా, ఆంగ్లంలో వ్యక్తం చేసే పరిజ్ఞానం లేకపోయినా, వచ్చీరాని మాటలతో ప్రయత్నిస్తున్నారే తప్ప స్వచ్ఛమైన తెలుగులో మాట్లాడడం నామూషిగా భావించే రోజులు దాపురించాయి. తెలుగు అమలుకు ఎన్నో చట్టాలు చేశారు. మరెన్నో నిబంధనలు విధించారు. దశాబ్దాలు దాటిపోయినా నేటికీ అవి అమలుకు నోచుకోవడం లేదు. పేరుకు అధికార భాషా సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఏవో నామమాత్రపు అధికారాలు తప్ప కనీసం కార్యాలయాల్లో తెలుగు అమలు చేయని అధికారులపై చర్యలు తీసుకునే అధికారాలు కట్టబెట్టలేదు. గతంలో పనిచేసిన అధికార భాషా సంఘం అధ్యక్షులు జిల్లాల్లో పర్యటించి ఏమేరకు అమలు చేస్తున్నారో, చేయకపోతేఎందుకు చేయలేదంటూ సమీక్షలు, సమావేశాలు పెట్టి సంబంధిత అధికారులను నిలదీసి నోటీసులు ఇచ్చేవారు. ఇప్పుడు ఆపరిస్థితికూడా లేదు. అది అలంకారప్రాయంగా తయారయింది. ప్రాథమిక స్థాయి నుంచి తెలుగు బోధనకు మరింత ప్రాధాన్యత ఇవ్వాలని ఎన్నో ఉపన్యాసాలు ఇచ్చినవారేప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషును ప్రవేశపెడుతున్నారు. జీవిత సారాంశాన్ని వడబోసి రచించిన సుమతీ, వేమన,దశరథి లాంటి శతకాలు కనుమరగైపోయాయి. ఇదంతా ఒక ఎత్తైతే ఉభయ రాష్ట్రాల్లో తెలుగుఅమలులో జరుగుతున్న నిర్లక్ష్యం,అశ్రద్ధ, సామాన్యులను సైతం తీవ్రఇబ్బందులకు గురిచేస్తున్నది. గతంలో ఒకసారి పోలీసు అకాడమీచేసిన సర్వేలో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. బాధితుల్లో చాలావరకు ఆంగ్లభాష పరిజ్ఞానం లేకపోవడం, చార్జ్‌షీట్‌లో ఏం రాశారో తెలియక పోవడంతో న్యాయస్థానం ముందు తడబడడంతో కేసులు వీగిపోతున్నాయి. ఒక్క పోలీసు శాఖకు సంబంధించిందే కాదు ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు ఉండే అనేక విభాగాలలో ఇదే పరిస్థితి నెలకొంటున్నది. స్థానికభాష కొంతైనా వచ్చి ఉండాలని ఆనాటి బ్రిటిష్ పాలకుల నిర్ణయం మేరకు 1816లో భారత్‌కు వచ్చిన సివిల్ ఉద్యోగి చార్లెస్‌ఫిలిప్స్ బ్రౌన్ తెలుగుభాషను నేర్చుకోవడమే కాదు ఏకంగానిఘంటువును రూపొందించి తెలుగు ప్రజలకు మరిచి పోలేని సేవలు అందించారు. సభలు, సమావేశాలు ఏర్పాటు చేసి తెలుగు గురించి గొప్పలు చెప్పుకుంటే చెప్పుకోండి కానీ తెలుగుకు పుట్టినిల్లు అయిన తెలుగురాష్ట్రాల్లోనేతెలుగుకు అన్యాయం జరగడం ఏమాత్రం సమంజసం కాదు.

మాట్లాడిన మాట, వదిలిన బాణం, జరిగిన కాలం, వదులుకున్న అవకాశం ఈ నాలుగు వెనక్కిరావు.



ప్లినీ

సమస్యలు వస్తే గందరగోళపడకు, నువ్వు విజయం సాధించవలసిన పరీక్షలుగా వాటిని భావించి ఎదుర్కో.



స్వామి వివేకానంద

# ప్రజావాక్కు



## మూఢ నమ్మకాల నిర్మూలన చేపట్టాలి

నిన్న కర్ణాటకలోని చిక్ బల్లాపూర్‌లోని ఒక మహిళ ఒక జడ్జి కూర్చునే కుర్చీపై క్షుద్ర పూజలు లాంటివి చేస్తే ఆమెను అరెస్ట్ చేశారు. డెబ్బైతొమ్మిదేళ్ళ స్వతంత్ర భారతంలో ఇలాంటి క్షుద్ర పూజలు నిజమని నమ్మేవారున్నారంటే ప్రభుత్వాలు సిగ్గుపడాలి. గతంలో ఒకసారి కర్ణాటక ముఖ్యమంత్రి యెడ్యూరప్ప కూడా తను నడిచే దారిలో ఎవరో తనకు చేతబడి చేశారని, దారిలో నిమ్మకాయలు, మిరపకాయలు, పసుపు చల్లారని ప్రకటించాడు. అంతే కాదు తనకు కష్టాలురాకుండా ఎవడో సంఖ్యా శాస్త్రజ్ఞుడు చెప్పాడనీ యడ్యురప్పపేరును యడియారప్పగా మార్చుకున్నాడు. అయినా కష్టాలుతీరలేదు. కర్ణాటక లోనే ఇప్పుడు కేంద్ర మంత్రిగా ఉన్నాయన అప్పుడు ముఖ్యమంత్రి, అసెంబ్లీ సమావేశాలు జరిపితే కీడు అని ఎవడో జ్యోతిష్కుడు చెప్పాడనిఅసెంబ్లీ సమావేశాలు కొంతకాలం జరపలేదు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అర్జెంటుగా మూఢ నమ్మకాల నిర్మూలన కార్యక్రమాలు చేపట్టాలి. ప్రజలను చైతన్య వంతులుగా చెయ్యాలి.

- నార్నె వెంకట సుబ్బయ్య, ప్రకాశం జిల్లా

## అభివృద్ధి కమిటీలు ఏర్పాటు చేయాలి

తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం సోషల్ వెల్ఫేర్,ఎస్సి కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రంలోని ప్రతి మండల తహసిల్దార్ అధ్యక్షతన రాష్ట్రంలోని ప్రతి గ్రామంలోని దళిత కమ్యూనిటీ ప్రజల ఆధ్వర్యంలో దళిత గ్రామ అభివృద్ధి కమిటీలను ప్రభుత్వం అధికారికంగా ఏర్పాటు చేయాలి. నూతన సంస్కరణలోభాగంగా గ్రామాలలో ఆర్థికంగా సామాజికంగా రాజకీయంగా వెనుకబడిన దళితుల అభివృద్ధి కోసం దళిత అభివృద్ధి కమిటీలను ఏర్పాటు చేయాలి. ఆకమిటీలలో విద్యావంతులు,మహిళలు, యువకులు, దళిత ఉద్యోగి ఒకరు ఉండే విధంగా కమిటీలు ఏర్పాటు చేయాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్‌జిల్లా

## ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేయాలి

గ్రామాల్లో ప్రతి ఒక్కమనిషికి అర్హులైన పథకాలను, ఆరోగ్యాన్ని అందించే విధంగా ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేయాలి. నిధులు గ్రామపంచాయితీ నుండి విడుదల చేసి అందరి ఆరోగ్యాన్ని, ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నెలలో రెండు సార్లు వివిధ పథకాల పట్ల అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

## పాత భవనాల భద్రత

వర్షాకాలం ప్రారంభమైతే దేశంలోని అనేక నగరాల్లో పాత భవనాల భద్రత మరోసారి చర్చనీయాంశంగా మారుతుంది. ఇటీవల భారీ వర్షాల నేపథ్యంలో ఒక భవనం కూలిపోవడంతో పలువురు శిథిలాల కింద చిక్కుకున్న ఘటన పట్టణాభివృద్ధిలో భవన భద్రత ఎంత కీలకమో గుర్తు చేసింది. ఇది ఒక్క నగరానికే పరిమితమైన సమస్య కాదు. దేశవ్యాప్తంగా పాత భవనాలు, నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన నిర్మాణాలు,సరైన నిర్వహణలేకపోవడం ప్రజలప్రాణాలకు ముప్పుగా మారుతున్నాయి. ముఖ్యంగా వర్షాకాలంలో గోడలు బలహీనపడటం, పునాదులు దెబ్బతినడం వంటి కారణాలతో ప్రమాదాల అవకాశం మరింత పెరుగుతుంది. స్థానిక సంస్థలు పాత భవనాలపై క్రమం తప్పకుండా నిర్మాణ భద్రతా తనిఖీలు నిర్వహించి, ప్రమాదకర భవనాలను గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## పెరుగుతున్న డిజిటల్ మోసాలు

డిజిటల్ యుగంలోసాంకేతికత జీవితం సులభతరం చేస్తున్న కొద్దీ, అదే సాంకేతికతను ఆయుధంగా మలచుకుని మోసాలకు పాల్పడే శక్తులు కూడా పెరుగుతున్నాయి. ఇటీవలి కాలంలో అత్యంత ప్రమాదకరంగా మారుతున్న సైబర్ నేరాలలో కృత్రిమ మేధ ఆధారిత నకిలీ రూపకల్పన మోసాలు ముఖ్యమైనవి. మనిషిముఖం,స్వరం, మాటతీరు, భావప్రకటనలను అసలైనట్లే అనుకరించి నకిలీ దృశ్యాలు, ధ్వనులు సృష్టించడం ఇప్పుడు నేరగాళ్లకు సులభమైంది. వినోదం, పరిశోధన కోసం ఉపయోగించాల్సిన ఈ సాంకేతికత, ప్రజల నమ్మకాన్ని దోచుకునే సాధనంగా మారడం ఆందోళనకరం.ు

- కె.నారాయణస్వామి, నల్గొండజిల్లా

## రీల్స్‌కు బానిస కావొద్దు

నేడు చిన్నా పెద్దా అనే తేడా లేకుండా చాలామంది రీల్స్‌కు బానిసలుగా మారుతున్నారు. చేతిలో ఫోన్ ఉంటే చాలు, గంటల తరబడి రీల్స్‌చూస్తూ కాలం గడిపేస్తున్నారు. కొద్దిసేపు చూడాలని ప్రారంభించిన రీల్స్ గంటల తరబడి సమయాన్ని వృథా చేస్తాయి. దీనివల్ల చదువు, పని, కుటుంబానికి కేటాయించాల్సినసమయం తగ్గిపోతుంది. అంతేకాకుండా ఏకాగ్రత తగ్గి, సృజనాత్మక ఆలోచనలు కూడా మందగిస్తాయి సమయం అమూల్యమైనది. కాలాన్ని వృథా చేసే రీల్స్ కంటే, భవిష్యత్తును నిర్మించే పనులకు ప్రాధాన్యం ఇవ్వడం మంచిది. మీ లక్ష్యాలకు మాత్రమే బానిసలుగా మారండి.

-ఎన్. కృష్ణ, హైదరాబాద్

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి | ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# స్వావలంబనే ఆర్థిక స్థిరత్వానికి ఆలంబన

**ఏ ఒక్కదేశం అన్ని రంగాల్లో స్వయంస్వావలంభన సాధించలేదు. కొన్నిదేశాలు ఎన్ని వనరులున్నా ఏదో ఒక విషయంలో వెనకబడే ఉన్నాయి. అది అగ్రరాజ్యమైనా, అభివృద్ధి చెందుతున్న దేశమైనా, పేద దేశమైనా. ఆయిల్ నిక్షేపాలు అధికంగా ఉన్న దేశాలు కూడా కేవలం చమురు ద్వారా భవిష్యత్తులో ప్రజల అవసరాలు తీర్చే పరిస్థితులు ఉండకపోవచ్చు. రాబోయే పరిణామాలను ఊహించి ప్రతీ ఒక్క దేశం వైజ్ఞానిక, సాంకేతిక రంగాలతోపాటు ప్రజలకు నిత్యావసరమైన ఆహారాన్ని సమకూర్చుకోవడంలో విశేష కృషి చేయాలి. పంటలకు అనుకూలంగా లేని భూములపై పరిశోధనలు జరగాలి. శాస్త్రవేత్తలు తలచుకుంటే సాధ్యం కానిదేమీలేదు. భారతదేశం కూడా భవిష్యత్ అవసరాల దృష్ట్యా శాస్త్ర, సాంకేతిక, అంతరిక్ష రంగాలతోపాటు ఆహార భద్రతకు వీలు కల్పించే వ్యవసాయాన్ని ఇతోధికంగా ప్రోత్సహించాలి.**



సుంకవల్లి సత్తిరాజు

ఆర్థిక స్థిరత్వం దేశాభివృద్ధికి సోపానం. అయితే ప్రపంచంలోని ఇతర దేశాల్లో సంభవిస్తున్న పరిణామాలు అభివృద్ధికి విఘాతం కలిగిస్తున్నాయి. కోవిడ్ మహమ్మారి, ఇరాన్‌పై అమెరికా,ఇజ్రాయిల్‌యుద్ధం, భారత దేశం ఆర్థికంగా నష్టపోయిన విషయం కాదనలేని సత్యం. రష్యా, ఉక్రెయిన్ల మధ్య సంవత్సరాల తరబడి సుదీర్ఘంగా సాగుతున్న యుద్ధం ప్రభావం భారత్‌పై పడలేదు. ప్రపంచమంతా ఆర్థిక మాంద్యంలో కూరుకుపోయినా కొద్ది నెలల క్రితం వరకు భారత్ ప్రపంచంలో నాల్గవ ఆర్థిక వ్యవస్థగా కొనసాగింది. అయితే ట్రంప్ భారత్‌పై సాగిస్తున్న ట్రేడ్ వార్‌తో,హార్మోజ్ జలసంధి వద్ద ఏర్పడిన ప్రతిష్టంబనతో భారత్ ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్న మాట వాస్తవం. ఈ కారణంగానే ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో భారత్ నాల్గవ స్థానం నుండి ఆరవ స్థానానికి పడిపోయింది. రూపాయి విలువ క్షీణించింది. అయితే ఈ పరిస్థితులన్నింటినీ అధిగమించి త్వరలోనే భారత్ ఆర్థికంగా బలపడే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ప్రస్తుత భారతదేశ జిడిపి 4.15 ట్రిలియన్ డాలర్లుగా నమోదు కాబడింది. ఇదే సందర్భంలో ప్రజల జీవన ప్రమాణాల స్థాయి మెరుగపడాలి. యువతను అభివృద్ధిలో భాగస్వామ్యం చేయాలి. ప్రజల జీవన ప్రమాణాల స్థాయి పెంచడమే నిజమైన అభివృద్ధి. భారతదేశం ప్రకృతి సిద్ధమైన వనరులకు పుట్టినిల్లు. సహజ సంపదతోపాటు మానవ వనరులు కూడా విరివిగా ఉండడంతో దేశ ఆర్థికాభివృద్ధికి అత్యంత అనుకూలమైన పరిస్థితులు భారత్‌లో ఉన్నాయి. ఇతర దేశాలు పేరుకి సంపన్న దేశాలుగా, అగ్రరాజ్యాలుగా కొనసాగుతున్నప్పటికీ, ఆయా దేశాల్లో యువశక్తి కొరవడడం వలన,ఇతర దేశాలను బెదిరించి బ్రతకడం, ఆయుధాలను అమ్మి ఆర్థికంగా బలపడడం వంటి చర్యలతో తన అస్థిత్వాన్ని కొనసాగిస్తున్నాయి. భారత దేశంలో ఇలాంటి పరిస్థితులు లేవు. భారత్‌కు యువతరం అత్యంత విలువైన సంపద. నదులు,అడవులు, వ్యవసాయ భూములతోపాటు భూగర్భ జల, ఖనిజ వనరులతో భారతదేశం సిరిసంపదలతో తులతూగే పరిస్థితులున్నాయి. అయితే మనం ఆశించిన కలలు కేవలం కల్లలుగానే మిగిలిపోతున్నాయి. దీనికి గల కారణాలను విశ్లేషించుకుని, దేశాభివృద్ధికి తగిన ప్రణాళికలు రూపొందించుకుని కనీసం రాబోవు తరాలకైనా పేదరికం లేని భారత దేశాన్ని అందించాలి. భారతదేశ ఆర్థిక స్థితిగతులను విశ్లేషణ చేసే ముందు 'స్వాతంత్ర్యానికి ముందు స్వాతంత్య్రం తర్వాత భారతదేశం' అనే అంశం ఆధారంగా దేశ ఆర్థిక అభివృద్ధిని అంచనా వేయాలి. స్వాతంత్య్రం వచ్చేనాటికి 33-34 కోట్ల జనాభా గల భారతదేశం నేడు సుమారు 140 కోట్లకు పెరిగి, జనాభాలో ప్రపంచంలో ప్రథమ స్థానం ఆక్రమించింది. జనాభా పెరిగింది. ప్రజావసరాలు పెరిగాయి. అయితే మనం ఆశించిన స్థాయిలో ప్రజల జీవన ప్రమాణాలు ఇంకా పెరగలేదు. ప్రపంచంలో ఒక బలమైన ఆర్థికవ్యవస్థగాభారత దేశం ఎదిగినట్టు గణాంకాలు చెబుతున్నాయి. అమెరికా,చైనా, జర్మనీ, జపాన్, యు.కెల తర్వాత భారత్ ప్రపంచంలో బలమైన ఆర్థికవ్యవస్థ కలిగిన దేశంగా రూపాంతరం చెందింది. మరోవైపు ప్రపంచ బ్యాంకు 2027వ సంవత్సరానికి గాను భారత జిడిపి వృద్ధి రేటు 6.6 శాతంగా ఉంటుందని తెలిపింది. 2027-28 ఆర్థిక సంవత్సరంలో ఈ వృద్ధిరేటు 7.2 శాతంగా ఉండవచ్చని ఒక అంచనా. జి.డి.పి పెరుగు



దల కోసం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర శ్రమచేయాలి. అభివృద్ధి అంకెల్లో కాకుండా ప్రజల జీవన ప్రమాణాల స్థాయిలోను, ప్రజల వాస్తవ తలసరి ఆదాయంలోను ప్రతిబింబించాలి. ఏది ఏమైనప్పటికీ భారతదేశంలో పెరిగిన జనాభాకు కావలసిన కనీస అవసరాలు తీర్చడంకేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భుజస్కంధాలపై ఉంది. ప్రభుత్వాలు ప్రజలకు కావలసిన మౌలిక సదుపాయాలు కల్పించడానికి ప్రజల వద్ద వివిధరూపాల్లో పన్నులు వసూలు చేస్తున్నాయి. ప్రజల సంపద ప్రజలకు ఖర్చు చేయడం ప్రభుత్వాల విధి. స్వాతంత్య్రం వచ్చిన రోజుల్లో భారతదేశంలో ప్రజలకు కనీస సదుపాయాలు లేవు. విద్య,వైద్య రంగాలు అత్యంత వెనుకబడి ఉన్నాయి. స్వాతంత్య్రం తర్వాత దేశంలో పరిస్థితులు చాలావరకు మారిపోయాయి. విద్యారంగం కొంత పుంతలు తొక్కింది. అక్షరాస్యత పెరిగింది. వ్యవసాయ ఉత్పత్తులు పెరగడంతోదేశం ఆహార సమస్యను అధిగమించింది. విద్యావంతులకు ఉద్యోగ అవకాశాలు పెరిగాయి. ఉపాధికి అనేక మార్గాలు ఏర్పడ్డాయి. ఏ పార్టీ అధికారంలో ఉన్నా దేశ అభివృద్ధి ముఖ్యం. దేశం ముందున్న సవాళ్లను, సమస్యలను అధిగమించడానికి కేంద్రం, రాష్ట్రాలు కలసి పని చేయాలి. అయితే రానురాను అలాంటి భావన అడుగంటుతున్నది. రాజకీయ లక్ష్యాల కోసం జరిగే పోరాటంలో ప్రజలు పరాజితులౌతున్నారు. రాజకీయ వైరం అభివృద్ధికి శరాఘాతంలా మారుతున్న పరిస్థితులు నెలకొంటున్నాయి. ఇలాంటి పరిణామాలు దేశాభివృద్ధికి అవరోధం కలిగిస్తాయి. దేశంలో ఫెడరల్ వ్యవస్థ మనుగడలో ఉంది. రాష్ట్రాలు చెల్లించే పన్నులతో కేంద్రం వివిధ రాష్ట్రాలకు నిధులు కేటాయిస్తూ, దేశ భద్రత దృష్ట్యా కొన్ని విశిష్ఠ అధికారాలను రాజ్యాంగబద్ధంగా తనవద్ద కేంద్రీ కరించుకోవడం జరిగింది. రాష్ట్రాలు అభివృద్ధి చెందకపోతే దేశం కూడా అభివృద్ధి సాధించలేదు. కేంద్రంలో ప్రభుత్వాలు ఎలా ఏర్పడుతున్నాయో, రాష్ట్రప్రభుత్వాలు కూడా అదే పద్ధతిలో ప్రజాస్వామ్య బద్ధంగా ఏర్పడుతున్న మాటవాస్తవం. ప్రజలు చెల్లించే పన్నులతో నడుస్తున్న ప్రభుత్వాలు ప్రజలకు జవాబుదారీతనంతో కూడిన బాధ్యతను నిర్వర్తించాలి. ఇటీవలి కాలంలో కేంద్ర ప్రభుత్వం దక్షిణాది రాష్ట్రాలను చులకనగా చూస్తున్నదని, డీ లిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాల ప్రాధాన్యత తగ్గించాలని చూస్తున్నదనే ఆరోపణల్లో వాస్తవమెంత? కొన్ని రాష్ట్రాల నుండి అధిక పన్నులురాబడుతూ ఆ రాష్ట్రాల వాటా పట్ల వివక్షభావం ప్రదర్శిస్తున్నదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ వాదన ఇందుకు భిన్నంగా ఉంది. తాము అన్ని రాష్ట్రాల పట్ల సమభావంతోనే ఉన్నట్టు చెబుతున్నది. ఏ ఒక్కదేశం అన్ని రంగాల్లో స్వయంస్వావలంభన సాధించలేదు. కొన్నిదేశాలు ఎన్ని వనరులున్నా ఏదోఒక విషయంలో వెనకబడే ఉన్నాయి. అది అగ్రరాజ్యమైనా,అభివృద్ధి చెందుతున్న దేశమైనా, పేద దేశమైనా. ఆయిల్ నిక్షేపాలు అధికంగా ఉన్న దేశాలు కూడా కేవలం చమురు ద్వారా భవిష్యత్తులో ప్రజల అవసరాలు తీర్చే పరిస్థితులు ఉండకపోవచ్చు. రాబోయే పరిణామాలను ఊహించి ప్రతీ ఒక్క దేశం వైజ్ఞానిక,సాంకేతిక రంగాలతోపాటు ప్రజలకు నిత్యావసరమైన ఆహారాన్ని సమకూర్చుకోవడంలో విశేష కృషి చేయాలి. పంటలకు అనుకూలంగా లేనిభూములపై పరిశోధనలు జరగాలి. శాస్త్రవేత్తలు తలచుకుంటే సాధ్యం కానిదేమీలేదు. భారతదేశం కూడా భవిష్యత్ అవసరాల దృష్ట్యా శాస్త్ర,సాంకేతిక,అంతరిక్ష రంగాలతో పాటు ఆహార భద్రతకు వీలు కల్పించే వ్యవసాయాన్ని ఇతోధికంగా ప్రోత్సహించాలి. ప్రస్తుత ప్రపంచ ఆర్థిక సంక్షోభ పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయానికి,వ్యవసాయ ఆధారిత రంగాలకు పెద్దపీట వేయాలి. మన ఆలోచనలు అభివృద్ధి వైపే సాగాలి తప్ప, శాశ్వతం కాని పదవుల చుట్టూ పరిభ్రమించకూడదు. రాజకీయాలు ప్రజాజీవితానికి ఇబ్బంది కలిగించకూడదు. యువశక్తికి దేశాభివృద్ధిలో కీలక భాగస్వామ్యం కల్పించాలి. దేశ ప్రజల తలసరి ఆదాయం వాస్తవంగా ఉన్నత స్థితికి తీసుకురావాలి. నాణ్యమైన జీవన ప్రమాణాలు నెలకొల్పాలి. విద్య, వైద్య రంగాలను ఉన్నతంగా తీర్చిదిద్ది అందరికీ ఉచితంగా విద్య అందించాలి. స్వల్పకాలిక, దీర్ఘకాలిక ప్రణాళికలతో భారత దేశ ప్రగతి చక్రాలను సక్రమమైన పంథాలో నడిపించాలి. సరిహద్దు దేశాలపట్ల భారత్ జాగరూకత వహించాలి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రదర్శిస్తున్న భారత్ వ్యతిరేక వైఖరిని రాబోవు అమెరికా నేతలు కొనసాగించబోరనే గ్యారంటీలేదు. కనుక డాలర్‌తో ముడిపడిన దిగుమతులను సాధ్యమైనంతగా తగ్గించుకుని, విదేశీ మారకద్రవ్య నిల్వలనుపెంచుకోవడానికి భారత్ కృషి చేయాలి. ●

# సవాళ్లను అధిగమిస్తేనే సాంకేతికంగా ముందడుగు

వనకల్ల వీరప్ప


రక్షణ, టెలికాం, ఆటోమొబైల్స్,ఏఐ,ఆరోగ్య సంరక్షణ... ఇలా నేడు అన్నింటికీ సెమీకండక్టర్లు ప్రాణావసరాలుగా మారాయి. ఆధునిక సాంకేతిక జగత్తుకు మెదడుగా, 21వ శతాబ్దపు చమురుగా అవి గుర్తింపుపొందాయి. వాటి తయారీపై ఆలస్యంగా దృష్టిసారించిన ఫలితంగా ప్రస్తుతం దేశానికి కావాల్సిన చిప్‌లలో 90శాతానికి పైగా దిగుమతులే దిక్కవుతున్నాయి. కొవిడ్ సమయంలో సరఫరాలు స్తంభించి పరిశ్రమలు కుదేలయ్యాయి. ఈ దురవస్థను తప్పించేందుకు చిప్‌లను స్థానికంగానే డిజైన్ చేసుకోవడంతోపాటు తయారీ, ప్యాకేజింగ్, టెస్టింగ్ తదితరాల్లో స్వావలంబన సాధించేందుకు ఇండియా నడుంకట్టింది. అందుకు ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తోంది. ఆదిలోనే సంక్లిష్ట చిప్‌ల జోలికి వెళ్లకుండా దేశవిస్తృత ప్రయోజనాల రీత్యా వ్యూహాత్మకంగా ముందుకు సాగాలని నీతి ఆయోగ్ రోడ్‌మ్యాప్ ఇటీవల సూచించింది. ఈ క్రమంలోనే గుజరాత్‌లోని సానంద్‌లో జపాన్, థాయ్‌లాండ్ సంస్థల సహకారంతో సిద్ధమైన కర్మాగారాన్ని ప్రధానమంత్రి మోడీ మొన్న ప్రారంభించారు. ఇది గడిచిన నాలుగు నెలల వ్యవధిలో పట్టాలకెక్కిన మూడో సెమీకండక్టర్ పరిశ్రమ కావడం విశేషం. ఏడాదికి 20కోట్ల చిప్‌లతో మొదలుపెట్టి,రాబోయే రోజుల్లో కొత్త ప్లాంటు తయారీ సామర్థ్యాన్ని 500 కోట్లకు తీసుకెళ్లాలన్నది లక్ష్యం. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే ఇక్కడినుంచి విదేశాలకూ ఎగుమతులు సుసాధ్యమై 'మేకిన్ ఇండియా' ప్రస్థానం మరోమెట్టుకు చేరుతుంది! దేశీయంగా సెమీకండక్టర్ల వినియోగం ప్రస్తుతంతో పోలిస్తే, 2030 నాటికి రెట్టింపవుతుందని అంచనా. పీఎల్ఐ వంటిపథకాల కారణంగా మొబైళ్ల తయారీలో ఇండియా ప్రపంచంలోనే రెండోస్థానానికి చేరింది. ఎలక్ట్రానిక్ పరికరాల ఉత్పత్తిసైతం కొన్నేళ్లుగా జోరందుకుంది. దాంతో సెమీకండక్టర్ల అవసరం అధికమైంది. వాటికోసం చైనా, తైవాన్, హాంకాంగ్, దక్షిణ కొరియా, జపాన్ వంటి దేశాలపై ఆధారపడాల్సి వస్తోంది. గడిచిన తొమ్మిదేళ్లలో సెమీకండక్టర్ ఉత్పత్తులకు భారతావని 15వేల కోట్లడాలర్ల విదేశ మారకద్రవ్యాన్ని ధారపోసింది. ఈ పరాధీనతలోంచి బయటపడేందుకు ఇప్పటిదాకా రూ.1.64 లక్షల కోట్ల విలువైన 12సెమీకండక్టర్ తయారీ ప్రాజెక్టులకు ఇండియా ఆమోదం తెలిపింది. డిజైన్ అనుసంధానిత ప్రోత్సాహక పథకం కింద 24 చిప్ రూపకల్పన ప్రాజెక్టులకూ ఊతమిస్తోంది. జపాన్, నెదర్లాండ్స్ వంటి దేశాలతో కుదుర్చుకున్న ఒప్పందాలతో ముడిసరుకులు,యంత్రాల సరఫరాలకు ఇబ్బందులు లేకుండాచూసుకుంటోంది. అందులో భాగంగానే అమెరికా నేతృత్వంలోని 'ప్యాక్స్‌సిలికా'లోనూ భాగమైంది. ఇలా ఈరంగంలో ఆత్మనిర్భరత కోసం ప్రణాళికాబద్ధంగా కృషి జరుగుతున్నప్పటికీ, ఇండియా అధిగమించాల్సిన సవాళ్లూ కొన్ని ఉన్నాయి! మైక్రో చిప్‌ల తయారీకి నిరంతరం విద్యుత్, నీటి లభ్యత తప్పనిసరి. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా దేశీయంగా ఆ మౌలిక వసతులు పాదుకొనాల్సి ఉంది. ప్రపంచవ్యాప్త చిప్ డిజైనర్లలో 20శాతం భారతీయులే అయినప్పటికీ వాటి తయారీలో నేరుగా పనిచేయగలిగిన సాంకేతిక నిపుణుల లేమి వేధిస్తోంది. సెమీకండక్టర్లకు అత్యవసరమైన ముడిసరకుల కోసమూ విదేశాల వైపు చూడాల్సి వస్తోంది. సెమీకండక్టర్ల సరఫరా గొలుసులో ప్రపంచానికి విశ్వసనీయ గమ్యస్థానంగా ఎదగాలన్న భారత్ కల నెరవేరాలంటే వీలైనంత వేగంగా సంబంధిత ఆవరణ వ్యవస్థను పటిష్ఠం చేసుకోవాలి. ●

# విద్యాలయాల్లో కులవివక్షను ప్రక్షాళన చేయాలి



పాపని నాగరాజు

ఒక దేశం తన ఉన్నత విద్యాసంస్థల్లో జరిగే కుల వివక్షను స్వయంగా అధ్యయనం చేసి, పంతొమ్మిదేళ్ల తర్వాత అదే వివక్షను మళ్ళీ అధ్యయనం చేయాల్సి రావడం కాకతాళీయం కాదు. అది ఒక వ్యవస్థతనను తాను దిద్దుకోలేని నిర్మాణాత్మక వైఫల్యానికి రుజువు. 2026లో సుఖదేవ్ థోరట్ నేతృత్వంలోని కమిటీ ఢిల్లీ ఎయిమ్స్‌లో 76శాతం మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులను పరీక్షకులు నేరుగా కులం అడిగినట్లు, 84 శాతం మంది మార్కులు కులం కారణంగా ప్రభావితమయ్యాయని చెప్పినట్లు నమోదు చేసింది. 88శాతం మంది హాస్టళ్లలో సామాజిక ఏకాంతవాసాన్ని అనుభవించారు. ఈ నివేదికను ప్రభుత్వమే స్వయంగా ఏర్పాటు చేసినప్పటికీ, ఎయిమ్స్ యాజమాన్యం దానిని తిరస్కరిస్తూ ఢిల్లీ హైకోర్టుకెళ్లింది. నాలుగేళ్లపాటు ఏ సిఫారసూ అమలు కాలేదు. ఈ నిర్లక్ష్యానికి మూల్యం ఎవరు చెల్లించారో చరిత్ర చెబుతుంది. అహ్మదాబాద్‌కు చెందిన ప్లంబర్ కుమారుడు దర్శన్ సోలంకి, ముంబై ఐఐటీలో కెమికల్ ఇంజనీరింగ్ చదువుతూ, తన కులం కారణంగా రూమ్మేట్ల ఎగతాళిని భరించలేక 2023లో ప్రాణం తీసుకున్నాడు. యాజమాన్యం అతని మరణాన్ని విద్యాపరమైన ఒత్తిడిగా చిత్రీకరించే ప్రయత్నం చేసింది. రూర్కీ ఐఐటీలో వైమానిక దళ అధికారి కుమారుడు మనీష్ కుమార్ గుడ్డోలియన్, తన సహవిద్యార్థుల కుల దూషణలను, హాస్టల్ వార్డెన్ నిర్లక్ష్యాన్ని తట్టుకోలేక 2011లోనే ఐదో అంతస్తు నుండి దూకి ప్రాణాలు తీసుకున్నాడు. ఈ ఇద్దరి మధ్య పన్నెండేళ్ల అంతరం ఉన్నా కథ ఒక్కటే. వ్యక్తిగత దూషణ చేసేవారిని గుర్తించడం సులభమే, కానీ వారిని కాపాడే సంస్థాగత నిర్మాణాన్ని ఎవరూ ప్రశ్నించరు. ఈ సంస్థాగత నిర్మాణాన్నే 2025లో సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన జస్టిస్ ఎస్ రవీంద్ర భట్ నేతృత్వంలోని జాతీయ టాస్క్ ఫోర్స్ నిర్ధారించింది. ఢిల్లీ ఐఐటీలో ఆయుష్ అశ్న, అనిల్‌కుమార్ అనే ఇద్దరు దళిత విద్యార్థుల మరణాలను హత్యలుగా భావించిన తల్లిదండ్రులు, ఎఫ్ఐఆర్ నమోదుకు ఢిల్లీ హైకోర్టు నిరాకరించడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. రెండు లక్షల నలభై మూడు వేల మంది విద్యార్థులను, రెండు వేల నూట పంతొమ్మిది సంస్థలను సర్వే చేసిన ఈ టాస్క్ ఫోర్స్, ఆత్మహత్యల నివారణకు ప్రత్యక్షమైన శాసనపరమైన చట్టం దేశంలో పూర్తిగా లేకపోవడమే అత్యంత స్పష్టమైన లోపమని పేర్కొంది. 65 శాతం సంస్థల్లో మానసిక ఆరోగ్య సేవలే లేవు, 73శాతంలో పూర్తికాల నిపుణుడు లేడు. అమెరికా, జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాల్లో సంస్థాగత జవాబుదారీతనాన్ని తప్పనిసరి చేసేచట్టాలున్నా, భారత్‌లో అలాంటి చట్టం లేకపోవడాన్ని టాస్క్ ఫోర్స్ నేరుగా ఎత్తిచూపింది. ఐఐటీ మద్రాస్‌లో పీహెచ్‌డీ స్కాలర్ సచిన్ కుమార్ జైన్ మరణానికి కారణమైన అధ్యాపకుడిని సస్పెండ్ చేసిన తర్వాత ఆ క్యాంపస్‌లో మళ్ళీ ఆత్మహత్య



నమోదు కాలేదు. జవాబుదారీతనం చూపిస్తే ఫలితం ఉంటుందనడానికి ఇదొక్కటే మనకు కనిపించే ఉదాహరణ. ఇక్కడే ఈ సమస్య కేవలం దళిత సమస్యగా మిగలదని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. 2014 నుండి2021 మధ్య ఐఐటీలు, ఐఐఎంలు, కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో ఆత్మహత్యకు పాల్పడిన 122 మందిలో 24 మంది ఎస్సీలు, ముగ్గురు ఎస్టీలు అయితే, 41 మంది అధికారికంగా ఇతర వెనుకబడిన తరగతులుగా పిలవబడే వర్గానికి చెందినవారు. మొత్తం మరణాల్లో 55 శాతం ఈమూడు వర్గాలవే. అయితే సంస్థల్లో వీరి ప్రాతినిధ్యం జనాభా నిష్పత్తి కంటే చాలా తక్కువ. దళిత ఆదివాసీ బహుజన మరణాలను వేర్వేరు చూసే ధోరణి, కులం, వర్గం ఏకకాలంలో పనిచేసే అణచివేత యంత్రాంగాన్ని దాచిపెడుతుంది. జ్యోతిరావు ఫూలే విద్యను శూద్రాతిశూద్రులకు బ్రాహ్మణీయ జ్ఞాన గుత్తాధిపత్యం నుండి విముక్తి కలిగించే ఆయుధంగా చూశాడు. అతని దృష్టిలో పాఠశాల భవనం కేవలం ఇటుకల నిర్మాణం కాదు, అది సామాజిక అధికార పునఃపంపిణీ వేదిక. ఆ దృష్టికోణం నుండి చూస్తే, నేటి మెరిట్ భావన కులం, తరగతి కలయిక సృష్టించిన సామాజిక, సాంస్కృతిక వనరులను తటస్థమైన ప్రతిభగా చిత్రీకరించే భావజాల ఆయుధం మాత్రమే. అందుకే రిజర్వేషన్ ద్వారా వచ్చిన ప్రతి విద్యార్థి అనర్హుడుగా ముద్రవేయబడతాడు. యాజమాన్య కోటాల ద్వారా వచ్చినవారు ఎన్నడూ ఆ ముద్రను భరించరు. మార్క్స్ చెప్పిన మిగులు విలువ దోపిడీ సూత్రం ఇక్కడ మరో రూపంలో కనిపిస్తుంది. క్యాంపస్ ప్లేస్‌మెంట్ దొరకని 38 శాతం గ్రాడ్యుయేట్ల వాస్తవాన్ని సంస్థలు దాచిపెడుతూ, ఫలితాన్ని విద్యార్థి వ్యక్తిగత లోపంగా చిత్రీకరిస్తాయి. చదువును వస్తువుగా, డిగ్రీని అమ్మకం సరుకుగా మార్చిన ప్రైవేటీకరణ క్రమంలో, అట్టడుగు వర్గాల విద్యార్థి మరణం కేవలం సామాజిక దుర్ఘటనకాదు, పెట్టుబడితనకు లాభసాటికాని శ్రామికశక్తిని వదిలించుకునే క్రూరమైన యంత్రాంగంలో భాగంకూడా. ఈ నిర్వీర్యీకరణ కొత్తది కాదు. తెలుగునేలపై దీనికి స్పష్టమైన చరిత్రఉంది. వెయ్యితొమ్మిది వందల తొంభై రెండులో నేదురుమల్లి జనార్దన్ రెడ్డి ప్రభుత్వం పన్నెండు ప్రైవేట్ మెడికల్, ఎనిమిది డెంటల్ కాలేజీలకు దొడ్డిదారిన అనుమతులిచ్చి క్యాపిటేషన్ ఫీజుల దందాకు తెరలేపినప్పుడు, కామ్రేడ్ మారోజు వీరన్న నాయకత్వంలో పీడీఎస్‌యూ మిగతా విద్యార్థిసంఘాలను ఏకంచేసింది. తెలుగు యువత అసెంబ్లీ, సెక్రటేరియట్ ముట్టడిలతో ప్రభుత్వాన్ని ఊపిరాడకుండా చేసింది. హైకోర్టు ఆ జీవోలను రద్దు చేసి సీఎం అధికార దుర్వినియోగాన్ని తప్పుబట్టడంతో నేదురుమల్లి పదవి నుండి దిగిపోవాల్సి వచ్చింది. తర్వాత వచ్చిన కోట్ల ప్రభుత్వంలో వైద్య మంత్రి సమరసింహారెడ్డి విద్యార్థులపై లాఠీఛార్జీలు చేయించినా, ఆ ఒత్తిడి కొనసాగి చివరికి ఆయనే బర్తరఫ్ అయ్యారు. ఐక్యవిద్యార్థి శక్తి పాలకుల పీఠాలను కదిలించగలదని రుజువైన ఏడాది అది. కురుక్షేత్ర జాతీయ సాంకేతిక సంస్థలో రెండునెలల్లో నలుగురు, గోవా బిట్స్‌పిలానీలో పదిహేను నెలల్లో ఆరుగురు మరణించడం ఈసమస్య రాజకీయ సరిహద్దులు దాటిందని చూపుతుంది. కానీపరిష్కారం రాజకీయ పార్టీల విద్యార్థి సంఘాల నీడల్లో దొరకదు. సమకాలీన అంశాలపై విద్యార్థి సంఘాలు స్పందించడంలేదు, ఐక్య ఉద్యమాలకు ప్రాధాన్యత ఇవ్వడం లేదు, వాళ్లకి వాళ్లు అని కుంచించుకుపోతున్నారు. నాటి ఐక్యత నేటి విద్యార్థి రాజకీయాల్లో పూర్తిగా కనుమరుగైంది. పరిష్కారం రాజకీయ పార్టీల విధేయతలో లేదు, సంస్థాగత జవాబుదారీతనాన్ని చట్టబద్ధం చేయడంలో, బహుజన విద్యార్థి శక్తులను తిరిగి ఐక్యం చేయడంలో ఉంది. ●

# సాగుకు రూ. 32.50 లక్షల కోట్ల రుణాలు



## వ్యవసాయరంగానికి క్షేత్రస్థాయి పరపతి కింద భారీగా రుణ పంపిణీ: కేంద్రం

## గ్రామీణ రుణ వ్యవస్థ 13 శాతం విస్తరణ

**న్యూఢిల్లీ, జూలై 16:** దేశంలోని వ్యవసాయ రంగానికి అందుతున్న సంస్థాగత రుణాల పంపిణీ గణనీయంగా పెరిగింది. ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ రంగానికి క్షేత్రస్థాయి పరపతి కింద రూ.32.50 లక్షల కోట్ల రుణాలు పంపిణీ చేసినట్లు కేంద్ర ప్రభుత్వం గురువారం విడుదల చేసిన అధికారిక ఫ్యాక్ట్‌షీట్ వెల్లడించింది. ఇది 2014-15 ఆర్థిక సంవత్సరంలో నమోదైన రూ.8 లక్షల కోట్లతో పోలిస్తే నాలుగు రెట్లకు పైగా పెరిగింది. ఫ్యాక్ట్‌షీట్ ప్రకారం, 2014-15 నుంచి 2023-24 మధ్యకాలంలో గ్రామీణ రుణ వ్యవస్థ సగటున ప్రతి ఏడాది 13 శాతం చొప్పున విస్తరించింది. వ్యవసాయం, అనుబంధ రంగాలకు స్వల్ప కాలిక, దీర్ఘకాలిక రుణాల కోసం బ్యాంకులకు అవసరమైన నిధులను సమకూర్చేందుకు నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ (నాబార్డ్) రీఫైనాన్స్ సౌకర్యాన్ని కల్పిస్తూ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో అధికారిక ఆర్థిక సేవల విస్తరణ వేగంగా పెరుగుతున్నట్లు నాబార్డ్ నిర్వహించిన రూరల్ ఎకనామిక్ కండిషన్స్ అండ్ సెంటిమెంట్స్ సర్వే (మే2026) స్పష్టం చేసింది. సర్వేలో పాల్గొన్న గ్రామీణ కుటుంబాల్లో 77.2 శాతం మంది తమ వినియోగ వ్యయం పెరిగిందని తెలిపారు. ఇది గ్రామీణ ప్రజల కొనుగోలు శక్తి పెరగడంతో పాటు స్థిరమైన డిమాండ్ కొనసాగుతోందని సూచిస్తోంది. అధికారిక బ్యాంకింగ్‌వ్యవస్థద్వారా రుణాలు పొందుతున్న కుటుంబాల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. సుమారు 51 శాతం కుటుంబాలు పూర్తిగా అధికారిక ఆర్థిక సంస్థల నుంచే రుణాలు పొందుతుండగా, మరో 27 శాతం కుటుంబాలు అధికారిక, అనధికారిక రెండు మార్గాల ద్వారా రుణ సదుపాయాలను వినియోగిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలు కూడా విస్తరించాయి. 2014లో గ్రామీణ ప్రాంతాల్లో షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకుల శాఖలు 41,464 ఉండగా, 2025 జూలై నాటికి అవి 35 శాతానికి పైగా పెరిగి 56,193 శాఖలకు చేరుకున్నాయి. ఇవి గ్రామీణ రుణాల పంపిణీలో కీలక పాత్ర పోషిస్తున్నాయి.

ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు (ఆర్‌ఆర్‌బీలు) దేశంలోని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 700 జిల్లాల్లో 22 వేలకుపైగా శాఖలతో సేవలందిస్తున్నాయి. సహకార బ్యాంకులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పిఎసిఎస్) కూడా గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ అలవాట్లను పెంపొందించడంతో పాటు సంస్థాగత రుణాల విస్తరణలో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నాయి. ఆర్‌బిఐ, నాబార్డ్ గణాంకాల ప్రకారం దేశంలో 1,458 పట్టణ సహకార బ్యాంకులు, 34 రాష్ట్ర సహకార బ్యాంకులు, 352 జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలకు నిరంతరాయంగా రుణాలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం పలు విధానాలను అమలు చేస్తోంది. రిజర్వ్ బ్యాంక్ నిర్దేశించిన ప్రాధాన్యతారంగ రుణాల విధానం అమల్లో ఉంది. అన్ని బ్యాంకులు తమ సవరించిన నికర బ్యాంకు రుణాల్లో కనీసం 18 శాతం వ్యవసాయ రంగానికి కేటాయించాల్సి ఉంటుంది. పేదరిక నిర్మూలన లక్ష్యంగా అమలవుతున్న దీనదయాళ్ అంత్యోదయ యోజన-జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ కూడా గ్రామీణ పేద కుటుంబాలకు కీలకంగా మారింది.

ఈ పథకం ద్వారా గ్రామీణ పేదలను స్వయం సహాయక సంఘాలుగా (ఎస్‌హెచ్‌జిలు) ఏర్పాటు చేసి, వారి ఆదాయాన్ని పెంచడంతో పాటు జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు సహకారం అందిస్తున్నారు. ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా అమలులో ఉండగా, 2026 జూలై 10 నాటికి 19.83లక్షలకుపైగా స్వయం సహాయక సంఘాలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. పథకం ప్రారంభం నుంచి ఇప్పటివరకు ఈ సంఘాలకు మొత్తం రూ.13.28 లక్షల కోట్ల రుణాలు పంపిణీ చేసినట్లు ఫ్యాక్ట్‌షీట్ వెల్లడించింది.



## మయన్మార్ తీరంలో రెండు శరణార్థి పడవలు బోల్తా

### 500 మంది మృతిచెందినట్లు యుఎన్ ధ్రువీకరణ

**నేయ్‌పిఇడావ్, జులై 16:** ప్రాణాలకు రక్షణ, మెరుగైన జీవన పరిస్థితుల కోసం శరణార్థులు ప్రమాదకర స్థితిలో సముద్ర ప్రయాణాలు చేస్తున్నారు. ఈ క్రమంలో చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఇటీవల శరణార్థులతో వెళ్లిన రెండు పడవలు మయన్మార్ తీరంలో బోల్తాపడి ఉండవచ్చని ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థలు తెలిపాయి. ఆపడవల్లో మొత్తం 500 మంది ఉన్నారని, వారంతా మరణించి ఉండవచ్చని పేర్కొన్నాయి. ప్రాథమిక సమాచారం ఆధారంగా ఈ రెండు పడవలు జూన్ చివరలో మయన్మార్‌లోని రఖైన్ రాష్ట్రం నుంచి బయలుదేరాయని, వాటిలో ఎక్కువమంది రోహింగ్యా జాతికి చెందిన ప్రయాణికులేనని అంతర్జాతీయ వలససంస్థ, ఐక్యరాజ్య సమితి శరణార్థుల సంస్థ సంయుక్త ప్రకటనలోతెలిపాయి. బంగ్లాదేశ్‌లోని శరణార్థి శిబిరాల నుంచి వచ్చిన కొందరూ ఆ పడవల్లో ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనల్లో 500 మందికిపైగా మృతి చెందినట్లు భావిస్తున్నామని పేర్కొన్నాయి. అయితే ఈ ఘటనలు, మృతుల సంఖ్యపై ఇంకా అధికారికంగా ధ్రువీకరణ రాలేదని, అయినా భారీగా ప్రాణనష్టం జరిగి ఉండవచ్చన్న అంశంపై యుఎన్‌హెచ్‌సిఆర్, ఐఒఎం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయని సంయుక్త ప్రకటనలో ఆ సంస్థలు పేర్కొన్నాయి. ఐక్యరాజ్య సమితి సంస్థల సమాచారం ప్రకారం.. తొలి పడవ బయలుదేరిన కొద్దిసేపటికే దానితో సంబంధం తెగిపోయింది. అందులో దాదాపు 250 మంది ఉన్నారు. 280 మందితో ప్రయాణించిన రెండు పడవ జూలై 8న మయన్మార్‌లోని ఇరావడీ తీరంలో బోల్తాపడి ఉండొచ్చని భావిస్తున్నారు.

## 'సైనికులకు టెస్టోస్టిరాన్ పరీక్షలు తప్పనిసరి'

### అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సేత్



**వాషింగ్టన్, జులై 16:** అమెరికా సైన్యాన్ని మరింత సమర్థంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో పెంటగాన్ మరో కీలక నిర్ణయం తీసుకుందని ఆ దేశ రక్షణ మంత్రి పీట్ హెగ్సేత్ ప్రకటించారు. యుద్ధ సామర్థ్యాన్ని పెంచే చర్యల్లో భాగంగా సైనికుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా 30 యేళ్లు దాటిన సైనికులకు హార్మోన్ పరీక్షలను తప్పనిసరి చేస్తూ కొత్త విధానాన్ని అమలులోకి తెచ్చినట్లు వెల్లడించారు. పెంటగాన్ ప్రకటించిన కొత్త నిబంధనల ప్రకారం.. యాక్టివ్ డ్యూటీ, రిజర్వ్ విభాగాల్లో పనిచేస్తున్న 30 యేళ్లు పైబడిన సైనికులందరికీ టెస్టోస్టెరాన్ లోపం ఉందా? లేదా? అనే పరీక్ష తప్పనిసరిగా నిర్వహించనున్నారు. ప్రతి యేడాది జరిగే పీరియాడిక్ హెల్త్ అసెస్‌మెంట్‌లో ఈ పరీక్షను భాగంగా చేర్చారు. 30 యేళ్లలోపు ఉన్న సైనికులు కోరితే స్వచ్ఛందంగా ఈ పరీక్ష చేయించుకునే అవకాశం కల్పించారు. రక్షణ శాఖ మంత్రి పీట్ హెగ్సేత్ ఆదేశాల మేరకే ఈ కొత్త విధానాన్ని అమలు చేస్తున్నట్లు పెంగాన్ ప్రధాన ప్రతినిధి సాన్ పార్నెల్ తెలిపారు.

సైనికుల్లో దీర్ఘకాలిక ఒత్తిడి, హార్మోన్ లోపం, శారీరక సామర్థ్యం తగ్గడం వంటి సమస్యల సమాహారం అయిన 'ఆపరేషన్ సింద్రోమ్' సమస్యను ఎదుర్కోవడం, యుద్ధ సన్నద్ధతను మరింత బలోపేతం చేయడం ఈ నిర్ణయం వెనుక ప్రధాన ఉద్దేశమని వివరించారు. ఈ పరీక్షల ద్వారా సైనికుల ఆరోగ్య పరిస్థితిపై సమగ్ర సమాచారం సేకరించనున్నట్లు పెంటగాన్ తెలిపింది. అవసరమైన వారికి టెస్టోస్టెరాన్ చికిత్స అందించి, సైనిక దళాన్ని ఆరోగ్యంగా, సమర్థంగా ఉంచాలని భావిస్తోంది.



## సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్యం నిరంతర పర్యవేక్షణ చేయాలి

### కేంద్రం, ఢిల్లీ ప్రభుత్వాలకు హైకోర్టు ఆదేశం

**న్యూఢిల్లీ,జులై 16:** పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్ష 19వ రోజుకు చేరింది. ఈ నేపథ్యంలో ఢిల్లీ హైకోర్టు కేంద్ర, ఢిల్లీ ప్రభుత్వాలకు కీలక ఆదేశాలు ఇచ్చింది. వాంగ్‌చుక్ ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షించాలని, అవసరమైతే ఆయనకు వైద్యసాయం అందించాలని సూచించింది. ప్రతి ప్రాణం విలువైందేనన్న న్యాయస్థానం.. సొలిసిటర్ జనరల్‌ను ఆయన ఆరోగ్యం గురించి ప్రశ్నించింది. రోజుల తరబడి ఆహారం తీసుకోకపోవడంతో వాంగ్‌చుక్ ఆరోగ్యం విషమిస్తోంది. ఇదే పరిస్థితి కొనసాగితే ఆయన శరీర అవయవాలు దెబ్బతినే ప్రమాదం ఉందని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. కాగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జూన్ 28 నుంచి సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్ష చేస్తున్నారు. నీట్ పేపర్ లీకేజీ ఆరోపణల నేపథ్యంలో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో ఆయన ఈదీక్ష చేస్తున్నారు. గత 18రోజులుగా ఆహారం తీసుకోకపోవడంతో ఆయన ఆరోగ్యం క్షీణిస్తోంది. దాంతో ఆయన దీక్ష విరమించాలని ప్రతిపక్ష నేతలు కోరుతున్నారు. సోనమ్ వాంగ్‌చుక్ నిరాహారదీక్ష 19వరోజుకుచేరడం,ఆయన ఆరోగ్యం దెబ్బతింటున్న నేపథ్యంలో ఢిల్లీ హైకోర్టులో పిల్ దాఖలైంది. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన హైకోర్టు సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించింది.

## మేం పాక్‌లో భాగం కాదు.. బలవంతంగా ఆక్రమించారు

### - పివోకేలో నేతల వెల్లడి

**ముజఫరాబాద్,జులై 16:** పాక్ ఆక్రమిత కశ్మీర్ ప్రాంతంలో ఇస్లామాబాద్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్థానిక ప్రజలు, నాయకులు పెద్ద ఎత్తున తిరుగుబాటుకు దిగారు. అక్కడ జరిగిన ఒక భారీ బహిరంగ సభలో నిరసనకారులను ఉద్దేశించి స్థానిక నాయకుడు అమ్జాద్ అయూబ్ మీర్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు తీవ్ర సంచలనం రేపుతున్నాయి. ఈప్రాంతం స్వతంత్రమైనది కాదని, పాకిస్థాన్ సైనిక బలగాలు దీనిని అక్రమంగా ఆక్రమించుకున్నాయని ఆయన బహిరంగంగానే ప్రకటించారు. ఈ నిరసన ర్యాలీలో నాయకులు మాట్లాడుతూ దశాబ్దాలుగా పాకిస్తాన్ పాలకులు తమ ప్రాంతంలోని సహజ వనరులను, ముఖ్యంగా నీటిని, జలవిద్యుత్‌ను పూర్తిగా దోచుకుంటున్నారని ఆరోపించారు. తమ ప్రాంతంలోనే విద్యుత్ ఉత్పత్తి అవుతున్నప్పటికీ, స్థానిక ప్రజలకు మాత్రం కనీస విద్యుత్‌సరఫరా లేకుండా అంధకారంలో ఉంచుతున్నారని మండిపడ్డారు. పాకిస్థాన్ ప్రభుత్వం తమను పౌరులుగా కాకుండా, కేవలం బానిసలుగా మాత్రమే చూస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవలి కాలంలో ఇస్లామాబాద్ ప్రభుత్వం పీవోకే ప్రాంతంపై అదనపు పన్నుల భారాన్ని మోపడాన్ని స్థానికులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. తమకు కనీస సదుపాయాలు కల్పించని ప్రభుత్వం, పన్నులు మాత్రం ఎలా వసూలు చేస్తుందని వారు ప్రశ్నిస్తున్నారు. ఈ అణచివేతను ఇకపై భరించే ప్రసక్తే లేదని, తమ హక్కుల సాధన కోసం మరియు పాక్ ఆక్రమణ నుంచి విముక్తి కోసం ఈ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని నిరసనకారులు స్పష్టం చేశారు.

## ఇస్రోలో రాజీనామాల పరంపర

### ఆమోదించవద్దంటూ కేంద్రం ఆదేశాలు



**బెంగళూరు,జులై 16:** ఇస్రోలో కీలక ప్రాజెక్టులపై పనిచేస్తున్న శాస్త్రవేత్తలు వరుసగా రాజీనామాలు చేస్తున్న నేపథ్యంలో కేంద్ర అంతరిక్ష శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. గగన్‌యాన్‌తో పాటు ఇతర ప్రధాన మిషన్లలోఉన్న శాస్త్రవేత్తల స్వచ్ఛంద పదవీ విరమణ, రాజీనామాలపై కఠిన నిబంధనలు అమల్లోకి తీసుకొచ్చింది. ఈనెల 14న విడుదల చేసిన అంతర్గత మెమో ప్రకారం గగన్‌యాన్, ఇతర కీలక ప్రాజెక్టుల్లో పనిచేస్తున్న గ్రూప్ ఏ శాస్త్ర, సాంకేతిక సిబ్బంది రాజీనామాలు, స్వచ్ఛంద పదవీ విరమణ దరఖాస్తులను ఇకపై సాధారణంగా ఆమోదించరాదని స్పష్టం చేసింది. ప్రాజెక్టులు పూర్తయ్యే వరకు అలాంటి అభ్యర్థనలను కేంద్రాల డైరెక్టర్లు ఆమోదించకుండా, తమ సిఫార్సులతో పాటు అంతరిక్ష శాఖకు పంపాలని ఆదేశించింది. తుది నిర్ణయం మంత్రిత్వ శాఖే తీసుకోనుంది. ఇస్రోలో ఇటీవల రాజీనామాలు పెరిగిన విషయాన్ని పరోక్షంగా అంతరిక్ష శాఖ గుర్తించింది. అయితే ఎంతమంది వెళ్లారనే అధికారిక వివరాలు వెల్లడించలేదు. ఇస్రో వర్గాల ప్రకారం కనీసం 100 నుంచి 120మంది వరకు రాజీనామా చేసినట్లు తెలుస్తోంది. వారిలో యూఆర్ఎస్‌సీ నుంచి సుమారు 80 మంది, వీఎస్ఎస్‌సీ నుంచి కనీసం 20 మంది ఉన్నట్లు సమాచారం. ఎల్‌వీఎం3 ప్రాజెక్ట్ డైరెక్టర్ విక్టర్ జోసెఫ్, స్పాడెక్స్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌తో పాటు చంద్రయాన్3లో కీలకంగా పనిచేసిన ఓ యువ శాస్త్రవేత్త కూడా రాజీనామా చేసినట్లు వర్గాలు తెలిపాయి.

ఈ పరిణామాలపై ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ స్పందించారు. రాజీనామాలు జరుగుతున్న మాట వాస్తవమేనని, అయితే ప్రతి సంస్థలో ఇలాంటి పరిస్థితులు ఉంటాయన్నారు. కీలక ప్రాజెక్టులకు ఒక్కసారిగా అంతరాయం కలగకుండా ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఎవరైనా వెళ్లినా వారి బాధ్యతలను మరొకరు చేపడతారని, పరిస్థితిని ఇస్రో సమర్థంగా నిర్వహిస్తోందని వెల్లడించారు. ఇస్రోలో మొత్తం 14,600 మందికి పైగా ఉద్యోగులు ఉన్నప్పటికీ, రాజీనామాలు చేసిన వారిలో కీలక మిషన్లకు చెందిన అనుభవజ్ఞులు ఉండటమే ఆందోళన కలిగిస్తోంది. చంద్రయాన్ 3లో ల్యాండింగ్ ప్రక్రియ ధ్రువీకరణకు అవసరమైన లక్షకు పైగా పరీక్షలు నిర్వహించి, దాదాపు 25 టెరాబైట్ల డేటాను సిద్ధం చేసిన ప్రాజెక్ట్ మేనేజర్ ఆదిత్య రాళ్లపల్లి కూడా సంస్థను వీడినట్లు సమాచారం. 2020లో జారీ చేసిన నిబంధనల ప్రకారం గ్రూప్‌ఏ శాస్త్ర, సాంకేతిక సిబ్బంది రాజీనామాలను సంబంధిత కేంద్రాల డైరెక్టర్లే ఆమోదించే అధికారం ఉండేది. తాజా ఆదేశాలతో గగన్‌యాన్, ఇతర ప్రధాన మిషన్లలో పనిచేసే శాస్త్రవేత్తల విషయంలో ఆ అధికారాన్ని వెనక్కి తీసుకుంది. ఖాళీలను భర్తీ చేయడం కంటే అనుభవజ్ఞులైన శాస్త్రవేత్తలను భర్తీ చేయడం అంత సులభం కాదనే అభిప్రాయంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తాజా ఆదేశాలు స్పష్టం చేస్తున్నాయి.

## ప్రియాంక గాంధీ పిఎనంటూ రూ.3 కోట్లకు కుట్ర

### ఎమ్మెల్యే ఫిర్యాదుతో రంగంలోకి పోలీసులు

**తిరువనంతపురం,జులై 16:** కాంగ్రెస్ కీలక నాయకురాలు, వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా వ్యక్తిగత కార్యదర్శిగా నమ్మించేందుకు ఒక వ్యక్తి ప్రయత్నించాడు. కేరళ ఎమ్మెల్యేలు, ఎంపీల నుంచి రూ.3 కోట్లు కాజేసేందుకు ప్రయత్నించాడు. వారి ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తున్నారు. ప్రియాంక గాంధీ ఢిల్లీ కార్యాలయంలో ఆమె వ్యక్తిగత కార్యదర్శి డీఎస్ రాజ్‌కుమార్‌గా నమ్మించేందుకు ఒక వ్యక్తి ప్రయత్నించాడు. ఈనెల 6న కేరళలోని ఏలత్తూర్ ఎమ్మెల్యే కె. విద్యా బాలకృష్ణన్‌కు వాట్సాప్ కాల్ చేశాడు. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరిగే అవకాశం ఉందని తెలిపాడు. రూ.3 కోట్లు ఇస్తే ఆమెకు మంత్రి పదవి ఇప్పించేలా చూస్తానని ఆశ కల్పించాడు. కోజికోడ్‌కు చెందిన మరో ఎంపీ ఆమె పేరును సూచించినట్లు అతడు చెప్పాడు. అనుమానం రావడంతో ఎమ్మెల్యే విద్యా బాలకృష్ణన్ ఆ ఎంపీతో పాటు ప్రియాంక గాంధీ కార్యాలయాన్ని సంప్రదించారు.

తనకు కాల్ చేసిన వ్యక్తి రాజ్‌కుమార్‌గా నమ్మించి డబ్బు కాజేసేందుకు ప్రయత్నించినట్లు నిర్ధారించుకున్నారు. దీంతో ఆ ఎమ్మెల్యే ఫిర్యాదుతో కోజికోడ్ సైబర్ పోలీసులు కేసు నమోదు చేశారు. మరోవైపు కేరళ ఎంపీలు షఫీ పరంబిల్, డీన్ కురియకోస్‌తో పాటు పలు కాంగ్రెస్ నేతలను ఆ వ్యక్తి సంప్రదించినట్లు బయటపడింది. ఈ నేపథ్యంలో ప్రియాంక గాంధీ వాద్రా ఢిల్లీ కార్యాలయ కార్యదర్శి రాజ్ కుమార్ దీనిపై స్పందించారు. కేరళ రాష్ట్ర పోలీస్ చీఫ్, వయనాడ్ ఎస్పీకి ఆయన ఫిర్యాదు చేశారు. ఒక వ్యక్తి తన గుర్తింపు, ప్రియాంక గాంధీ వాద్రా కార్యాలయం పేరు దుర్వినియోగం చేస్తున్నాడని, డబ్బు డిమాండ్ చేసి ప్రజాప్రతినిధులను మోసగించేందుకు ఆ వ్యక్తి ప్రయత్నించినట్లు ఆరోపించారు. ఈ నేపథ్యంలో బుధవారం వయనాడ్‌లో కూడా కేసు నమోదైంది.

ఢిల్లీ నుంచి వాట్సాప్ కాల్ చేసిన ఆ వ్యక్తి ఉపయోగించిన ఫోన్ నంబర్ ఆధారంగా ఒక అనుమానితుడ్ని గుర్తించినట్లు కేరళ పోలీస్ అధికారి తెలిపారు. నకిలీ గుర్తింపు పత్రాలతో సిమ్ కార్డు కొనుగోలు చేశాడా అని అనుమానిస్తున్నారు. దర్యాప్తు కోసం ఒక బృందాన్ని ఢిల్లీకి పంపిస్తామని పోలీస్ అధికారి వివరించారు.

## అవినీతిపరులకు రెండో ఛాన్స్ ఇవ్వను

### తమిళ సిఎం విజయ్ వార్నింగ్



**చెన్నై,జులై 16:** తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ అవినీతిపై తన మంత్రులకు, ప్రభుత్వ యంత్రాంగానికి గట్టి హెచ్చరిక చేశారు. తన ప్రభుత్వంలో అవినీతి, లంచాలు, అధికార దుర్వినియోగానికి పాల్పడినవారికి ఎలాంటి రెండో అవకాశం ఉండదని గురువారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. ప్రజలకు పారదర్శక, జవాబుదారీతనంతో కూడిన పాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొంటూ అవినీతిపై జీరో టోలరెన్స్ విధానాన్ని మరోసారి ప్రకటించారు. ఇటీవల అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న తన పార్టీ చెంగల్పట్టు ఈస్ట్ జిల్లా సంయుక్త కార్యదర్శి వీరసామిని విజయ్ పార్టీ నుంచి బహిష్కరించడం సంచలనంగా మారింది. సోషల్ మీడియాలో లంచం తీసుకుంటున్నట్లు ఆరోపణలు వచ్చిన వీడియో వైరల్‌కావడంతో రాజకీయ విమర్శలు వెల్లువెత్తాయి. దాంతో పార్టీ ప్రాథమిక సభ్యత్వంతోపాటు అన్ని పదవుల నుంచి ఆయనను తొలగించారు. అనంతరం పోలీసులు కూడా ఆయనను అరెస్ట్ చేశారు. అయితే వీరసామి మాత్రం ఇదంతా ప్రతిపక్షాల కుట్ర అని ఆరోపిస్తున్నాడు. ఈ వ్యవహారంపై ప్రస్తుతం పోలీస్ విచారణ జరుగుతోంది. అధికారంలోకి వచ్చినప్పటి నుంచే పారదర్శక పాలనకు ప్రాధాన్యం ఇస్తున్న విజయ్ అవినీతిపై రాజీపడబోమనే సంకేతాన్ని వరుస చర్యల ద్వారా ఇస్తున్నారు. ప్రజల సహకారంతోనే అవినీతిని పూర్తిగా నిర్మూలించగలమని ఆయన పదేపదే చెబుతున్నారు. అవినీతి, లంచాలు, అధికార దుర్వినియోగానికి పాల్పడేవారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని ఆయన స్పష్టం చేశారు.

## డీలిమిటేషన్ బిల్లుపై అఖిలపక్ష భేటీ నిర్వహించండి

### పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముందే జరపండి: ప్రధాని మోడీకి ఖర్గే లేఖ

**న్యూఢిల్లీ, జులై 16:** కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే గురువారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖరాశారు. రాబోయే వర్షాకాల సమావేశాల్లో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే ముందు, డీలిమిటేషన్‌పై ప్రభుత్వం సవరించిన బిల్లులపై చర్చించేందుకు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ఆయనను కోరారు. ఈ ఏడాది ప్రారంభంలో ఈ విషయంపై విస్తృత సంప్రదింపులు జరపాలని కాంగ్రెస్ పదేపదే కోరిన విషయాన్ని ఖర్గే తన లేఖలో గుర్తు చేశారు. ప్రభుత్వ డీలిమిటేషన్ ప్రతిపాదనలపై అఖిలపక్ష సమావేశం కోరుతూ 2026 మార్చి, ఏప్రిల్ నెలలంతా తాను పార్లమెంటరీ వ్యవహారాల మంత్రికి లేఖలు రాశానని, అయితే ఆ అభ్యర్థనలు అంగీకరించబడలేదని ఆయన తెలిపారు. 2026 ఏప్రిల్ 17న లోక్‌సభలో రాజ్యాంగబద్ధంగా అవసరమైన మూడింట రెండు వంతుల మెజారిటీని సాధించడంలో విఫలమైన రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు,

2026 గతిని కూడా ఖర్గే ప్రస్తావించారు. రాబోయే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, 2026 సవరించిన ప్రతిని తిరిగి ప్రవేశపెట్టడానికి కేంద్రం యోచిస్తున్నట్లు నివేదికలు సూచిస్తున్నాయని కాంగ్రెస్ అధినేత అన్నారు.

# సంక్షిప్త వార్తలు

## టిఎంసికి రాజీనామాచేసిన ఎంపి కోయల్ మల్లిక్



**కోల్‌కతా,జులై 16:** మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్‌పార్టీకి మరో జలక్ తగిలింది. ఆ పార్టీ తరపున రాజ్యసభ ఎంపీగా ఏప్రిల్ 6వ తేదీన ప్రమాణ స్వీకారం చేసిన నటి కోయల్ మల్లిక్ తన పదవికి రాజీనామా చేశారు. దీంతో ఎగువ సభలో టిఎంసికి కష్టాలు మరింత పెరిగాయి. రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నానని, తక్షణమే తన రాజీనామాను ఆమోదించాలని కోరుతూ ఎంపీ కోయల్ మల్లిక్ రాజ్యసభ ఛైర్మెన్ సిపి రాధాకృష్ణనన్‌కు లేఖ రాశారు. అయితే జులై 20వ తేదీ నుంచి వర్షాకాల పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో.. ఎంపీ కోయల్ రాజీనామా టిఎంసికి పెద్ద దెబ్బే అవుతుంది.

## బంగ్లాలో వధువులను కొనుగోలుచేస్తున్న చైనా పౌరులు

**ఢాకా,జులై 16:** బంగ్లాదేశ్‌లో వధువుల కొనుగోలుకు పాల్పడవద్దని చైనా ప్రభుత్వం తమ పౌరులను తీవ్రంగా హెచ్చరించింది. వివాహం పేరుతో సాగించే ఇలాంటి చర్యలను మానవ అక్రమ రవాణాగా పరిగణిస్తారని, నిబంధనలు ఉల్లంఘిస్తే బంగ్లాదేశ్ చట్టాల ప్రకారం మరణశిక్ష పడే అవకాశం కూడా ఉందని స్పష్టం చేసింది. ఈ మేరకు ఢాకాలోని చైనా రాయబార కార్యాలయం ఒక కీలక ప్రకటన విడుదల చేసింది. బ్రోకర్లు లేదా సోషల్ మీడియా వేదికల ద్వారా పరిచయమై, పెళ్లి ముసుగులో సాగించే చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని తన పౌరులకు సూచించింది.

## ఎర్రకోటలో సందర్శకులకు అనుమతి నిలిపివేత



**న్యూఢిల్లీ,జులై 16:** దేశ రాజధాని ఢిల్లీలోని చారిత్రాత్మక ఎర్రకోటను ఆగస్టు 15 వరకు (నెల రోజుల పాటు) సాధారణ సందర్శకులు, ప్రజల కోసం పూర్తిగా మూసివేశారు. ఈ మేరకు భారత పురావస్తు శాఖ అధికారికంగా కీలక ఆదేశాలు జారీ చేసింది. 2026 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నేపథ్యంలో ముందస్తు భద్రతా కారణాల దృష్ట్యా అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఎర్రకోట ప్రధాన వేదిక కావడంతో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండటానికి అధికారులు చాలా వారాల ముందు నుంచే ఇక్కడ విస్తృత ఏర్పాట్లు ప్రారంభించారు.

## ఆస్తికోసం కన్నతండ్రినే కాల్చి చంపిన కొడుకు



**ఘజియాబాద్, జులై 16:** ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో అత్యంత దారుణమైన ఘటన వెలుగు చూసింది. ఆస్తి వివాదాల నేపథ్యంలో కన్నతండ్రినే ఓ కుమారుడు తుపాకీతో కాల్చి చంపాడు. మోడీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బుదానా గ్రామంలో బుధవారం రాత్రి ఈ ఘాతుకం చోటుచేసుకుంది. సుమారు రూ. 150 కోట్ల విలువైన ఆస్తులు కలిగిన హరిఓం చౌదరి (55) అనే వ్యక్తిని ఆయన పెద్ద కుమారుడు నిఖిల్ (32) దారుణంగా హత్య చేశాడు. ప్రస్తుతం పరారీలో ఉన్న నిందితుడిని పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు ఎసిపి భాస్కర్ వర్మ వెల్లడించారు.

## అపార్టుమెంట్‌లో అనస్తీషియా వైద్యుడి దారుణ హత్య



**ధార్వాడ్,జులై 16:** కర్ణాటకలో అత్యంత దారుణమైన ఘటన వెలుగులోకి వచ్చింది. ధార్వాడ్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో 45 యేళ్ల అనస్థీషియా వైద్యుడు దారుణ హత్యకు గురయ్యారు. ఆయన ఎనిమిదేళ్ల కుమారుడు కత్తి పోట్లతో ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనకు సంబంధించి మృతుడి భార్య, వృత్తిరీత్యా కంటి వైద్యురాలైన డాక్టర్ ప్రియాంకను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

# ఐక్యతకు ప్రతీకగా తెలంగాణ బోనాలు సంస్కృతి


పోతరాజులతో మంత్రి పొన్నం ప్రభాకర్

**దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ**
**ఆషాడ మాస తొలిబోనం జగదాంబ అమ్మవారికే**
**గోల్కొండ బోనాల ఉత్సవాలకు రూ.11 లక్షల నిధులు మంజూరు**
**తొలి బోనాన్ని ప్రారంభించి, పట్టువస్త్రాలు సమర్పించిన**
**మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్**

**హైదరాబాద్ (మెహిదీపట్నం), జులై 16, ప్రభాతవార్త :** తెలంగాణ బోనాలు సంస్కృతి, ఐక్యతకు ప్రతీకగా నిలుస్తాయని దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ అన్నారు. అమ్మవారి ఆశీర్వాదాలు తెలంగాణపై ఉండా లని, రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుం డాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గోల్కొండ జగదాంబ మహంకాళి బోనాల ఉత్స వాల సందర్భంగా లంగర్ హౌస్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖతోపాటు మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొని అమ్మవారికి తొలిబోనం, పట్టువస్త్రాలు సమర్పిం చారు. బోనాల ఉత్స వాలకు రూ 11 లక్షల చెక్కును ఆలయ ఇఒకు అందజేయడంతోపాటు సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో రూపొం దించిన బోనాల పుస్తకాన్ని ఆవిష్కరిం చారు. అనంతరం మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ గోల్కొండ జగదాంబ మహంకాళి అమ్మవారికి తొలి బోనంతో ఆషాడ బోనాలు ప్రారంభించుకున్నామన్నారు. అమ్మవారి అనుగ్రహం మనపై ఉండాలని వేడుకు న్నారు. కొన్ని వందల సంవత్స రాల నుండి జంట నగరాల్లో వైభ వోపేతంగా బోనాల ఉత్స వాలు సాంప్రదాయంగా కొనసాగు తున్నాయని తెలిపారు.

గోల్కొండ జగదాంబ అమ్మవారు మహిమ గల తల్లి అని, అమ్మవారి ఆశీస్సు లు ప్రభుత్వంపై ఉండాలని కోరారు. రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుం డాలనే సంకల్పంతో పనిచేస్తున్నామని తెలి పారు. 1813లో హైదరాబాద్‌లో ప్లేగువ్యాధి ప్రబలిన సమయం లో మహంకాళి అమ్మవారిని ప్రార్థించిన భక్తులు వ్యాధి తగ్గితే ప్రతి సంవత్స రం బోనం సమర్పిస్తామని మొక్కు కున్నారని, అనంతరం వ్యాధి తగ్గిన తర్వాత ఆ మొక్కు ను నిలబెట్టుకుంటూ ప్రతి యేటా బోనాలు సమర్పించే సంప్రదా యం కొనసాగుతుందన్నారు. బాసర నుంచి భద్రాచలం వరకు ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులు కేటాయిం చిందని, తెలంగాణను ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దే లక్ష్యంతో ఆలయాల అభివృద్ధికి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

**అంబరాన్ని తాకేలా బోనాల సంబరాలు : మంత్రి పొన్నం**

చారిత్రాత్మకమైన గోల్కొండ జగదాంబ మహంకాళి అమ్మవారి ఆషాడ మాస బోనాలు ఉత్స వాలను అంబ రాన్ని తాకేలా నిర్వహించడం జరుగుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. జంట నగరాల్లో దారులన్నీ గో ల్కొండ వైపే ఉన్నాయని, ప్రజలు, భక్తులు తండోప తండాలుగా వస్తున్నారని, బోనాలకు వచ్చే భక్తులు ఎక్క డ ఇబ్బందులు పడ కుండా పటిష్ట ఏర్పాట్లు చేపట్టడం జరిగిందని స్పష్టం చేశారు. రాష్ట్రం నలు మూలల నుండే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా బోనాల ఉత్స వాలకు భక్తులు వస్తుండడంతో ఆదిశగా పలు జాగ్రత్తలు తీసు కోవాలని అధికారులను ఆదేశిం చారు. ముఖ్యమంత్రి బోనాల నేపథ్యంలో ఉమ్మడి హైద రాబాద్ జిల్లాలోని అన్ని దేవాలయాలలో బోనాలను ఘనంగా నిర్వహించే విధంగా నిధులు మంజూరు చేయటం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ గవర్నర్ బండారు దత్తా త్రేయ, ప్రభుత్వ సలహాదారులు వి హనుమంతరావు, శాసనసభ్యులు దానం నాగేందర్, నవీన్‌యాదవ్, మాజీ ఎంపీ మధుయాష్కిగౌడ్, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయికుమార్, ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతురావు, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా, సంచాలకులు ఏనుగు నరసింహారెడ్డి, ఆర్డీఓ రామకృష్ణ, ఆలయ చైర్మన్ ఆకుల చంద్రశేఖర్ ఆలయ ఇఒ వసంత, కమిటీ సభ్యులు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తెలంగాణ ఎనర్జీ స్టోరేజ్ హబ్‌గా ఎదుగుతోంది

**మా హాయంలోని ప్రయత్నాలు ఫలించడం**
**సంతోషకరం: మాజీ మంత్రి కెటిఆర్**

**హైదరాబాద్, జులై 16, ప్రభాతవార్త:** తెలంగాణలో ఎనర్జీ స్టోరేజ్ హబ్‌గా మార్చేందుకు గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన మా ప్రయత్నాలు ఫలించడం చూసి చాలా సంతోషంగా ఉందని మాజీ మంత్రి, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మహబూబ్ నగర్‌లోని తన గిగా కారిడార్‌లో అమర రాజా సంస్థ కస్టమర్ క్వాలి ఫికేషన్ ప్లాంట్(సీక్యూపీ)ను ప్రారంభించిందని, ఇది మహబూబ్‌నగర్‌లో ఆ సంస్థ పెట్టనున్న రూ.9,500 కోట్ల పెట్టుబడిలో ఒక కీలక మైలురాయన్నారు. తాము సాధించ గలిగిన అతిపెద్ద ఎనర్జీ స్టోరేజ్ (ఇంధన నిల్వ) పెట్టుబడులలో ఇది ఒకటన్నారు. వచ్చే ఏడాది కంపెనీ గిగా ఫ్యాక్టరీలో వాణిజ్యపరమైన ఉత్పత్తి ప్రారంభం కావడానికి ముందే, ప్రొడక్ట్, ప్రాసెస్ క్వాలిఫికేషన్‌కు ఈ సదుపాయం వీలు కల్పిస్తుందని, తద్వారా బ్యాటరీ ఆర్ అండ్ డి(పరిశోధన) కమర్షియల్ మ్యాను ఫ్యాక్చరింగ్‌కు మధ్య ఇది ఒక వారధిలా నిలుస్తుందని కేటీఆర్ అన్నారు. ఇది అధునాతన ఎనర్జీ స్టోరేజ్ తయారీ హబ్‌గా తెలంగాణ స్థానాన్ని మరింత బలోపేతం చేస్తుందని కేటీఆర్ తెలిపారు.

## ప్రభుత్వ వైఖరితో రైతుల్లో తీవ్రఆవేదన

**బిజెపి ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్‌శంకర్**

**హైదరాబాద్, జులై 16, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరితో రైతులు తీవ్ర ఆవేదనలో ఉన్నారని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన గురువారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. వర్షాలు సకాలంలో పడకపోయినా, అతివృష్టి వచ్చినా, అకాల వర్షాలతో పంటలు దెబ్బతిన్నా, వరదలు వచ్చినా, క్రిమికీటకాల వల్ల పంట నష్టపోయినా రైతు నిస్సహాయ స్థితిలో నిలబడుతున్నాడని, ఈ పరిస్థితిని చూస్తే మానవత్వం ఉన్న ప్రతి ఒక్కరి హృదయం కలచివేయకుండా ఉండదన్నారు. రైతును కష్టకాలంలో ఆదుకోవాలనే గొప్ప సంకల్పంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను ప్రవేశపెట్టారన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోయిన రైతుకు ఆర్థిక భరోసా కల్పించి, రైతు ధైర్యంగా వ్యవసాయం చేసేలా ఈ పథకాన్ని దేశవ్యాప్తంగా అమలు చేస్తున్నారని, కానీ దురదృష్టవశాత్తు గత పదేళ్లు తెలంగాణను పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనలో కేవలం ఒక్క సంవత్సరం మాత్రమే భాగస్వామ్యమైందనీ అదీ బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేసిన ఉద్యమాలు, నిరసనలు, హైకోర్టులో దాఖలు చేసిన కేసు ఫలితంగానే జరిగిందని గుర్తు చేశారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ కూడా తెలంగాణలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను అమలు చేస్తామని, రైతు చెల్లించాల్సి న ప్రీమియాన్ని కూడా ప్రభుత్వమే భరిస్తుందని రైతు డిక్లరేషన్ సభలో హామీ ఇచ్చిందని, అదే హామీని తమ ఎన్నికల మేనిఫెస్టోలో కూడా పొందుపరిచిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర బడ్జెట్‌లో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన అమలుకు రూ.3,000 కోట్లు కేటాయిస్తున్నామని ప్రకటించిందని, ఆ సమయంలో రైతుల తరఫున మేం స్వాగతించామని, బీఆర్ఎస్ మాదిరిగా కాంగ్రెస్ రైతులను మోసం చేయదని ఆశించామన్నారు. కానీ మూడు బడ్జెట్లు గడిచినా ప్రకటించిన నిధుల్లో ఒక్క రూపాయి కూడా ఈ పథకం అమలుకు ఖర్చు చేయలేదన్నారు.

## యాదాద్రి థర్మల్ ప్రైవేటీకరణ టెండర్ల గడువు 24 వరకు పొడిగింపు

**యాష్ హ్యాండ్లింగ్, కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్లు ప్రైవేటుపరం**

**హైదరాబాద్, జులై 16, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్)లో కొన్ని ప్లాంట్ల ప్రైవేటీకరణ టెండర్ల గడువును టీజీ జెన్‌కో మరోసారి పొడిగించింది. టెండర్ల దాఖలుకు ఈ నెల 24 వరకు అవకాశం కల్పించింది. మంగళవారంతో టెండర్ల గడువు ముగియగా, మూడు సంస్థలు మాత్రమే టెండర్లు దాఖలు చేసినట్టు సమాచారం. మొదట జూన్ 29, జులై 14 వరకు టెండర్ల దాఖలుకు అవకాశం ఇచ్చారు. తాజాగా దానిని ఈ నెల 24 వరకు పొడిగించారు. యాదాద్రి పవర్ ప్లాంట్‌లోని యాష్ హ్యాండ్లింగ్, కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ల ప్రైవేటీకరణకు జెన్‌కో టెండర్లు ఆహ్వానించిన విషయం తెలిసిందే.

వైటీపీఎస్ ప్రైవేటీకరణను విద్యుత్తు ఉద్యోగ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. బుధవారం రాష్ట్రంలోని అన్ని విద్యుదుత్పత్తి ప్లాంట్లతోపాటు, హైదరాబాద్‌లోని విద్యుత్తు సౌధలో మధ్యాహ్న భోజన సమయంలో ఉద్యోగులు నిరసనలకు దిగారు. వైటీపీఎస్ టెండర్లను రద్దుచేసే వరకూ ఉద్యమిస్తామని జేఏసీ నేతలు ప్రకటించారు. కాగా విద్యుత్తు సమస్యతో సతమతమవుతున్న తెలంగాణను మిగులు విద్యుత్తు రాష్ట్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఏర్పాటైన యాదాద్రి పవర్‌ప్లాంట్ (వైటీపీఎస్)ను ప్రైవేట్‌పరం చేసేందుకు రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి సంస్థ (జెన్కో) మొగ్గుచూపింది. కొన్ని యూనిట్లను ప్రైవేట్‌పరం చేసే యోచనలో వివిధ విభాగాలను ప్రైవేటుకు అప్పగించేందుకు సిద్ధమైంది.

ఇందులో భాగంగా ప్లాంట్‌లోని స్టేజ్1, స్టేజ్2 యూనిట్లకు చెందిన కోల్ ప్లాంట్, యాష్ ప్లాంట్ల ఆపరేషన్, మెయింటెనెన్స్, మెకానికల్, ఎలక్ట్రికల్ పనులకు 3 సంవత్సరాలకు గాను జెన్కో తాజాగా టెండర్లను పిలిచింది. ఎస్టిమేషన్ కాంట్రాక్టు విలువ రూ.250 కోట్లుగా పేర్కొన్నది. టెండర్లు వేసేందుకు జూన్ నెల 12 నుంచి 29 వరకు గడువు ఇచ్చింది. ఇక ఈ పవర్ ప్లాంట్‌లోని నాలుగు యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభమైనప్పటికీ అందుకు అవసరమయ్యే ఉద్యోగులను ఇప్పటి వరకూ నియమించనే లేదు. 2020లో పాల్వంచ నుంచి 400 మంది, రామగుండం నుంచి 70 మందిని ఇక్కడ పనిచేసేందుకు బదిలీపై రప్పించారు. వీరితోపాటు స్థానికులైన 445 మందిని ఉద్యోగాల్లోకి తీసుకొన్నారు. అయితే వీరికి అదనంగా మరో 800 మంది ఉద్యోగుల అవసరం ఉన్నది. ఉద్యోగుల కొరత కారణంగా యాష్, కోల్ ప్లాంట్లను కాంట్రాక్టర్లకు అప్పగించేందుకు జెన్‌కో టెండర్లు పిలిచింది.



## పాలనలో సంక్షేమానికే ప్రాధాన్యత

**గాంధీభవన్‌లో ప్రజలతో ముఖాముఖికి**
**వందకుపైగా ఆర్జీలు**
**పశుసంవర్థక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి**

**హైదారబాద్, జులై 16, ప్రభాతవార్త:** 'దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజాసంక్షేమ పాలనను అందించినట్లే, ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా సంక్షేమ పాలన కొనసాగు తోంది' అని పశుసంవర్థక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువ జన సర్వీసులు క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. గాంధీభవన్‌లో గురువారం ప్రజలతో ముఖాముఖి కార్యక్రమానికి హాజరై 100కుపైగా వినతులు మంత్రి వాకిటి శ్రీహరి స్వీకరించారు. విన్నపాలు కొన్ని వెంటనే సంబంధిత అధికారులతో నేరుగా ఫోన్‌లో మాట్లాడి సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసు కోవాలని మౌఖికంగా ఆదేశించారు. ఈ సందర్భంగా వాకిటి శ్రీహరి మాట్లాడుతూ ప్రజల వినతులు స్వీకరించి సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు ఇస్తున్నామనీ తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండటమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం" అని అన్నారు. ముఖాముఖి కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని, ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం అత్యధిక సంఖ్యలో ప్రజలు వినతులు అందజేశారని మంత్రి తెలిపారు. ఈ ప్రభుత్వం పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా పేదలు, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం పనిచేస్తోందని ఆయన స్పష్టం చేశారు.."బిఆర్ఎస్ పింక్ మీడియా ద్వారా ప్రభుత్వంపై విషప్రచారం చేస్తోందనీ ఆవేదన చెందారు. పదేళ్ల పాలనలో తెలంగాణను అప్పులపాలు చేసింది బిఆర్ఎస్ పార్టీయే అని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందనీ ఆరోపించారు. మాటల గారడీతో మళ్లీ అధికారంలోకి రావాలని చూస్తోందనీ అన్నారు. తొమ్మిదిన్నర ఏళ్ల అవకాశం ఇస్తే రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన వారు ఇప్పుడు మూడు నెలలు అప్పగించమని చెప్పడం హాస్యాస్పదం" అని అన్నారు. దేశంలో మరెక్కడా లేని విధంగా తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, రైతు రుణమాఫీ, సన్నబియ్యం పంపిణీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ సబ్సిడీ, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వంటి సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. 'కాళేశ్వరం నీళ్లు లేకపోయినా రైతులు అత్యధిక దిగుబడులు సాధించారు. విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామనీ, ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నామనీ తెలిపారు. ప్రజలు వాస్తవాలను గుర్తించి ప్రజా ప్రభుత్వానికి అండగా నిలవాలి' అని మంత్రి పిలుపునిచ్చారు.

## అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్ వెలుగులు

**మహిళా, శిశు సంక్షేమ మంత్రి సీతక్క**

**హైదరాబాద్, జులై 16, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చీకట్లు తొలగిపోతున్నాయని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. చిన్నారుల భవిష్యత్‌కు పునాదివేసే ఈ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.

ఈ మేరకు గురువారం ఒక ప్రకటనలో రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేం ద్రాలకు ఉచిత విద్యుత్ కనెక్షన్లు కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ విధంగా గత ఆరు నెలల్లో 9,800 కేంద్రాలకు కొత్తగా విద్యుత్ సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. రాష్ట్రంలో మొత్తం 35,781 కేంద్రాలు ఉండగా ప్రస్తుతం 32,109 కేంద్రాలకు విద్యుత్ సౌకర్యం అందు బాటులోకి వచ్చిందన్నారు.

మిగిలిన కేంద్రాలకు త్వరితగతిన విద్యుత్ సౌకర్యం కల్పించి నూరు శాతం విద్యు దీకరణ లక్ష్యాన్ని చేరుకుం టామని తెలిపారు. గతంలో 40 శాతం అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో చిన్నారులు, అంగన్‌వాడీ సిబ్బంది తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొన్నారన్నారు. చీకటి గదులు, ఉక్కపోత వాతావరణంలో చిన్నారులు కేంద్రాలకు రావాలం టేనే భయపడే పరిస్థితులు ఉండేవని వెల్లడించారు. అలాగే డిజిటల్ బోధనకు సైతం విద్యుత్ లేమి ప్రధాన అడ్డంకిగా నిలిచిందని పేర్కొన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకుని అంగ న్‌వాడీ కేంద్రాల విద్యుదీకరణపై దృష్టి సారించినట్లు చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మెరుగైన సౌకర్యాల కల్పన తమ ప్రభుత్వ బాధ్యతగా వెల్లడించారు. గత ప్రభుత్వం బంగారు తెలంగాణ అంటూ గొప్పలు చెప్పుకుందని, కానీ భవిష్యత్ తరాలకు పునాది వేసే వేలాది అంగన్ వాడీ కేంద్రాలకు కనీస విద్యుత్ సౌకర్యం కూడా కల్పించలేకపోయిందని విమర్శించారు.

## భవిష్యత్తులో సైబర్ నేరాలు అతిపెద్ద సవాల్



**నేరాల కట్టడిలో టిజిసిఎస్‌బి పనితీరుపై ప్రశంసలు**
**తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో పనితీరుపై సమీక్షలో డిజిపి ఆనంద్**

**హైదరాబాద్, జులై 16, ప్రభాతవార్త:** దేశంలో తీవ్ర సమస్యగా మారిన సైబర్ నేరాలు భవిష్యత్తులో అతిపెద్ద సవాల్‌గా మారుతాయని, వీటిని పూర్తిగా నివారించకుంటే ముప్పు తప్పదని డిజిపి సి.వి.ఆనంద్ హెచ్చ రించారు. సైబర్ నేరాల నివారణలో అన్ని విభాగాలు కలిసికట్టుగా పని చేస్తే మెరుగైన ఫలితాలు సాధించే వీలుంటుందని ఆయన అన్నారు. సైబర్ నేరాల కట్టడిలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసి ఎస్‌బి) పనితీరును ఆయన ప్రశంసించారు. టిజిసిఎస్‌బి పని తీరుపై డిజిపి ఆనంద్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు కమాండ్ కంట్రోల్‌లోని ఆ విభాగం కేంద్ర కార్యాలయాన్ని సందర్శించి అధికారు లతో మాట్లాడారు. ఈ విభాగంలో వున్న ఉప విభాగాల పనితీ రును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను డీజీపీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదట ఈగల్‌ను సందర్శించగా ఇప్పుడు టిజిసిఎస్‌బి పనితీరును సమీక్షిస్తున్నానని అన్నారు. రాష్ట్ర పోలీసు విభాగాల్లో ఈ రెండు ఎంతో కీలకమైనవని ఆయన తెలిపారు. సైబర్ నేరాలు వేగంగా రూపాంతరం చెందుతున్నందున కొత్త ఆలోచనలు, కృత్రిమ మేధస్సు, ఆధునిక సాంకేతికత, డేటా అనలిటిక్స్ వినియో గిస్తూ ముందుకు సాగాలని ఆయన సూచించారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న జాతీయ పనితీరు సూచికల్లో తెలంగాణ మరింత మెరుగైన స్థానం సాధించే అవకాశం ఉందని, ఈ క్రమంలో సాంకేతిక వ్యవస్థలను నిరంతరం అప్‌డేట్ చేసుకోవాలని ఆయన అన్నారు. ప్రస్తుతం గ్రేహౌండ్స్, ఆక్టోపస్ వంటి ప్రత్యేక బలగాల పున ర్వ్యవస్థీకరణతోపాటు ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అండ్ రోడ్ సేఫ్టీ బ్యూరో, డ్రగ్స్ నియంత్రణకు సంబంధించిన ప్రత్యేక విభాగాల ఏర్పాటు జరుగుతోందని డిజిపి తెలిపారు. అవసరమైతే మానవ వనరులను సమర్థంగా వినియోగించి తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోను మరింత బలోపేతం చేయాలని ఆయన సూచించారు.

ఇటీవలి కాలంలో ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్లు, ఆన్‌లైన్ ట్రేడింగ్ స్కామ్‌లు, డిజిటల్ ఫైనాన్షియల్ మోసాలు వేగంగా పెరుగుతున్నాయని పేర్కొన్న డిజిపి ఇప్పుడే వీటిని సమర్థంగా నియంత్రించకపోతే భవిష్యత్‌లో మరింత తీవ్రమైన పరిణామాలు ఎదురయ్యే అవకాశం ఉందని హెచ్చ రించారు. టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖాగోయల్ పవర్ పాయింట్ ప్రెజం టేషన్ ద్వారా సైబర్ నేరాల తాజా ధోరణులు, దర్యాప్తు విధానాలు, కృత్రిమ మేధస్సు వినియోగం, బాధితులకు అందిస్తున్న సేవలు, భవి ష్యత్ కార్యాచరణపై వివరించారు. ఈ సమావేశంలో టిజిసిఎస్‌బి అధికారులు పలువురు పాల్గొన్నారు.

## మహిళా రిజర్వేషన్లు తక్షణం అమలు చేయాలి

**పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు జెఏసి వినతి**

**హైదరాబాద్, జులై 16, ప్రభాతవార్త:** మహిళలకు పార్లమెంట్, రాష్ట్ర శాసన సభల్లో 33 శాతం రిజర్వేషన్లను ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే అమలు చేయాలని మహిళా రిజర్వేషన్ జాయింట్ యాక్షన్ కమిటీ టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు గురువారం మహిళా సంఘాల ప్రతినిధులు మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. మహిళా రిజర్వేషన్ల అమలును జన గణన, నియోజకవర్గాల పునర్విభజన (డిలిమిటేషన్)తో అను సంధానం చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. రాజ్యాంగ సవరణ ద్వారా ఆ షరతులను తొలగించి వెంటనే అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు.

ఈ డిమాండ్ గతంలోనూ మహేష్ కుమార్ గౌడ్ ప్రస్తావించిన విషయమేనని వారు గుర్తు చేశారు. మహిళా రిజర్వేషన్లు స్వతంత్ర అంశమని, వాటిని ఇతర రాజకీయ లేదా పరిపాలనా ప్రక్రియలకు అనుసంధానం చేయడం వల్ల అమలు మరింత ఆలస్యమవుతుందని జెఏసి అభిప్రాయపడింది. రాబోయే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో మహిళా రిజర్వేషన్లను జనగణన, డిలిమిటేషన్ నుంచి వేరు చేసే సవరణను తీసుకురావాలని, 1/3 వంతు (33.33 శాతం) రిజర్వేషన్లను వెంటనే అమలు చేసేలా కాంగ్రెస్ పార్టీ తరఫున పార్లమెంట్‌లో చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర శాసన సభల్లో మహిళల ప్రాతినిధ్యం ప్రస్తుతం చాలా తక్కువగా ఉందని, త్వరలో పలు రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మహిళా రిజర్వేషన్ల అమలు అత్యవసరమని జెఏసి పేర్కొంది.

ఈ వినతిపత్రంపై ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్. అరుణ జ్యోతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, పిఒడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు అనసూయ, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. జ్యోతి, పిఓడబ్ల్యూ-2 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్వరూప, సిఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. జ్యోతి సంతకాలు చేశారు

## నేటి నుంచి ఇంజినీరింగ్ రెండోవిడత కౌన్సెలింగ్

**రేపు సర్టిఫికెట్ వెరిఫికేషన్**
**18, 19 తేదీల్లో వెబ్ ఆప్షన్లు**

**హైదరాబాద్, జులై 16, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో 2026-27 విద్యాసంవత్సరంలో ఇంజినీరింగ్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్ సెట్-2026 ఇంజినీరింగ్ రెండో విడత కౌన్సెలింగ్‌ను నేటి(శుక్రవారం) నుంచి ప్రారంభించనున్నారు. రేపు (శనివారం) సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వ హించనున్నారు. ఈ నెల 22న రెండో విడత సీట్ల కేటాయింపు చేయనున్నట్టు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండోవిడత కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను గురువారం ప్రకటించారు.

నేడు(శుక్రవారం) ఆన్‌లైన్‌లో కౌన్సెలింగ్ కోసం ఫీజు చెల్లించి స్లాట్ బుక్‌చేసుకోవాలి. రేపు(శనివారం) సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహిస్తారు. ఈ నెల 18, 19 తేదిల్లో విద్యార్థులు వెబ్ ఆప్షన్లు ఇవ్వడానికి అవకాశం కల్పించారు. ఈ నెల 22న రెండో విడత సీట్ల కేటాయింపు చేస్తారు. మొదటి విడత సీట్ల కేటాయింపు ఈ నెల 10న చేపట్టగా అందులో 19,325 మంది విద్యార్థులు కాలేజీల్లో రిపోర్ట్ చేయలేదు. దాంతోపాటు మొదటి విడతలో మిగిలిపోయిన 8162 సీట్లతో కలిపి మొత్తం 27,487 సీట్లు రెండో విడతలో కౌన్సెలింగ్‌కి అందుబాటులో ఉన్నట్టు కమిషనర్ ప్రకటనలో తెలిపారు.

## దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి గురుకులాల్లో అవకాశం కల్పించాలి

**సంక్షేమ భవన్ ముట్టడి కార్యక్రమంలో ఎంపి ఆర్.కృష్ణయ్య**

**హైదరాబాద్ (మెహిదీపట్నం), జులై 16, ప్రభాతవార్త :** రాష్ట్రంలో దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి గురుకుల పాఠశాలలో సీటు ఇవ్వాలని రాజ్య సభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. ప్రభుత్వ అసమర్థతతోనే రాష్ట్రంలో బీసీ గురుకుల పాఠశాలలు ఏర్పాటు కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి గురుకుల పాఠశాలలో సీటు కల్పించడంతోపాటు అదనంగా 119 బీసీ గురుకులాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం మాసబ్‌ట్యాంక్‌లోని తెలుగు సంక్షేమ భవనాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు, బీసీ సంఘాల నాయ కులతో కలిసి ముట్టడించారు. ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. గతంలో బీసీ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున ఉద్యమాలు చేసి రాష్ట్రంలో 290 బిసి గురుకుల పాఠశాలలను మంజూరు చేయించు కోవడం జరిగిందని గుర్తు చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నేటి వరకు ఒక్క బీసీ గురుకుల పాఠశాలను కూడా మంజూరు చేయలేదన్నారు.

# ఖజానాకు తగ్గిన అప్పుల భారం

**రెండో త్రైమాసికంలో రూ.14 వేల కోట్లకే ఇండెంట్**
**ఈ ఆర్థికం తొలి క్వార్టర్‌లో రూ.26 వేల కోట్లు సేకరణ**
**కొత్త రుణాల సేకరణలో 50 శాతం కోత**
**అప్పుల పునర్వ్యవస్థీకరణతో రూ. వెయ్యి కోట్లు ఆదా**
**ఆర్థిక సంస్కరణల వైపు సర్కార్ అడుగులు**

**హైదరాబాద్, జులై 16, ప్రభాతవార్త:** పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయిన రాష్ట్ర ఖజానాను గట్టెక్కించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తోంది. ఇందుకు ఆర్థిక సంస్కరణలను చేపట్టింది. అప్పుల భారం నుండి తగ్గించుకునే ప్రయత్నం చేస్తూనే, మరో వైపు రిజర్వ్ బ్యాంక్ అనుమతితో పాత వాటిని తక్కువ వడ్డీకి మార్పిడీ చేస్తోంది. అంతేకాకుండా కొత్తగా రుణాలు తీసుకునే విషయంలో ఆర్థిక నియంత్రణతో ఆచితూచి వ్యవహరిస్తోంది. ఈ నేపథ్యంలో పాత అప్పులను దీర్ఘకాలిక, తక్కువ వడ్డీకి మార్పిడి చేసి ఇప్పటికే దాదాపు రూ. వెయ్యి కోట్ల మేర ఖజానాపై భారం తగ్గించుకుంది. తాజాగా కొత్తగా తీసుకునే రుణాల విషయంలో కూడా ఆర్థిక నియంత్రణ పాటిస్తోంది.

ఇందులో భాగంగా ప్రస్తుత 2026-27 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో అప్పుల భారం నుండి రాష్ట్ర ప్రభుత్వం కొంత ఉపశమనం పొందనుంది. ఈ ఆర్థికం తొలి క్వార్టర్‌తో పోలిస్తే జులై నుండి సెప్టెంబరు నెలాఖరు వరకూ కలిగిన రెండో క్వార్టర్‌లో తీసుకునే అప్పును దాదాపు 50 శాతం తగ్గించుకుంది. తొలి క్వార్టర్ ఏప్రిల్ నుండి జూన్ నెలాఖరు వరకూ ప్రభుత్వ సెక్యూరిటీ బాండ్లను తనఖా ద్వారా రూ.26 వేల కోట్ల మేర రుణాలు సేకరించగా, ఈ రెండో క్వార్టర్‌లో మాత్రం రూ.12 వేల కోట్లు తగ్గించి రూ.14 వేల కోట్ల రుణానికే పరిమితమైంది. ఈ మేరకు ఈ నెలలో రూ.4,600 కోట్లు, అగస్టులో రూ.4,500 కోట్లు, సెప్టెంబరులో రూ.5 వేల కోట్లను సెక్యూరిటీ బాండ్ల వేలం ద్వారా రుణాలను సేకరిస్తోంది. ఇక తొలి క్వార్టర్‌లో రూ.7 వేల కోట్లు కలిపి మొత్తం దాదాపు రూ.26 వేల కోట్లను రాష్ట్ర ప్రభుత్వం రుణాల కింద సేకరించింది. దీంతో ఈ ఆర్థిక సంవత్సరం తొలి, రెండవ క్వార్టర్లు కలిపితే బహిరంగ మార్కెట్‌లో తీసుకునే రుణాలు సెప్టెంబరు నెల ముగిసేనాటికి రూ.40 వేల కోట్లకు చేరనుంది. ప్రస్తుత 2026-27 ఆర్థిక సంవత్సరంలో బహిరంగ మార్కెట్లో రూ.73,383 కోట్లు రుణాలు చేయాలని అంచనా బడ్జెట్‌లో ప్రభుత్వం పేర్కొంది. మరోపక్క పెరుగుతున్న భారాన్ని తగ్గించే లక్ష్యంతో కొనసాగుతున్న రుణాల మార్పిడి ప్రక్రియ ద్వారా రాష్ట్ర ఖజానాకు ఏటా సుమారు రూ.1,000 కోట్లు ఆదా చేయనుంది. రాష్ట్ర రుణ భారాన్ని తగ్గించేందుకు రాష్ట్ర సర్కార్ ఆర్థిక పునర్వ్యవస్థీకరణ చేపట్టింది. ఇందులో భాగంగా ఆగస్టు 2025లో రూ. 26 వేల కోట్ల విలువైన అధిక వడ్డీ రుణాలను గణనీయంగా తగ్గించిన పునర్వ్యవస్థీకరించడానికి రిజర్వ్ బ్యాంక్ ఆమోదం తెలిపింది. ఫలితంగా పాత స్వల్పకాలిక అప్పులను స్వల్ప వడ్డీకి, ఎక్కువ వాయిదాలు, తక్కువ ఇఎమ్ఐలు (వాయిదా సొమ్ము) చెల్లించేలా దీర్ఘ కాలిక రుణాలుగా మార్చే ప్రక్రియను కొనసాగిస్తోంది.



# పశ్చిమాసియా యుద్ధం మరింత ఉధృతం

## ఇటు యుఎస్, అటు ఇరాన్ పరస్పర దాడులు

**వాషింగ్టన్, టెహ్రాన్, జులై 16:** పశ్చిమ ఆసియాలో యుద్ధ మేఘాలు మరింతగా కమ్ముకున్నాయి. ఇరాన్ లక్ష్యంగా అమెరికా సైన్యం సరికొత్తగా మరో విడత భారీ దాడులను ప్రారంభించింది. అంతర్జాతీయ వాణిజ్యానికి అత్యంత కీలకమైన హార్ముజ్ జలసంధి గుండా ప్రయాణించే వాణిజ్య నౌకల రక్షణే ధ్యేయంగా ఈ దాడులను జరుపుతున్నట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. ఈ మేరకు అమెరికా సైన్యం బుధవారం స్థానిక కాలమాన ప్రకారం తెల్లవారుజామున ఒకసారి, తిరిగి మధ్యాహ్నం మరోసారి రెండు విడతలుగా ఇరాన్ సైనిక స్థావరాలపై విరుచుకుపడింది. గ్రేటర్ టున్బ్ ద్వీపంలోని ఇరాన్ తీరప్రాంత రక్షణ వ్యవస్థలు, క్రూజ్ క్షిపణుల నిల్వ కేంద్రాలు, క్షిపణి ప్రయోగ కేంద్రాలపై అమెరికా వైమానిక దళం కచ్చితమైన లక్ష్యాలతో బాంబుల వర్షం కురిపించింది. దాదాపు 90 నిమిషాల పాటు సాగిన ఈ మొదటి విడత దాడుల అనంతరం, హార్ముజ్ జలసంధి పరిసరాల్లో ఉన్న ఇరాన్ సైనిక సామర్థ్యాన్ని దెబ్బతీసేందుకు అమెరికా రెండో విడత దాడులను కూడా విజయవంతంగా నిర్వహించింది. ఇరాన్ నౌకాశ్రయాలపై అమెరికా నావికా దళం ఆంక్షలను పునరుద్ధరించిన నేపథ్యంలో ఈ తాజా దాడులు చోటుచేసుకోవడం గమనార్హం. అమెరికా జరిపిన ఈ దాడులకు ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ (ఐఆర్జీసీ) అంతే వేగంగా స్పందించింది. జోర్డాన్, బహ్రెయిన్ దేశాలలో ఉన్న అమెరికా సైనిక స్థావరాలే లక్ష్యంగా ప్రతీకార దాడులు చేసినట్లు ఇరాన్ ప్రకటించింది. జోర్డాన్‌లోని అల్అజ్రక్ అమెరికా సైనిక స్థావరంపై ఇరాన్ జరిపిన దాడిలో అక్కడ నిలిపి ఉంచిన అమెరికాకు చెందిన ఎఫ్15, ఎఫ్16, ఎఫ్35 అత్యాధునిక యుద్ధ విమానాలతో పాటు ఎంక్యూ 9 వ్యూహాత్మక డ్రోన్లు భారీగా ధ్వంసమైనట్లు ఇరాన్ అధికారిక వార్తా సంస్థ వెల్లడించింది. మరోవైపు బహ్రెయిన్‌లోని అమెరికా ఐదో నౌకాదళ స్థావరాన్ని కూడా ఐఆర్జీసీ లక్ష్యంగా చేసుకుంది. అక్కడ ఉన్న ఇంధన నిల్వ కేంద్రాలు, సైనిక సామగ్రి దాచిన పెద్ద గిడ్డంగులపై ఇరాన్ సైన్యం క్షిపణులతో దాడులు చేసింది. తమ దేశంపై అమెరికా జరుపుతున్న దాడులకు జోర్డాన్, బహ్రెయిన్‌లోని అమెరికా స్థావరాలనే వాడుకుంటున్నారని, అందుకే అక్కడ ఉన్న అమెరికా సైన్యాన్ని తరిమికొట్టేందుకు స్థానిక ప్రజలు కలిసిరావాలని ఇరాన్ పిలుపునిచ్చింది. ఇరు దేశాల మధ్య దాడులు, ప్రతిదాడులు తీవ్రమవ్వడంతో పశ్చిమ ఆసియా ప్రాంతంలో అత్యంత ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

# ‘జమిలి’కి ఇసి రెడీ

## ఆరు నెలల గడువు ఇస్తే 2029 నుంచే అమలు

### 2028లో సంబంధిత చట్టం ఆమోదించాలి

### 99 శాతం ప్రజలు కూడా ఈ విధానానికే ఓటు : జెపిసి ఛైర్మన్


**లక్నో, జులై 16:** భారత ఎన్నికల సంఘానికి ఆరు నెలల ముందస్తు సమయం ఇస్తే దేశవ్యాప్తంగా లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలను ఒకేసారి నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఈసీతెలిపింది. ప్రతిపాదిత ‘ఒకే దేశం ఒకేసారి ఎన్నికలు అంశాన్ని పరిశీలిస్తున్న పార్లమెంటు సంయుక్త కమిటీకి (జేపీసీ) ఈసీ తన ప్రాథమిక నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించినట్లు కమిటీ ఛైర్మన్ పి.పి. చౌదరి తెలిపారు. లక్నోలో విద్యావేత్తలతో మూడు రోజులపాటు జరిగిన సంప్రదింపుల అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన, ఈసీ అభిప్రాయాలను కూడా కమిటీ పూర్తిగా విని, అనంతరం రాజ్యాంగ సవరణలపై తుది సిఫార్సులు చేస్తామని చెప్పారు. ఈసీ ప్రణాళికపై తమ ప్రశ్నలను ఎన్నికల సంఘం ముందు ఉంచనున్నామని, ఒకేసారి ఎన్నికల నిర్వహణ సాధ్యాసాధ్యాలపై ఈసీ వివరణలను పరిశీలించిన తర్వాతే కమిటీ తన నివేదికను సిద్ధం చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈసీ ప్రాథమిక నివేదికను ప్రస్తావిస్తూ, దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం సాధ్యమేనని, ఇందుకు కనీసం ఆరు నెలల ముందస్తు నోటీసు అవసరమని ఎన్నికల సంఘం అభిప్రాయపడిందని చౌదరి వెల్లడించారు. 2028లో పార్లమెంట్ సంబంధిత చట్టాన్ని ఆమోదిస్తే, 2029 నుంచి ‘ఒకే దేశం ఒకేసారి ఎన్నికలు అమలు చేయవచ్చని ఎన్నికల సంఘం అభిప్రాయపడిందని ఆయన తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కలల ప్రాజెక్టుగా పేర్కొన్న ఈ ప్రతిపాదనపై మాట్లాడుతూ, 1954 నుంచి 1960 మధ్యకాలంలో దేశంలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి బ్యాలెట్ పేపర్ల ద్వారా నిర్వహించిన చరిత్ర ఉందని గుర్తు చేశారు. ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం అనేది కేవలం ఎన్నికల షెడ్యూల్‌ను సమన్వయం చేయడమే తప్ప, రాష్ట్రాల అధికారాలు లేదా రాజ్యాంగ హక్కులను ఏ విధంగానూ తగ్గించదని నిపుణులు అభిప్రాయపడుతున్నట్లు చౌదరి చెప్పారు. ఈ ప్రతిపాదనకు ప్రజల నుంచి విస్తృత మద్దతు లభిస్తోందని పేర్కొంటూ, పౌర సమాజ ప్రతినిధులు, సాధారణ ప్రజల్లో దాదాపు 99 శాతం మంది ఒకే దేశం ఒకేసారి ఎన్నికలకు అనుకూలంగా ఉన్నారని ఆయన వ్యాఖ్యానించారు. ఒకేసారి ఎన్నికల సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అధ్యక్షతన 2023 సెప్టెంబరులో కేంద్ర ప్రభుత్వం ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ 2024లో సమర్పించిన నివేదికలో తొలి దశలో లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలను సమకాలీకరించాలని, అనంతరం 100 రోజుల వ్యవధిలో స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని సిఫార్సు చేసింది.

# గాడ్జిల్లాగా ఎల్‌నినో!

## గత 150 యేళ్లలో అత్యంత శక్తివంతమైందిగా రూపాంతరం

### 1877 కంటే ప్రమాదకర స్థితిలో వాతావరణ మార్పులు

### భారత్ సహా ప్రపంచ దేశాల వాతావరణ శాస్త్రవేత్తల ఆందోళన




**న్యూఢిల్లీ, జులై 16:** 2026 నుంచి 2027 వరకు ఏర్పడబోయే ఎల్‌నినో గత 150 సంవత్సరాల చరిత్రలోనే అత్యంత శక్తివంతమైనదిగా మారే అవకాశముం దని వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఈ అంచనాలు నిజమైతే భారత్‌తోపాటు ప్రపంచంలోని అనేక దేశాలు తీవ్ర ఎండలు, కరవు, వరదలు, పంటల నష్టం, సముద్ర ఉష్ణోగ్రతల పెరుగుదల లాంటి ప్రమాదాలను ఎదుర్కోవాల్సి రావచ్చు. ముఖ్యంగా భారత్ వ్యవసాయానికి ప్రాణాధారమైన నైరుతి రుతుపవనాలపై దీని ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. స్ట్రైప్‌లో వాతావరణ పరిశోధనల విభాగాధిపతి, బర్కిలీ ఎర్త్‌లో పరిశోధన శాస్త్రవేత్త అయిన జీక్ హౌస్‌ఫాదర్ చేసిన విశ్లేషణ ప్రకారం, అభివృద్ధి చెందుతున్న 2026-27 ఎల్ నినో మునుపెన్నడూ చూడని వేగంతో బలపడుతోంది. ఇది కనీసం 150 సంవత్సరాల పరిశీలనలలో అత్యంత శక్తివంతమైన సంఘటనగా మారగలదని ప్రముఖ వాతావరణ నమూనాలు ఇప్పుడు సూచిస్తున్నాయి. 14 ప్రముఖ కాలానుగుణ వాతావరణ నమూనాల నుండి 667 సమిష్టి అంచనాల ఆధారంగా, ఈ సంఘటన చారిత్రాత్మక 1997-98, 2015-16 ఎల్ నినో సంఘటనలను అధిగమించడమే కాకుండా, “ఇంతకు ముందెన్నడూ చూడని“ స్థాయిలో వాటిని మించిపోగలదని హౌస్‌ఫాదర్ అంటున్నారు. “ఈ నమూనాలు మనం ఇంతవరకు గమనించిన దేనికైనా అతీతమైన దానిని అంచనా వేస్తున్నాయ్ణి అని హౌస్‌ఫాదర్ తన తాజా విశ్లేషణలో రాశారు. ప్రస్తుత బహుళ నమూనాల మధ్యస్థ అంచనా ప్రకారం, ఉష్ణమండల పసిఫిక్‌లోని నియో 3.4 ప్రాంతంలో ఎల్ నినో 3.6డిగ్రీల సెంటిగ్రేడ్ సముద్ర ఉపరితల ఉష్ణోగ్రత వ్యత్యాసంతో గరిష్ట స్థాయికి చేరుకుంటుంది. ఇది 2015-16 నాటి శక్తివంతమైన ఎల్ నినో సమయంలో నమోదైన 2.75 డిగ్రీల సెంటిగ్రేడ్ మునుపటి రికార్డు కంటే దాదాపు 0.8డిగ్రీల సెంటిగ్రేడ్ ఎక్కువ. దీనిని సరైన దృక్కోణంలో చూస్తే, 1877 నుండి నమోదైన అత్యంత బలమైన, ఐదవ అత్యంత బలమైన ఎల్ నినో సంఘటనల మధ్య వ్యత్యాసం కేవలం 0.5డిగ్రీల సెంటిగ్రేడ్ మాత్రమే. 2026లో అంచనా వేయబడిన ఈ పెరుగుదల ఒక్కటే ఆ చారిత్రక వ్యత్యాసాన్ని మించిపోయింది. శాస్త్రవేత్తలను ముఖ్యంగా ఆశ్చర్యపరిచిన విషయం కేవలం అంచనా వేయబడిన తీవ్రత మాత్రమే కాదు, దాని అభివృద్ధి వేగం కూడా. హౌస్‌ఫాదర్ విశ్లేషణ ప్రకారం, 2026 నాటి ఈ సంఘటన, ఎల్ నినో విస్ఫోటక వృద్ధికి ఎప్పటినుంచో ఒక ప్రమాణంగా పరిగణించబడుతున్న 1997- 98 నాటి ప్రసిద్ధ ఎల్ నినో కంటే వేగంగా బలపడుతోంది. మరింత విశేషం ఏమిటంటే, 2015-16 నాటి సంఘటనకు భిన్నంగా, ప్రస్తుత సంఘటన 2026 ప్రారంభంలో లా నినా లాంటి పరిస్థితుల నుండి ఉద్భవించింది. 2015-16 సంఘటన అప్పటికే అంతకుముందు సంభవించిన వేడెక్కడం వల్ల అసాధారణంగా వెచ్చని పసిఫిక్ జలాలను పొందింది. వాతావరణ నమూనాల మధ్య అసాధారణంగా బలమైన ఏకాభిప్రాయం ఉందని అంచనాలు చూపిస్తున్నాయి. దాదాపు 91శాతం సమితి సభ్యులు, నినో 3.4 సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతల పరంగా 2026 నాటి సంఘటన 2015-16 రికార్డును అధిగమిస్తుందని అంచనా వేస్తున్నారు. అంచనాల పరిధిలోని అత్యల్ప స్థాయి, సుమారు 2.8డిగ్రీల సెంటిగ్రేడ్‌లు కూడా, మునుపటి సర్వకాలిక రికార్డుకు సమానంగా లేదా అంతకంటే ఎక్కువగా ఉంది. వాతావరణ మార్పు నుండి ఎల్ నినో సంకేతాన్ని వేరుచేసే రిలేటివ్ ఓషియానిక్ నియో ఇండెక్స్ (ఆర్ఒఎన్ఐ)ను ఉపయోగించి శాస్త్రవేత్తలు దీర్ఘకాలిక ప్రపంచ సముద్ర వేడెక్కడాన్ని పరిగణనలోకి తీసుకున్నప్పుడు కూడా, ఈ దృక్పథం అసాధారణంగానే ఉంది. దాదాపు 77శాతం నమూనా అనుకరణలు ఇప్పటికీ ఈ కొలమానం ప్రకారం 2026 అత్యంత బలమైన ఎల్ నినోగా నమోదవుతుందని సూచిస్తున్నాయి. ప్రతి ప్రధాన వాతావరణ అంచనా కేంద్రం కనీసం చాలా బలమైన లేదా “సూపర్“ ఎల్ నినోను అంచనా వేస్తుండగా, కేవలం ఒక మోడల్ మాత్రమే 2015-16 రికార్డు స్థాయి కంటే తక్కువ గరిష్ట స్థాయిని చూపుతోంది. మోడళ్ల మధ్య బలమైన ఏకాభిప్రాయం కచ్చితత్వానికి హామీ ఇవ్వదని హౌస్‌ఫాదర్ హెచ్చరిస్తున్నప్పటికీ, రుతుపవన వాతావరణ అంచనాలలో ఇంతటి విస్తృత ఏకాభిప్రాయం అసాధారణమని ఆయన పేర్కొన్నారు. ఈ అంచనాలు నిజమైతే, దాని పర్యవసానాలు ప్రపంచవ్యాప్తంగా కనిపించవచ్చు. చారిత్రాత్మకంగా, బలమైన ఎల్ నినో సంఘటనలు ప్రపంచ వాతావరణ సరళిని పునర్నిర్మిస్తాయి. వివిధ ప్రాంతాలలో వడగాలులు, కరువులు, వరదలు, పంట నష్టాలు, సముద్ర ఉష్ణ తరంగాల సంభావ్యతను పెంచుతాయి. భారతదేశంలో, తీవ్రమైన ఎల్ నినో సాధారణంగా హిందూ మహాసముద్రం మీదుగా తేమ రవాణాను అడ్డుకోవడం ద్వారా నైరుతి రుతుపవనాలను బలహీనపరుస్తుంది. అయినప్పటికీ ఇతర వాతావరణ కారకాలను బట్టి స్థానిక వాతావరణ సరళి మారవచ్చు. పెరుగుతున్న ప్రపంచ ఉష్ణోగ్రతల నేపథ్యంలో ఈ తాజా అంచనాలు కూడా వెలువడ్డాయి. ఈ అపూర్వమైన ఎల్ నినో, మానవ ప్రేరిత వాతావరణ మార్పులతో కలిసి, 2023, 2024లో అనుభవించిన దానికి సమానంగా లేదా అంతకంటే ఎక్కువగా రికార్డు స్థాయిలో ప్రపంచ వేడిని మరోసారి ప్రేరేపిస్తుందా అని శాస్త్రవేత్తలు నిశితంగా గమనిస్తున్నారు.

ఈ అంచనాలు నిజమైతే ప్రపంచ వ్యాప్తంగా తీవ్ర ప్రభావాలు కనిపించే అవకాశముంది. అనేక దేశాల్లో చరిత్రలోనే అత్యంత తీవ్రమైన వేడిగాలులు వీచే చాన్స్ ఉంది. కొన్ని ప్రాంతాల్లో నెలల తరబడి వర్షాలు లేక కరవు పరిస్థితులు ఏర్పడవచ్చు. మరికొన్ని దేశాల్లో ఒక్కసారిగా భారీగా వర్షాలు కురిసి వరదలు విరుచుకుపడవచ్చు. వ్యవసాయ రంగానికి భారీ దెబ్బ తగిలే ప్రమాదం ఉంది. సముద్రాల ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల చేపల వనరులు దెబ్బతినే అవకాశం ఉంది. సముద్ర జీవవ్యవస్థపై కూడా తీవ్రమైన ప్రభావం పడవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

భారత్ విషయానికి వస్తే పరిస్థితి మరింత ఆందోళనకరంగా కనిపిస్తోంది. సాధారణంగా బలమైన ఎల్‌నినో ఏరనపడిన సంవత్సరాల్లో నైరుతి రుతుపవనాలు బలహీనపడతాయి. హిందూ మహాసముద్రం నుంచి భారత్ వైపు వచ్చే తేమ తగ్గిపోవడంతో వర్షపాతం తగ్గే అవకాశం ఉంటుంది. వర్షాలు తగ్గితే వరి, పత్తి, మొక్కజొన్న, పప్పుధాన్యాలు, చెరకు వంటి పంటలపై తీవ్ర ప్రభావం పడుతుంది. జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గే ప్రమాదం ఉంటుంది. తాగునీటి సమస్యలు పెరిగే అవకాశం ఉంది. విద్యుత్ ఉత్పత్తి నుంచి ఆహార భద్రత వరకు అనేక రంగాలపై దీని ప్రభావం కనిపించవచ్చు. అయితే ఎల్‌నినో ఒక్కటే వర్షాలను నిర్ణయించదని, ఇతర వాతావరణ పరిస్థితులు కూడా ప్రభావం చూపుతాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్రస్తుతం ప్రపంచ ఉష్ణోగ్రతలు ఇప్పటికే మానవ కార్యకలాపాల వల్ల ప్రమాదకర స్థాయిలో పెరుగుతున్నాయి. ఇలాంటి సమయంలో ఈ గాడ్జిల్లా ఎల్‌నినో కూడా కలిస్తే 2023, 2024 సంవత్సరాల్లో నమోదైన రికార్డు స్థాయి వేడి కంటే ఇంకా ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. అందుకే ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వాతావరణ శాస్త్రవేత్తలు ఈ పరిణామాలను క్షణక్షణం పరిశీలిస్తూ విశ్లేసిస్తున్నారు.

# డీలిమిటేషన్ బిల్లును మళ్లీ అడ్డుకుంటాం

## ప్రతిపక్ష పార్టీలన్నింటిని ఏకతాటిపైకి తీసుకొద్దాం

### కాంగ్రెస్ పార్లమెంటరీ స్ట్రాటజీ గ్రూప్ భేటీలో నిర్ణయం

### సిపిసి ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ అధ్యక్షతన సమావేశం



**న్యూఢిల్లీ, జులై 16:** రాబోయే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ప్రతిపాదిత డీలిమిటేషన్ బిల్లును తిరిగి ప్రవేశపెడితే దానిని కాంగ్రెస్ పార్టీ అడ్డుకుంటుందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ తెలిపారు. గురువారం సిపిసి ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ అధ్యక్షత నిర్వహించిన కాంగ్రెస్ పార్లమెంటరీ స్ట్రాటజీ గ్రూప్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్లమెంటరీ స్ట్రాటజీ గ్రూప్ సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రమేష్ మాట్లాడుతూ, ఈ సమావేశాల్లో ప్రవేశపెట్టే అవకాశం ఉన్న బిల్లులపై పార్టీ సవివరంగా చర్చలు జరిపిందని తెలిపారు. ప్రభుత్వ అధికారిక పార్లమెంట్ అజెండా తమకు ఇంకా అందలేదని, జులై 19న జరగనున్న అఖిలపక్ష సమావేశంలో వివరాలు తెలుసుకుంటామని ఆయన అన్నారు. “ఏప్రిల్ 17న ప్రభుత్వానికి మూడింట రెండు వంతుల మెజారిటీని సంపాదించిపెట్టడంలో విఫలమై, ఒక పెద్ద ఓటమిని చవిచూసిన డీలిమిటేషన్ బిల్లును తిరిగి ప్రవేశపెట్టేందుకు హోం మంత్రి ప్రయత్నిస్తున్నారని తాము విన్నాము. వారు ఆ బిల్లును తిరిగి తీసుకురావాలని చూస్తున్నార్ణు అని ఆయన అన్నారు. పార్టీ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని రమేష్ పునరుద్ఘాటించారు. “కాంగ్రెస్ పార్టీ వైఖరి ఎల్లప్పుడూ స్పష్టంగా ఉంది. తాము డీలిమిటేషన్ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తాము. వ్యతిరేకిస్తూనే ఉంటాము. అన్ని ప్రతిపక్ష పార్టీల మధ్య ఐక్యతను కాపాడటానికి అన్ని ప్రయత్నాలు చేస్తాము. ప్రతిపక్ష పార్టీలను చీల్చడం ద్వారా చట్టాన్ని ఆమోదించడానికి అవసరమైన సంఖ్యాబలాన్ని ప్రభుత్వం సంపాదించడానికి ప్రయత్నిస్తోంద్ణి అని ఆరోపించారు. ‘రాహుల్ గాంధీ, అలాగే కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కూడా ఏప్రిల్ 16, 17 తేదీలలో నియోజకవర్గాల పునర్విభజన బిల్లును తీవ్రంగా వ్యతిరేకించిన అన్ని పార్టీలతో సంప్రదింపులు జరుపుతున్నార్ణు అని జైరాం రమేష్ తెలిపారు. మహిళా రిజర్వేషన్ చట్టాన్ని ప్రస్తావిస్తూ, మహిళలకు రిజర్వేషన్‌కు కాంగ్రెస్ మద్దతు ఇస్తుందని, అయితే దానిని ప్రతిపాదిత నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియతో ముడిపెట్టడాన్ని వ్యతిరేకిస్తుందని రమేష్ అన్నారు. అయితే, మహిళా రిజర్వేషన్ చట్టం పేరుతో ప్రవేశపెట్టిన డీలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన) బిల్లు వాస్తవానికి మహిళా రిజర్వేషన్ ముసుగులో తెచ్చిన ప్రమాదకరమైన డీలిమిటేషన్ బిల్లు అని ఆయన అన్నారు. ఈ సమావేశాల్లో ప్రవేశపెట్టే అవకాశం ఉన్న మరికొన్ని బిల్లులను కూడా కాంగ్రెస్ వ్యతిరేకిస్తుందని రమేష్ పేర్కొన్నారు.

ఆగస్టు 10 నాటికి వెలువడనున్న ‘ఒకే దేశం, ఒకే ఎన్నిక’ అంశంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జెపిసి) నివేదిక గురించి కూడా పార్టీ చర్చించిందని ఆయన తెలిపారు. సోనియా గాంధీ అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ పార్లమెంటరీ వ్యూహ కమిటీ సమావేశం గంటన్నర పాటు కొనసాగింది. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, పార్లమెంటరీ వ్యూహ కమిటీ సభ్యులందరూ ఇందులో పాల్గొన్నారు.

# తగ్గుతున్న ట్రంప్ ప్రజాదరణ

## 37 శాతానికే ప్రజల ఆమోదం



**వాషింగ్టన్, జులై 16:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రజాదరణ క్రమంగా తగ్గుతున్నట్లు తాజా వాషింగ్టన్ పోస్ట్-ఇప్సోస్ సర్వే వెల్లడించింది. సర్వే ప్రకారం ట్రంప్ పాలనకు కేవలం 37 శాతం మంది అమెరికన్లు మాత్రమే ఆమోదం తెలపగా, 61 శాతం మంది ఆయన పనితీరును వ్యతిరేకిస్తున్నారు. దేశీయ, విదేశాంగ విధానాల నిర్వహణపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని సర్వే పేర్కొంది. ట్రంప్‌కు బలమైన మద్దతు తెలిపిన వారి శాతం కూడా తగ్గింది. ఫిబ్రవరిలో ఇది 19 శాతం ఉండగా, ప్రస్తుతం 15 శాతానికి పడిపోయింది. ప్రస్తుత అధ్యక్ష పదవీకాలంలో ఇదే అత్యల్ప స్థాయి అని సర్వే వెల్లడించింది. ఆర్థిక వ్యవస్థ, ఇరాన్ యుద్ధం ప్రభావంట్రంప్ ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను నిర్వహిస్తున్న తీరుపై కేవలం 33 శాతం మంది మాత్రమే సంతృప్తి వ్యక్తం చేశారు. ఇరాన్‌తో కొనసాగుతున్న యుద్ధ పరిస్థితిని ఆయన నిర్వహిస్తున్న విధానానికి 29 శాతం మంది మాత్రమే మద్దతు తెలిపారు. వలస విధానం (ఇమ్మిగ్రేషన్) ట్రంప్‌కు కొంత బలమైన అంశంగానే ఉన్నప్పటికీ, కేవలం 40 శాతం మంది మాత్రమే ఆమోదం తెలిపారు. ఇది కూడా మెజారిటీకి చాలా దూరంలోనే ఉందని సర్వే స్పష్టం చేసింది. ట్రంప్ మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత తమ ఆర్థిక పరిస్థితి మరింత దిగజారిందని 43 శాతం మంది అమెరికన్లు పేర్కొన్నారు. మరోవైపు తమ జీవన ప్రమాణాలు భవిష్యత్తులో మెరుగుపడతాయని 40 శాతం మంది మాత్రమే ఆశాభావం వ్యక్తం చేశారు. దీంతో అమెరికన్లలో ఆర్థిక భద్రతపై ఆందోళనలు పెరుగుతున్నట్లు సర్వే సూచించింది. ఇరాన్‌తో కొనసాగుతున్న యుద్ధంపై కూడా అమెరికా ప్రజలు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేశారు. 68 శాతం మంది ఈ యుద్ధం అవసరం లేనిదేనని అభిప్రాయపడ్డారు. ఈ యుద్ధం కారణంగా ప్రపంచంలో అమెరికా నాయకత్వ పాత్ర బలహీనపడిందని కూడా మెజారిటీ భావిస్తున్నట్లు సర్వే వెల్లడించింది. ఈ వారం విడుదలైన రాయిటర్స్-ఇప్సోస్ మరో సర్వే ప్రకారం 79 శాతం మంది అమెరికన్లు ఇరాన్ యుద్ధం ఇంకా చాలా కాలం కొనసాగుతుందని అంచనా వేస్తున్నారు.

# యుకె ప్రతినిధులతో మంత్రి శ్రీధర్‌బాబు, పిసిసి చీఫ్ మహేష్ భేటీ

**హైదరాబాద్, జులై16, ప్రభావార్త:** భారత్ యునైటెడ్ కింగ్‌డమ్‌ల మధ్య కుదిరిన సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం వల్ల తెలంగాణా గరిష్ఠ ప్రయోజనం పొందేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ వెల్లడించారు. బుధవారం నుంచి అమల్లోకి వచ్చిన ఈ ఒప్పందం వల్ల దేశం నుంచి ఎగుమతి అయ్యే 99 శాతం పారిశ్రామిక ఉత్పత్తులపై యుకె సుంకాలను తొలగించిన విషయాన్ని వారు గుర్తు చేసారు. దక్షిణాసియా యుకె డిప్యూటి ట్రేడ్ కమిషనర్ చంద్రు కె అయర్ ఆధ్వర్యంలో గురువారం నాడు సచివాలయంలో తనను కలిసిన ప్రతినిధి బృందంతో శ్రీధర్ బాబు, మహేష్ కుమార్ గౌడ్ సమావేశం అయ్యారు. ఈ ఒప్పందం వల్ల ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం రూ.32.56 లక్షల కోట్ల వాణిజ్యానికి అవకాశం ఉందన్నారు. తెలంగాణాలో పారిశ్రామిక వస్తూత్పత్తి, లైఫ్ సైన్సెస్, ఏవియేషన్, డిఫెన్స్, ఐటి, సెమికండక్టర్స్, చిప్ ల డిజైన్, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో పెట్టుబడులకు అత్యంత అనుకూల పరిస్థితులు ఉన్నాయని చెప్పారు. అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలను వృద్ధి చేసామని, యుకె పారిశ్రామికవేత్తలు వీటిని వినియోగించుకోవాలని కోరారు. రాష్ట్రం నుంచి యుకెకు ప్రస్తుతం రూ.3,553 కోట్ల విలువైన ఎగుమతులు మాత్రమే జరుగుతున్నాయని తెలిపారు. కొత్త ఒప్పందం వల్ల కలిగే ప్రయోజనాల వల్ల ఎగుమతులను భారీగా పెంచుకునే అవకాశం ఏర్పడిందని వివరించారు. దేశంలోని ఫార్మా ఉత్పత్తుల్లో 40 శాతం తెలంగాణాలోనే జరుగుతున్నాయని, వ్యాక్సిన్ ఎగుమతుల్లో 30 శాతం రాష్ట్రానిదేనని, తెలిపారు. ప్రపంచ ప్రఖ్యాత ఏవియేషన్ సంస్థలు ఎయిర్ బస్, బోయింగ్, రోల్స్ రాయిస్, విమాన ఇంజన్ల తయారీ సంస్థ ప్రాట్ అండ్ విట్నీస్, దస్సా ఏవియేషన్ ఉత్పత్తి చేసే రఫేల్ విమానాల విడిభాగాల తయారీ, ఓవర్ హాలింగ్ సదుపాయాలు ఇక్కడ ఉన్నాయని తెలిపారు.



# ఎల్‌నినో సవాళ్లు ఎదుర్కొనేందుకు సిద్ధం

## సమగ్ర ప్రణాళికను అమలుచేయాలి

### తొలి కంటింజెన్సీ ప్రణాళిక విడుదల చేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, జులై 16, ప్రభాతవార్త :** ఎల్‌నినో సవాళ్లు, వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోవాలని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు సూచించారు. రాష్ట్రంలో వర్షాభా పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని శాస్త్రీయ అధ్యయనం ఆధారంగా రూపొందించిన రాష్ట్రంలోని తొలి కంటింజెన్సీ ప్రణాళికను హైదరాబాద్ సచివాలయంలో గురువారం వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విడుదల చేశారు. రైతులకు ఉపయోగపడే ప్రతి అంశాన్ని శాస్త్రీయంగా విశ్లేషించి అత్యంత సమగ్రంగా కంటింజెన్సీ ప్లాన్‌ను రూపొందించినట్లు తెలిపారు. ఈ కంటింజెన్సీ ప్లాన్‌ను జిల్లాల్లో అత్యంత పకడ్బందీగా అమలు చేయాలని, అలాగే గ్రామస్థాయి వరకు విస్తృతంగా తీసుకెళ్లి ప్రతి రైతుకు సవివరంగా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులకు సరైన సమయంలో సరైన సలహాలు అందించడం అత్యంత కీలకమని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని భౌగోళిక, వాతావరణ, నేలల స్వభావం ఆధారంగా మూడు వ్యవసాయ ప్రాంతాలుగా విభజించి, ఆయా ప్రాంతాల ప్రత్యేక పరిస్థితులకు అనుగుణంగా ఈ కంటింజెన్సీ ప్రణాళిక రూపొందించామని వివరించారు. భూమి స్వభావాన్ని బట్టి ప్రస్తుతం ఇంకా ఏ పంటలను సాగు చేయవచ్చో, ప్రత్యామ్నాయంగా ఏ పంటలు అనుకూలమో కూడా స్పష్టంగా సూచించినట్లు తెలిపారు. అదేవిధంగా ప్రతి జిల్లాలోని భూగర్భ జలాల లభ్యత, ప్రధాన, మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టుల్లో ఉన్న నీటి నిల్వలు, ఇంకా సాగుకు అందుబాటులో ఉన్న నీటి పరిస్థితులపై సమగ్ర సమాచారం కూడా పొందుపరిచామన్నారు.



# విద్యార్థుల నమోదు వేగవంతం చేయాలి

## 2026-27 విద్యాసంవత్సరానికి సంబంధించి లక్ష్యసాధనకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలి

### రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజు

**హైదరాబాద్, జులై 16, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలు, ప్రీప్రైమరీ, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, తెలంగాణ మోడల్ స్కూళ్లలో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యార్థుల నమోదును వేగవంతం చేయాలని విద్యాశాఖ అధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. గురువారం విద్యా శాఖపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్లు పాఠశాలల వారీగా నమోదు పురోగతిని ప్రతిరోజూ సమీక్షిస్తూ, లక్ష్య సాధనకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని సూచించారు.

ప్రీప్రైమరీ విభాగాల ఏర్పాటు, బోధకులు, సిబ్బంది నియామకం, టీచింగ్-లెర్నింగ్ మెటీరియల్, ఫర్నిచర్‌తో పాటు అవసరమైన ఇతర సామగ్రి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. నియామకాలు, కొనుగోళ్లు పెండింగ్‌లో ఉన్న జిల్లాలు వాటిని తక్షణమే పూర్తి చేయాలన్నారు. ప్రీ ప్రైమరీ విభాగా లకు సంబంధించిన యూడైస్ వివరాలను పూర్తిగా నవీకరించి, విద్యార్థుల ప్రవేశాల సమాచారాన్ని సకాలంలో నమోదు చేయాలని సూచించారు. యూడైస్‌లో నమోదు కాని ప్రవేశాలను వెంటనే అప్‌డేట్ చేసి, వాస్తవ గణాంకాలు ప్రతిబింబించేలా చర్యలు తీసుకోవాలని తెలి పారు. గ్రామ స్థాయిలో ప్రజాప్రతి నిధులు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, తల్లిదండ్రులతో సమన్వ యం చేసుకుని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల ప్రవేశాలను పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, తెలంగాణ మోడల్ స్కూళ్లలో కూడా నిర్దేశించిన ప్రవేశ లక్ష్యాలను పూర్తి చేసి, ఖాళీ సీట్లను త్వరితగతిన భర్తీ చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యా వాతావరణం కల్పించే దిశగా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లా కలెక్టర్లు విద్యాశాఖ అధికారులతో నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ, ప్రతి పాఠశాల స్థాయిలో విద్యార్థుల నమోదును పర్యవేక్షించి, లక్ష్య సాధనకు అవసరమైన చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల పనులను క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తూ, నిర్దేశిత గడువులో పూర్తయ్యేలా పనుల వేగాన్ని మరింత పెంచాలన్నారు. కేంద్రీకృత వంటశాలలు అన్నింటినీ సెప్టెంబర్ 30వ తేదీలోపు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని, తద్వారా విద్యార్థులకు నాణ్యమైన, పోషకాహారం సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. త్రాగునీటి పనులను వేగవంతం చేయాలి

ప్రజలకు సురక్షితమైన త్రాగునీటి సరఫరా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతగా భావిస్తుందని, అమృత్ 2.0 పథకం క్రింద పైప్‌లైన్‌లు, ఓవర్ హెడ్ ట్యాంక్‌లు, అంతర్గత పంపిణీ వ్యవస్థలకు సంబంధించి మిగిలిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామాలు, పట్టణాలలో త్రాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. పనుల నాణ్యత విషయంలో రాజీ పడకుండా సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.

సున్నిత ప్రాంతాలలో జ్వరాలపై ప్రత్యేక నిఘా చేపట్టి, ప్రతిరోజూ నివేదికలు పంపాలని, ప్రతి శుక్రవారం ‘డ్రై డే’ కార్యక్రమం నిర్వహిస్తూ దోమల నివారణ చర్యలు, లార్వా నిర్మూలన, ఫాగింగ్, నీరు నిల్వ ఉండే ప్రాంతాలలో శుభ్రత కార్యక్రమాలను ముమ్మరం చేయాలని సంజయ్ జాజు తెలిపారు. పట్టణాలు, గ్రామాలు, పాఠశాలలు, వసతి గృహాలు, నిర్మాణ ప్రాంతాలలో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్‌లు చేపట్టాలని, గత ఏడాదితో పోలిస్తే డెంగ్యూ, చికెన్‌గున్యా, మలేరియా కేసులు గణనీయంగా తగ్గినప్పటికీ, టైఫాయిడ్ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. గర్భిణుల ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యతనిస్తూ నిరంతరం పర్యవేక్షి ంచాలని, అత్యవసర చికిత్స సౌకర్యాలు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సీఎస్ సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు.

### ఆక్వా రైతుల సబ్సిడీకి తిలోదకాలు ఇచ్చిన జగన్
## ఇప్పుడు నీతులు చెప్పడం విడ్డూరం
**● ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్**



**విజయవాడ, జులై 16 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆక్వా రైతుల విద్యుత్ సబ్సిడీ విధానాన్ని నిర్వీర్యం చేసిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇప్పుడు ఆక్వా రైతుల గురించి మాట్లాడటం ఆశ్చర్యకర మని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ విమర్శించారు. ఈ మేరకు మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఓ నోట్‌ను విడుదల చేశారు. జగన్ ప్రభుత్వ హయాంలోనే ఆక్వా ప్రాంతాన్ని ఆక్వా, నాన్ ఆక్వా జోన్‌లుగా విభజించి వేలాది మంది రైతులను విద్యుత్ సబ్సిడీ దూరం చేశారని మంత్రి పేర్కొన్నారు. జగన్ రెడ్డి తీసుకొచ్చిన ఈ విధానంతో ఆక్వా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ విధానాన్ని సరిదిద్దుతూ అర్హులైన ఆక్వా రైతులందరికీ విద్యుత్ సబ్సిడీ అందేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించి ప్రతి అర్హులైన రైతులకు రూ.1.50కే యూనిట్ విద్యుత్ అందించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉన్న కూటమి ప్రభుత్వం వ్యవసాయ రైతులతో పాటు ఆక్వా రైతులు, చేనేత కార్మికులు, స్వర్ణకారులు, నాయి బ్రాహ్మణులకు కూడా విద్యుత్ సబ్సిడీలు అందిస్తోందని మంత్రి గొట్టిపాటి వివరించారు. వివిధ వర్గాల జీవనోపాధికి అండగా నిలిచేలా విద్యుత్ రాయితీలను కొనసాగిస్తున్నామని స్పష్టం చేశారు. గత ఐదేళ్లలో విద్యుత్ రంగంతో పాటు ఆక్వా రంగం, ఇతర కీలక వ్యవస్థలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దెబ్బతీసిందని మంత్రి ఆరోపించారు. ఇప్పుడు ప్రజలను తప్పుదోవ పట్టించేలా అసత్య ప్రచారం చేస్తూ జగన్ వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. జగన్ మోహన్ రెడ్డి చేపడుతున్న యాత్రలు, పర్యటనలు ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాకుండా రాజకీయ స్వలాభం కోసమేనని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ప్రజలు వాస్తవాలను గమనిస్తున్నారని, అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

# విజయనగరాన్ని రాష్ట్రానికి వెన్నెముకగా తీర్చిదిద్దండి
**● జలధార-జలహారతితో భూగర్భ జలాలు పెరిగాయి ● ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి ● రాష్ట్ర ఇన్‌చార్జి, హోం మంత్రి వంగలపూడి అనిత**

**విజయనగరం, జులై 16 ప్రభాతవార్త:** విజయనగరం జిల్లాను వెనుకబడిన జిల్లాగా కాకుండా రాష్ట్ర అభివృద్ధికి వెన్నెముకగా నిలిచే జిల్లాగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఇన్‌చార్జ్, హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా సమీక్షా కమిటీ (డీఆర్‌సీ) సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జలధార- జలహారతి కార్యక్రమం ఫలితంగా భూగర్భ జలాల మట్టం పెరగడంతో పాటు నీటి నిల్వ సామర్థ్యం గణనీయంగా మెరుగుపడిందన్నారు. జిల్లాలో మొత్తం 8,059 ఎంఐ ట్యాంకులుండగా, వాటిలో 6,447 ట్యాంకుల పనులకు మంజూరు లభించిందని, ఇప్పటికే 6,442 ట్యాంకుల పనులు పూర్తయ్యాయని తెలిపారు. అలాగే 2,549 కాలువల పనులు కొనసాగుతున్నాయని, రూ.320.62 కోట్లు వ్యయం చేసినట్లు చెప్పారు. ఈ పనుల ద్వారా 1.28 కోట్ల పనిదినాలు కల్పించడంతో పాటు పూడిక తొలగింపు కారణంగా నీటి నిల్వ సామర్థ్యం పెరిగి అదనపు ఆయకట్టుకు అవకాశం ఏర్పడిందన్నారు. సమర్థవంతంగా అమలు చేస్తున్న జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి, సాగునీటి శాఖ అధికారులను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు.



**ఎల్‌నినో ప్రభావంపై ముందస్తు కార్యాచరణ:** ఎల్‌నినో ప్రభావం వల్ల భవిష్యత్తులో ఎదురయ్యే పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖలు సమన్వయంతో సమగ్ర యాక్షన్ ప్లాన్ రూపొందించాలని మంత్రి ఆదేశించారు. వచ్చే రెండు నుంచి మూడు వారాల్లో పూర్తి స్థాయి కార్యాచరణ ప్రణాళికతో ముందుకు రావాలని సూచించారు.

**రైతులకు ఎరువుల కొరత లేదు:** రైతులకు పంటల బీమాపై విస్తృత అవగాహన కల్పించాలని, ఏపీ ఏఐఎంఎస్ యాప్ ద్వారా ఎరువుల పంపిణీ పూర్తిస్థాయి పారదర్శకతతో జరుగుతోందన్నారు. జిల్లాలో ఎరువుల కొరత లేదని స్పష్టం చేస్తూ, రైతులను అనవసరంగా ఆందోళనకు గురిచేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు రైతు బజార్లలో ప్రత్యేక ఆర్గానిక్ ఉత్పత్తుల కౌంటర్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలు పెరగడం శుభపరిణామం. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు దూరంగా ఉన్న పిల్లలను గుర్తించి విద్యా వ్యవస్థలోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ విద్యా సంవత్సరంలో జిల్లాలో 4 వేల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో కొత్తగా చేరడం ప్రభుత్వ విద్యపై ప్రజల్లో పెరిగిన విశ్వాసానికి నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు.

**గృహాల మౌలిక సదుపాయాల పూర్తి:** గృహ నిర్మాణ కార్యక్రమంలో ఇప్పటికే 60 శాతానికి పైగా మౌలిక సదుపాయాలు కల్పించామని, మిగిలిన పనులను త్వరలో పూర్తి చేస్తామని మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ప్రజలకు ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉందన్నారు.

**త్వరలో భోగాపురం విమానాశ్రయం ప్రారంభం:** భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి అవసరమైన అన్ని అనుమతులు లభించాయని, త్వరలో భారత ప్రధానమంత్రి చేతుల మీదుగా ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి అనిత వెల్లడించారు. పరిశ్రమల ఏర్పాటుతో పాటు పర్యాటక రంగ అభివృద్ధికి కూడా ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నామని తెలిపారు. జిల్లా అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సమిష్టిగా భాగస్వాములు కావాలని, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ఈ పాత్రికేయుల సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి, ఎమ్మెల్సీలు గాదె శ్రీనివాసులు నాయుడు, గ్రీష్మ, విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతి రాజు, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

### మూడు పోర్టుల అభివృద్ధికి రెండో దశ భూసేకరణకు ఉత్తర్వులు

**విజయవాడ, జులై 16 ప్రభాతవార్త ప్రతినిధి:** మూడు పోర్టుల అభివృద్ధికి రెండో దశ భూసేకరణకు ఉత్తర్వులు జారీ చేశారు. మూలపేట, మచిలీపట్నం, రామాయపట్నం పోర్టుల అభివృద్ధికి రెండో దశలో 6,248.54 ఎకరాల భూమి సేకరణకు నిర్ణయం తీసుతున్నారు. రూ.1,638.52 కోట్లతో భూసేకరణకు పరిపాలనా అనుమతులు వచ్చాయి. మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టుకు 1,903.39 ఎకరాల కోసం రూ.440.52 కోట్లు, మచిలీపట్నం పోర్టుకు 1,420.70 ఎకరాల కోసం రూ.347 కోట్లు, రామాయపట్నం పోర్టుకు 2,924.45 ఎకరాల కోసం రూ.851 కోట్ల వ్యయం వెచ్చించనున్నారు.

### మద్యం మత్తులో క్షణికావేశం నిర్ణయాలతో కుటుంబాలను చిన్నాభిన్నం

**విజయవాడ, జులై 16 ప్రభాతవార్త ప్రతినిధి:** మద్యం మత్తులో, క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలు కుటుంబాలను ఛిన్నాభిన్నం చేయడమే కాకుండా, సంబంధిత వ్యక్తుల భవిష్యత్తును కూడా అంధకారంలోకి నెడతాయని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు. మద్యం తీసుకోవడం వలన ఆలోచనా శూన్యత ఏర్పడుతుందన్నారు. మద్యం వలన కలిగే ప్రమాదాలను ప్రతి ఒక్కరు గమనించాలన్నారు. మద్యం వలన కుటుంబాలకు కుటుంబాలు అల్లకల్లోలం అవుతున్నాయన్నారు. అలవాటుగా మద్యం తీసుకోవడం. ఏదో కారణ దొరకబుచ్చుకుని లిక్కరు తాగడం చాలా నష్టాన్ని తీసుకుని వస్తుందన్నారు. గొల్లప్రోలు, యు.కొత్తపల్లి మండలం మూలపేట ప్రాంతాల్లో చోటుచేసుకున్న సంఘటనలే మద్యం వలన కలిగే అనర్దాలకు నిదర్శనమన్నారు. ఈ రెండు ఘటనలపై కాకినాడ జిల్లా పోలీసులు సమగ్ర దర్యాప్తు నిర్వహించి, బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సున్నితమైన ప్రాంతాలు గుర్తించి అవగాహన సదస్సులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్‌కు సూచించారు.

### డాక్టర్ పూర్ణచందుకి లోకగురు పురస్కారం



**విజయవాడ, జులై 16 ప్రభాతవార్త ప్రతినిధి:** విలువల విద్య, విలువైన విద్య వ్యాప్తికి కృషిచేసే విద్యార్థి వికాస వాహిని స్వచ్ఛంద సంస్థ ఈ సంవత్సరం లోకగురు పురస్కారాన్ని ప్రముఖ ఆయుర్వేద వైద్యులు, ఆహార శాస్త్రవేత్త, తెలుగు భాషోద్యమ నేత డాక్టర్ జి వి పూర్ణచందుకి అందిస్తోంది. విద్యార్థి వికాస వాహిని వ్యవస్థాపక అధ్యక్షులు వేములపల్లి కేశవ రావు తెలిపారు. జివి పూర్ణచంద్ గత యాభై సంవత్సరాలుగా వారి ప్రసంగాల ద్వారా, రచనల ద్వారా ఆరోగ్యశాస్త్రములో, సాహిత్య ప్రక్రియలలో అనేకమంది సామాన్య జనులను విజ్ఞాన వంతులుగా చేసినందుకు ఈ లోకగురు పురస్కారం తో సత్కరించబడుతున్నారు. ఈ కార్యక్రమము విద్యార్థి వికాస వాహిని సంస్థాపక దినోత్సవం గురుపూర్ణిమ సందర్భముగా జులై 29న విజయవాడ బెంజ్ సర్కిల్ సమీపములోని సర్వోత్తమ గ్రంధాలయములో నిర్వహించబడునని తెలియచేస్తూ విద్యార్థి వికాస వాహిని సభ్యులను, శ్రేయోభిలాషులను, విద్యావేత్తలను, విద్యార్థులను, ఉపాధ్యాయులను, రచయితలను, రోటరియన్లను, పూర్ణచందు సన్నిహితులను సాదరముగా ఆహ్వానిస్తున్నాము. ఈ కార్యక్రమానికి రిటైర్డ్ హైకోర్ట్ జడ్జి జస్టిస్ శేషసాయి ముఖ్య అతిథిగా విచ్చేసి పురస్కార ప్రదానం చేస్తారు.

# ఆసియాలోనే అత్యుత్తమ పర్యాటక కేంద్రంగా ఎస్వీ జూలాజికల్ పార్క్
**● పార్క్‌లో అతిపెద్ద నైట్ సఫారీ ● నైట్ ట్రైన్‌కు రూపకల్పన ● లోటు భర్తీకి నిధులు, పర్యాటక ఆకర్షణగా తీర్చిదిద్దే దిశగా అడుగులు ● స్పీకర్ అయ్యన్నపాత్రుడు వెల్లడి**

**తిరుపతిరూరల్, జులై 16 ప్రభాతవార్త:** శ్రీవేంకటేశ్వర జూలాసికల్ పార్కును ఆసియాలోనే అత్యుత్తమ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో కీలక నిర్ణయాలు తీసుకుంటున్నట్లు వన్యప్రాణి, పర్యావరణ పరిరక్షణ కమిటీ చైర్మెన్, స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. జూ పార్కులో ఆసియాలోనే అతిపెద్ద నైట్ సఫారీతో పాటు ప్రత్యేక నైట్ ట్రెన్ ఏర్పాటు దిశగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. గురువారం జూ కమిటీ ఎస్వీ జూ పార్కును సందర్శించారు. జూ పార్కును సందర్శించిన కమిటీ ఆధాయం-వ్యయాలపై అధికారులతో సమీక్ష నిర్వహించింది.

ప్రస్తుతం జూకు సంవత్సరానికి సుమారు రూ.10కోట్ల ఆధాయం వస్తుండగా, నిర్వాహణకు రూ.18కోట్ల రుపాయాలు ఖర్చు అవుతుందని అధికారులు వివరించారు. రూ.8కోట్ల రుపాయాల లోటును భర్తీ చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఆయ్యన్నపాత్రుడు తెలిపారు. టిటిడి నుంచి రూ.3కోట్లు, కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) నిధుల ద్వారా మరో రూ.3కోట్ల ఎంపి నిధుల నుంచి రూ.2కోట్ల సమీకరించే ప్రణాళిక ఉందని చెప్పారు. జూ పార్కు అభివృద్ధి మూడు దశల్లో అమలుచేయాలని కమిటీ నిర్ణయించింది. ఆధునిక సౌకర్యాలు, ఆకర్షణీయ ప్రదర్శనలు, పర్యాటక అనుభవాన్ని మెరుగుపరిచే చర్యలు చేపట్టి, జూను దేశ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు కలిగించేలా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. కమిటీ సభ్యులకు స్థానిక ఎమ్మెల్యే పులివర్తి నాని, అటవీశాఖ అధికారులు ఘన స్వాగతం పలికారు.





జూ ప్రాంగణంలో పచ్చదనం పెంపొందించేందుకు అయ్యన్నపాత్రుడు, సభ్యులు ఎమ్మెల్యే కలిసి మొక్కలు నాటారు.

చంద్రగిరి ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ చంద్రగిరి నియోజవర్గంలో 3100 ఎకరాలలో విస్తరించి ఉన్న ఎస్వీ సూ పార్కు ఆసియాలోనే అతిపెద్దది కావడం గర్వకారణమని అన్నారు. జూను మరింత అభివృద్ధి చేసి పర్యాటకులను ఆకర్షించే కేంద్రంగా మార్చేందుకు కృషి చేస్తామని తెలిపారు.

**సౌకర్యాల పరిశీలన – సందర్శకుల సంఖ్యపై ఆందోళన**

ఎస్వీ జూ సందర్శకుల సంఖ్య తగ్గిపోవడంపై కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. దీనికి గల కారణాలను విశ్లేషించి మరింత మంది పర్యాటకులను ఆకర్షించే విధంగా సమగ్ర ప్రణాళిక రూపొందిస్తున్నట్లు వెల్లడించింది. జూ పార్కులో మౌలిక వసతుల మెరుగుదలకు రూ.18కోట్ల ప్రతిపాదనలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నామని కమిటీ తెలిపింది. ఆధునిక హంగులు, సదుపాయాలు కల్పించి ఎస్వీ జూ పార్కును దేశ వ్యాప్తంగా ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేసింది. ఈ కార్యక్రమంలో తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఎ.ఈశ్వరరెడ్డి, టిడిపి నాయకులు బడి సుధాయాదవ్, నాగూరు శ్రీనివాసులు, ఉసిరిపాటి శ్రీనివాసులు, కత్తి సుధాకర్, కాయం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఎ.ఈశ్వరరెడ్డి, పార్టీ నాయకులు బడి సుధా యాదవ్, నాగూరు శ్రీనివాసులు, కత్తి సుధాకర్, కాయం వెంకటేష్, ఉసిరిపాటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



## శ్రీవారి ఆశీస్సులతో కోరిక నెరవేరింది
**● తిరుమలలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు**

**తిరుమల, జులై 16 ప్రభాతవార్త ప్రతినిధి:** ఇటీవల తిరుమలకు వచ్చినపుడు ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని ఒక కోరిక కోరుకున్నానని, అది మూడు రోజులకే నెరవేరిందని అసెంబ్లీ స్పీకర్ సిహెచ్ అయ్యన్నపాత్రుడు విశ్వాసం వ్యక్తం చేశారు. తన కుమారుడికి రాజ్యసభ సీటు వచ్చిందన్న స్పీకర్ అయ్యన్న వన్యప్రాణి సంరక్షణ కమిటీ చైర్మన్‌గా తిరుపతి జూపై సమీక్షకు వచ్చాచన్నారు. సౌకర్యాల లేమితో ఉన్న తిరుపతి జూకు భారీగా తగ్గిన సందర్శకుల సంఖ్యతో టిటిడి సహకారంతో జూపార్క్ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. జూలో సమస్యలపై అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని తెలిపారు. గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, తన రాజకీయ జీవితానికి, వ్యక్తిగత జీవితానికి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. గతంలో తాను స్వామివారి దర్శనానికి వచ్చినప్పుడు రాజ్యసభ ఎన్నికలు ఇంకా జరగలేదని గుర్తుచేసుకున్నారు. స్వామివారి దయ, ప్రజల ఆశీర్వాదమే అని అయ్యన్నపాత్రుడు వివరించారు.

### 26 నుండి కపిలేశ్వరస్వామి పవిత్రోత్సవాలు

**తిరుమల, జులై 16 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడికి అనుబంధంగా ఉన్న తిరుపతిలోని కపిలేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల26 నుండి 28వ వరకు మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. ఇందుకు ముందుగా 25న సాయంత్రం 6 గంటలకు అంకురార్పణ నిర్వహించి ఉత్సవాలకు శ్రీకారం చుడతారు. ఏడాది పొడవునా ఆలయంలో జరిగే నిత్యార్చనలు, ఉత్సవాలు, కైంకర్యాల్లో తెలియక సంభవించిన దోషాలకు పరిహారంగా, ఆలయ పవిత్రతను పరిరక్షించేందుకు శైవాగమ శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఉత్సవాల ద్వారా ఆలయంలో ఆధ్యాత్మిక శోభ మరింత వృద్ధి చెందుతుంది.

## తిరుమల సమాచారం



### శ్రీవారి సేవలో నారా భువనేశ్వరి

**తిరుమల, జులై 16 ప్రభాతవార్త ప్రతినిధి:** ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి భువనేశ్వరి గురువారం వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని శ్రీవారిని ప్రార్థించినట్టు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని, రైతులు, యువత, మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు అందరూ సుభిక్షంగా ఉండాలని ప్రత్యేకంగా మొక్కులు చెల్లించారు. ఉదయం ఆమె వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ద్వారా ఆలయంలోకి ప్రవేశించారు. విఐపి బ్రేక్ దర్శన సమయంలో స్వామివారి సేవలో పాల్గొన్నారు. అనంతరం ఆనందనిలయుడ్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారుల పర్యవేక్షణలో దర్శన ఏర్పాట్లు చేసి, ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్వామివారి దర్శనం కల్పించారు. శ్రీవారి దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం అందించారు. టిటిడి చైర్మన్ బిఆర్‌నాయుడు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# 'కొండెక్కని' మోనోరైల్ ప్రతిపాదనలు!

**తిరుమల, జులై 16 ప్రభాతవార్త ప్రతినిధి:** అనూహ్యంగా తిరుమలకు రోజురోజుకూ పెరుగుతున్న భక్తుల రద్దీకి తగ్గట్లు మరింత సులభంగా కొండకు భక్తులు చేరుకునేందుకు తీసుకున్న పలు నిర్ణయాలు ఇప్పటికీ కాగితాలకే పరిమితమైపోయాయి. వేంకటేశ్వరస్వామి దర్శనం కోసం రోజురోజుకూ తిరుమలకు వస్తున్న భక్తుల సంఖ్యకు తగ్గట్లు రవాణా మార్గాలుగా ఉన్న రెండు ఘాట్‌రోడ్లు తీవ్ర విపత్తులను తట్టుకోలేక పోతుండటం జరిగింది. ఇందుకు ప్రత్యామ్నాయ మార్గంగా మోనో, ట్రామ్‌రైల్ నడపాలని గత వైసిపి ప్రభుత్వంలోని టిటిడి బోర్డు నిర్ణయించింది. ఎలాంటి పరిస్థితుల్లోనూ, విపత్కర సమయంలోనూ తిరుమలకు ప్రస్తుతం ఉన్న ఘాట్‌రోడ్డులు అనుకూలంగా లేకపోతే వైఖానస ఆగమానికి ఆటంకం లేకుండా రోడ్డుపై నడిచే మోనో,ట్రామ్‌రైల్ తరహాలో నడిపితే ఎలా ఉంటుందనే అభిప్రాయం 2021లోనే అప్పటి పాలకమండలి ప్రతిపాదన చేసింది. ఎట్టిపరిస్థితుల్లోనూ శేషాచలంలో తిరుమలకొండకు తీగలపై నడిచే రైలు వంటి(రోప్‌వే)జోలికి వెళ్ళబోమని కూడా స్పష్టం చేశారు. గతంలోనే ఇదే విషయంగా హైదరాబాద్ మెట్రో ఎండి ఎన్‌విఎస రెడ్డితో చర్చించి నివేదిక కూడా తెప్పించుకుంటామని తెలిపారు. నివేదిక ప్రకారం ఆగమ పండితులతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. అయితే ఈ హామీ పూర్తిగా నెరవేరలేదు. ఆస్ట్రియాలో ఎత్తయిన కొండలపైకి మోనోరైలు వెళుతోందని, దానిని మోడల్‌గా తీసుకుని తిరుమలకు రైలు ఏర్పాటును పరిశీలిస్తామని చెప్పారు. 2020-2024మధ్య కాలంలో ఈ ప్రతిపాదనపై ఊహాగానాలు తప్ప కనీసం డిపిఆర్ వరకు కూడా వెళ్లలేదు. శేషాచలం అడవుల్లో వెలసిన తిరుమల క్షేత్రంలో పర్యావరణాన్ని పరి రక్షించేందుకు వీలుగా మోనోరైలు ప్రతిపాదన కొంత వరకు ఉపయోగపడుతుందని కూడా భావించారు. ఆ తరువాత ఈ అంశంపై చర్చించిన దాఖలాలు లేవు. 2021నవంబర్‌లో కురిసిన భారీ వర్షాలకు తిరుమలకు వచ్చే రెండో ఘాట్ రోడ్డుపై భారీగా కొండచరియలు విరిగి జారి పడటం, రక్షణగోడలు, రోడ్లు ధ్వంసమైన విషయం విదితమే. మూడురోజులు కొండపైకి వాహనాల రాకపోలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఏకంగా అప్పట్లో రాత్రి వేళ పూర్తిగా తిరుమలకు వాహనాలను అనుమతించకుండా నిలుపుదల చేశారు. దీంతో తిరుమలకు మూడో ఘాట్ అవసరాన్ని టిటిడి పాలకమండలి మళ్ళీ తెరపైకి తీసుకువచ్చింది. అయితే పదేళ్ళక్రిందట తీసుకున్న నిర్ణయం, ప్రతిపాదనల మేరకు



రెండోఘాట్‌రోడ్డులో లింకురోడ్డు నుంచి మోకాళ్ళపర్వతం మీదుగా తిరుమల జిఎన్‌సి వరకు మూడో ఘాట్ రోడ్డు అవసరమని గుర్తించారు. కానీ ఇప్పటి పరిస్థితుల్లో తిరుమలకు వచ్చే రెండో ఘాట్ రోడ్డు వర్షాలకు తట్టుకుని సాఫీగా లేదని ఐఐటి నిపుణులు హెచ్చరించారు. దీంతో పూర్తిగా మూడో ఘాట్ రోడు మార్గం అవసరాన్ని మరోసారి అప్పటి టిటిడి పాలక మండలి, అధికారులు తెరపైకి తీసుకువచ్చారు. కానీ ఈ మూడో ఘాట్ రోడ్డు నిర్మాణం కడప జిల్లా వైపు నుంచి కాలినడక మార్గంగా వున్న అన్నమయ్య కాలిబాటను అభివృద్ధి చేయాలని కూడా నిర్ణయించారు. ప్రత్యామ్నాయంగా మూడో ఘాట్ రోడ్డు నిర్మాణం చేపడితే ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు వీలుకలుగుతుందని గతంలో ఉన్న టిటిడి అధికారులు, పాలకమండలి యోచనచేసింది. ఈ మార్గం వల్ల హైదరాబాద్, కర్నూలు, కడప వైపు నుండి వచ్చే భక్తులకు ప్రయాణదూరం తగ్గడమే గాక సులభంగా తిరుమలకు చేరుకునేం దుకు వీలు కలుగుతుందని భావించారు. ఈ నేపథ్యంలో ఆ పనులు, ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమవగా మోనోరైలు విషయం చర్చకే పరిమితమైంది.



### మళ్లీ తిరుమల కొండ కిటకిట
#### - వెంకన్న సర్వదర్శనానికి 20గంటలు

**తిరుమల, జులై 16 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల భక్తజన సంద్రంగా మారింది. వారాంతంకు ముందే ఏడుకొండల వెంకన్న దర్శనానికి భక్తులు భారీగా తరలివస్తున్నారు. వేలాదిగా భక్తులు దేశం నలుమూలల నుంచి తిరుమలకు చేరుకుంటున్నారు. గురువారం ఉదయానికి వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లలోని 32 కంపార్టుమెంట్లు నిండిపోయి భక్తులు వెలుపల క్యూలైన్లలో శిలాతోరణం వరకు బారులు తీరారు. దీంతో స్వామివారి సర్వదర్శనానికి 20గంటలు సమయం పడుతుండగా ప్రత్యేక ప్రవేశ దర్శనానికి ఐదు గంటలపైగానే భక్తులు నిరీక్షిస్తున్నారు. గురువారం సాయంత్రం వరకు 41వేల మంది భక్తులకు సర్వదర్శనంలో మహాలఘు దర్శనం చేయించారు. ఇంకా 20వేలమంది భక్తులు అర్ధరాత్రివరకు దర్శనం చేసుకునే వీలుందని టిటిడి వర్గాలు తెలిపాయి. బుధవారం రాత్రి వరకు 85,255మంది భక్తులకు మహాలఘులో దర్శనం చేయించారు. సాధారణంగా శని, ఆదివారాలు భక్తులు భారీగా తిరుమలకు వస్తారు. భక్తులు భారీగా చేరుకోవడంతో గదుల కోసం సామాన్యభక్తులు నిరీక్షిస్తున్నారు.

# ఆగస్టు -సెప్టెంబర్ నెలల్లోనూ నిరంతర విద్యుత్ సరఫరాకు ముందస్తు చర్యలు
**● పెరుగుతున్న విద్యుత్ డిమాండ్ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ అప్రమత్తం ● ఇంధన సంస్థలకు ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్**

**విజయవాడ, జులై 16 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో, అలాగే ఎల్‌నినో పరిస్థితుల ప్రభావంతో వాతావరణంలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉన్న దృష్ట్యా, రాష్ట్రంలో విద్యుత్ సరఫరా వ్యవస్థను మరింత పటిష్టంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. గురువారం ఏపీఎస్‌పీడీసీఎల్ సీఎండీ లోతేటి శివశంకర్, ఏపీఈపీడీసీఎల్ సీఎండీ ఐ.పృథ్వీ తేజ్, ఏపీసీపీడీసీఎల్ సీఎండీ, ఏపీ జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ పి. పుల్లారెడ్డి, ఏపీ ట్రాన్స్‌కో డైరెక్టర్ (గ్రిడ్) ఏ.కె.వి. భాస్కర్‌తో పాటు ఏపీఎస్‌ఎల్‌డీసీ, ఏపీపీసీసీ, ఏపీ ట్రాన్స్‌కో, ఏపీ జెన్‌కో, రాష్ట్రంలోని విద్యుత్ పంపిణీ సంస్థల సీనియర్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో ప్రస్తుత విద్యుత్ లభ్యత, డిమాండ్, ఆగస్టు-సెప్టెంబర్ 2026 నెలలకు అవసరమయ్యే విద్యుత్ వనరులు,



ఉత్పత్తి సామర్థ్యం, ప్రసార వ్యవస్థ సన్నద్ధత, విద్యుత్ కొనుగోలు, బొగ్గు నిల్వలు, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే కార్యాచరణ ప్రణాళికలపై విస్తృతంగా చర్చించారు.

రాష్ట్రంలో జులై నెలలో ఇప్పటివరకు ఎన్నడూ లేనంతగా విద్యుత్ వినియోగం నమోదైందని, జులై 15, 2026న రోజువారీ విద్యుత్ వినియోగం 285 మిలియన్ యూనిట్ల (ఎంయూ)కు చేరుకోవడం రాష్ట్ర విద్యుత్ రంగ చరిత్రలో జులై నెలకు సంబంధించి అత్యధిక డిమాండ్‌గా నమోదైందని తెలిపారు. అధిక ఉష్ణోగ్రతలు కొనసాగడం, నైరుతి రుతుపవనాల ఆలస్యం, వ్యవసాయ, పారిశ్రామిక, వాణిజ్య, గృహ వినియోగ రంగాల్లో విద్యుత్ అవసరాలు పెరగడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడినట్లు అధికారులు వివరించారు. ప్రస్తుత పరిస్థితిని సమీక్షించిన కె. విజయానంద్, రానున్న నెలల్లో విద్యుత్ డిమాండ్ మరింత పెరిగే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి పరిస్థితినైనా సమర్థంగా ఎదుర్కొనేలా అన్ని విద్యుత్ సంస్థలు ముందస్తు కార్యాచరణ ప్రణాళికలను సంసిద్ధం చేసి అమలు చేయాలని ఆదేశించారు. వినియోగదారులకు ఎటువంటి అంతరాయం లేకుండా 24 గంటల పాటు నాణ్యమైన, నమ్మకమైన విద్యుత్ సరఫరా అందించడం ప్రభుత్వ లక్ష్యం అని ఆయన స్పష్టం చేశారు. డిస్కమ్‌లు విద్యుత్ డిమాండ్‌ను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ, అవసరమైతే పవర్ ఎక్స్ఛేంజీలు, టర్మ్‌అహెడ్ మార్కెట్ వంటి వేదికల ద్వారా ముందస్తుగానే అదనపు విద్యుత్‌ను కొనుగోలు చేయాలని ఆయన ఆదేశించారు. విద్యుత్ కొనుగోలు విషయంలో ఆలస్యం జరగకుండా, మార్కెట్ పరిస్థితులను నిరంతరం పరిశీలిస్తూ తక్షణ నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.

రాష్ట్రంలోని అన్ని థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో తగిన స్థాయిలో బొగ్గు నిల్వలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఏపీ జెన్‌కో అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా గరిష్ట విద్యుత్ అవసరాల సమయంలో ఉత్పత్తిలో ఎటువంటి అంతరాయం ఏర్పడకుండా బొగ్గు సరఫరా, నిర్వహణ, యంత్రాల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యుత్ ఉత్పత్తి, ప్రసారం, పంపిణీ వ్యవస్థలు సమన్వయంతో పనిచేసినప్పుడే విద్యుత్ సరఫరా నిరంతరంగా కొనసాగుతుందని పేర్కొన్న విజయానంద్, ఏపీఎస్‌ఎల్‌డీసీ, ఏపీ జెన్‌కో, ఏపీ ట్రాన్స్‌కో, ఏపీపీసీసీ, మూడు డిస్కమ్‌ల మధ్య సమర్థవంతమైన సమన్వయం ఉండాలని ఆదేశించారు.

విద్యుత్ డిమాండ్, వనరుల లభ్యత, గ్రిడ్ స్థిరత్వం, ప్రసార వ్యవస్థ సామర్థ్యం, విద్యుత్ కొనుగోలు, అత్యవసర పరిస్థితుల నిర్వహణ వంటి అంశాలను ప్రతిరోజూ సమీక్షిస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

ప్రసార వ్యవస్థలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా ట్రాన్స్‌మిషన్ లైన్లు, సబ్‌స్టేషన్లు, కీలక విద్యుత్ మౌలిక సదుపాయాల నిర్వహణను మరింత బలోపేతం చేయాలని, ఏవైనా సాంకేతిక సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరించేలా ప్రత్యేక బృందాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.

వ్యవసాయం, పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు, గృహ వినియోగదారులు, సేవారంగం సహా అన్ని వర్గాల వినియోగదారులకు నాణ్యమైన, నమ్మకమైన 24గంటల విద్యుత్ సరఫరా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ముందస్తు ప్రణాళిక, సమయానుకూల విద్యుత్ కొనుగోలు, సమర్థవంతమైన గ్రిడ్ నిర్వహణ, విద్యుత్ సంస్థల మధ్య సమన్వయంతో రానున్న నెలల్లోనూ రాష్ట్ర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యుత్ సరఫరా కొనసాగించేలా అన్ని చర్యలు చేపడుతున్నట్లు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్ చెప్పారు.

# కాఫీ వ్యర్థాలతో ఎంతో ఉపయోగం



కాఫీ కేవలం మనకు శక్తి ఇవ్వడానికే కాదు మరెన్నో రకాలుగానూ దీని వ్యర్థాలు ఉపయోగపడతాయి. అదెలాగంటారా?

**సహజ ఎరువు..** కాఫీ పొడిలో నైట్రోజన్, పొటాషియం, మెగ్నీషి యం వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అన్ని మొక్కల మొదట్లో వేస్తే ఏపుగా పెరుగుతాయి. ముఖ్యంగా గులాబీ, టొమాటో వంటి మొక్కలకు ఇది ఎంతో మేలు చేస్తుంది.

**దుర్వాసనకు చెక్..** ఫ్రిజ్‌లో రకరకాల ఆహార పదార్థాలు పెట్టడం వల్ల కొన్ని సార్లు ఒక రకమైన వాసన వస్తుంది. దీన్ని పోగట్టడానికి ఒక చిన్న గిన్నెలో కాఫీ పొడిని వేసి ఫ్రిజ్‌లో ఓ మూల ఉంచితే సరి. కాఫీ పొడిలో ఉండే గుణాలు ఫ్రిజ్‌లోని చెడు వాసనలను పీల్చేసుకుం టుంది. సింక్ కింద లేదా షూరాక్‌ల్లో కూడా ఈ చిట్కా బాగా పనిచేస్తుంది. అలానే నాన్‌వెజ్ వండినప్పుడు లేదా ఉల్లిపాయలు, వెల్లుల్లి కోసినప్పుడు చేతులకు పట్టే వాసన అంత త్వరగా పోదు. అలాంటప్పుడు కూడా కొద్దిగా కాఫీ పొడిని చేతుల్లో వేసుకుని నీటితో బాగా రుద్ది కడుక్కుంటే సరి. ఆ వాసన మాయమై చేతులు తాజాగా మారతాయి.

**కీటకాలు దూరం:** ఇంట్లో చీమలు ఎక్కువగా తిరిగే చోట లేదా కిటికీల దగ్గర కొద్దిగా కాఫీ పొడి చల్లండి కాఫీలోఉండే కెఫీన్ వాసన చీమలకు, కొన్ని రకాల కీటకాలకు అస్సలు పడదు. దాంతో అవి ఆ ప్రాంతానికి రాకుండా దూరంగా వెళ్లిపోతాయి.

**మొండి మరకలు మాయం..** వంట పాత్రలకు పట్టిన మొండి జిడ్డు, మాడుని వదిలించడం పెద్ద పని. కాఫీ పొడి కొంచెం గరుకుగా ఉండటం వల్ల ఇది ఒక మంచి స్క్రబర్‌గా పనిచేస్తుంది. పాత్రలపై కొద్దిగా కాఫీ పొడి రుద్దితే, రసాయనాలు వాడకుండానే జిడ్డు సులభంగా వదిలిపోతుంది. ▫

# కురులు దృఢంగా..



సీజన్ మారిందంటే ప్రభావం పడేది కురుల పైనే! రాలిపోతుంటాయి. అయితే కొన్ని ఆహార పదార్థాలు ఈ విషయంలో మనకి సాయపడ తాయని తెలుసా? వాటిని చేర్చుకోండి.. సమస్య తీవ్రం కాకుండా కాపాడతాయి.. పసుపులోని కర్క్యుమిన్ ఇన్‌ఫ్లమేషన్‌ని తగ్గిస్తుంది. కుదుళ్ల బలంగా ఉండేలా చేస్తుంది. కురులు ఆరోగ్యంగా ఉండాలని కొబ్బరి నూనె రాస్తుంటాం కదా! డైట్‌లోనూ చోటివ్వండి. దీనిలోని ఆరోగ్యకరమైన కొవ్వులు, లారిక్ యాసిడ్ కురులు దృఢంగా చేస్తాయి. అవిసెలు తిన్నా, నానబెట్టి కురులకు పెట్టినా మంచిదే! రోజూ మాత్రం ఓ స్పూను తప్పక తినండి. వీటిలోని ఒమెగా ఫ్యాటీ యాసిడ్లు మాడుకి మేలు చేస్తాయి. ఒత్తిడి కారణంగా ఊడే జుట్టుకీ అడ్డుకట్ట వేయగలవు. కూరలు, పులుసుల్లోని ఉల్లిపాయలను పక్కన పెట్టేస్తారా? చేయకండి. ఇవీ కురులకు మేలు చేసేవే. వీటిలో ఉండే ఒక రకమైన యాంటీ ఆక్సిడెంట్ కుదుళ్లను బలంగా చేసి, కురులు వేగంగా పెరిగేలా చూస్తుంది. టీ, కాఫీకు బదులు గ్రీన్‌టీకి మారండి. దీనిలోని యాంటీ ఆక్సిడెంట్లు కురుల ఆరోగ్యానికి సాయపడేవే. స్నాక్స్‌లా గింజలను తినండి. ముఖ్యంగా గుమ్మడి గింజలకు తప్పక చోటివ్వండి. వీటిలో జింక్, ఐరన్, మెగ్నీషియం, ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. ఇవన్నీ కురులను దృఢంగా చేసి, ఊడకుండా సాయపడతాయచి. ఆకుకూరల్లో ఐరన్ ఫొలేట్, విటమిన్లు మెండుగా ఉంటాయి. వీటినీ వారంలో రెండు మూడు సార్లయినా తప్పక తీసుకోండి. ▫

# నలభైలో బరువు తగ్గాలంటే..



అధికబరువు. ఏ వయసు వారైన సరే. చాలామంది అంగీకరించలేని విషయమిది! అయితే ఎంత వద్దనుకున్నా.. 40 దాటాక చాలామంది మహిళలు క్రమంగా బరువు పెరుగుతారు. ఇందుకు మన శరీరంలో జరిగే మార్పులతో పాటు జీవనశైలి విషయంలో నిర్లక్ష్యంగా ఎలా కారణమని చెబుతున్నారు. మరి, ఈ సమస్యను అధిగమించి ఈ వయసులో ఫిట్ ఉండడం సాధ్యపడదా అంటే.. అదీ మన చేతుల్లోనే ఉంది. ఇందుకోసం కొన్ని నియమాలుపాటించాల్సి ఉంటుంది.

ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉండాలంటే బరువు అదుపులో ఉండాలి. అయితే వయసు పెరుగుతున్నకొద్దీ శక్తి క్షీణించడం వల్ల ఏ పని పైనా దృష్టి పెట్టలేం. వ్యాయామమూ చేయలేం. మరోవైపు జీవ క్రియల పనితీరు నెమ్మది స్తుంది. ఇది క్రమంగా తీపి తినాలన్న కోరికను పెంచుతుంది. ఇలా అటు శరీరానికి శ్రమలేక, ఇటు అనారోగ్యపూరిత ఆహారానికి అలవాటు పడడం వల్ల క్రమంగా బరువు పెరుగుతాం. జీవక్రియల పనితీరు నెమ్మదించడం వల్ల శరీరంలోకి చేరిన కొవ్వులు, క్యాలరీలు కరగడానికి చాలా సమయం పడుతుంది. ఇది క్రమంగా అధిక బరువుకు దారితీస్తుంది. 40 దాటిన చాలామంది బరువు పెరగడానికి మెనోపాజ్ కూడా ఓ కారణం. ఈ వయసులో మెనోపాజ్‌కు చేరువవ్వడం, లేదంటే అప్పటికే ఈ దశలోకి ప్రవేశించడం వల్ల ఈస్ట్రోజెన్, ప్రొజెస్టిరాన్, టెస్టోస్టిరాన్.. వంటి హార్మోన్ల స్థాయుల్లో మార్పులు చోటుచేసు కుంటాయి. ఈ హార్మోన్ల అసమతుల్యత అధిక బరువుకు దారితీస్తుంది. వయసు పెరిగే కొద్దీ ఎముక, కండరాల సామర్థ్యం తగ్గడం వల్ల వ్యాయామం చేయడానికి శరీరం సహకరించదు. ఒకవేళ బలవంతంగా చేసినా గాయాలయ్యే ప్రమాదం ఉంటుంది కాబట్టి ఇలా శారీరక శ్రమ లేకపోవడం వల్ల కూడా శారీరక బరువు పెరుగుతాం. మెనోపాజ్‌కు చేరువయ్యే కొద్దీ వేడి ఆవిర్లు, అర్ధరాత్రి ఉన్నట్లుండి చెమట లు పట్టడం. వంటి సమస్యలొస్తాయి. తద్వారా రాత్రుళ్లు సుఖ నిద్రకు దూరమవుతారు. దీనివల్ల ఒత్తిడి, ఆందోళనలు పెరిగిపోవడం.. జీవనశైలి అదుపు తప్పడం. ఆఖరికి ఇవి అధిక బరువుకు కారణమవుతాయి.

**ఫిట్‌గా ఉండవచ్చు!......** బాదం పప్పులు, వాల్‌నట్స్, గుమ్మడి గింజలు, పొద్దుతిరుగుడు గింజలు వంటి నట్స్‌ని సాయంత్రం స్నాక్‌గా తరచూ తీసుకోవడం మంచిది. తద్వారా ఎక్కువ సమయం కడుపు నిండుగా ఉండి, ఆకలేయకుండా, ఇతర పదార్థాల పైకి మనసు మళ్లకుండా జాగ్రత్తపడచ్చు. తీసుకునే ఆహారంలో ప్రొటీన్లు ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. ఈ క్రమంలో పాలు– పాలపదార్థాలు, మాంసం, గుడ్లు, వంటివి ముఖ్యమైనవి. ఫైబర్ అధికంగా ఉండే కాయగూరలు, పండ్లు ఎక్కువగా తీసుకుంటూ.. ప్రాసెస్డ్, నూనె సంబంధిత పదార్థాలను పూర్తి పక్కన పెట్టాలి. శరీర బరువును అదుపులో ఉంచుకోవాలంటే వ్యాయామం కీలకం. కాబట్టి వయసు పెరుగుతున్నా వర్కవుట్ చేయడం మానకూడదు. ఈ క్రమంలో స్క్వాట్స్, లాంజెస్, పుషప్స్, కెటిల్‌బెల్‌తో ఎక్సర్‌సైజ్.. వంటివి రోజూ సాధన చేయాలి ఒకవేళ ఒంటరిగా చేయడం ఇబ్బంది అనుకుంటే జిమ్‌లో చేరచ్చు. సుఖ నిద్ర వల్ల ఒత్తిడి, ఆందోళనలు తగ్గడంతో పాటు హార్మోన్ల సమతుల్యత పెరుగుతుంది. తద్వారా బరువు పెరగకుండా జాగ్రత్తపడచ్చు. కాబట్టి రోజూ రాత్రుళ్లు 7–8 గంటలపాటు నిద్ర పోవడం మంచిది. విటమిన్ల లోపాలు కూడా శారీరక సత్తువను కోల్పోయేలా చేస్తాయి. కాబట్టి పోషకాహారం తీసుకోవడంతో పాటు అత్యవసరమైతే నిపుణుల సలహా మేరకు ఆయా విటమిన్ సప్లిమెంట్స్ వాడడం వల్ల ఫలితం ఉంటుంది. ▫

# తారాదేవి

దశ మహా విద్యాలలో మొదటిరూపం కాళిక అయితే రెండవ రూపం తార. తార అంటే నక్షత్రం అనే అర్థం వుంది .. అలాగే 'దాటించేది' అనే అర్థం కూడా వుంది. కష్టాల నుంచి .. ఆపదల నుంచి .. సంసార సాగరం నుంచి ఆ తల్లి తన భక్తులను దాటిస్తుందనీ, అందుకే తార పేరుతో పూజలు అందుకుంటోందని ఆధ్యాత్మిక గ్రంధాలు చెబుతున్నాయి. తారాదేవిని ఆరాధించడమనేది ప్రాచీనకాలం నుంచి వుంది. వశిష్ఠ మహర్షి .. వ్యాస మహర్షి .. దూర్వాసుడు .. భరద్వాజుడు తారాదేవిని ఉపాసించినట్టుగా ఆధ్యాత్మిక గ్రంధాల్లో కనిపిస్తోంది. వశిష్ఠ మహర్షి ఆ తల్లిని ఉపాసించిన ప్పుడు అమ్మవారు పరమ శివుడిని పసిబాలుడిగా ఎత్తుకుని పాలిస్తున్నట్టుగా ప్రత్యక్ష మైందట. అందుకు కారణమే మిటని వశిష్ఠ మహర్షి అడగ్గా .. క్షీర సాగర మథనం లో వెలువడిన హాలాహలాన్ని పరమశివుడు తాగగా, ఆయన గొంతు పుండులా తయారైందనీ .. ఆ బాధని తగ్గించ డానికి తాను పాలిస్తున్నానని అమ్మవారు సెలవిచ్చిందట. ఆ తల్లి వాత్సల్యాన్ని చూసిన వశిష్ఠ మహర్షి ఆనంద బాష్పాలు వర్షిస్తుండగా రెండు చేతులూ జోడించాడట. ▫

# నాణ్యతను తేల్చేస్తుంది !

వర్షాకాలంలో.. ఆకుకూరలు, కాయగూరలు, చేపలు, మాంసాహారంపై బ్యాక్టీరియా ఎక్కువగా వృద్ధి చెందుతూ ఉంటుంది. అందుకే ఫ్రిజ్‌లోంచి తీసిన వెంటనే లేదా బజారు నుంచి తెచ్చిన వెంటనే వండేయడానికి సిద్ధపడిపోకుండా కాస్త వాటి నాణ్యతను ఆరాతీయండి. అదెలా అంటారా? ఇందుకోసం డిజిటల్ ఫుడ్ టెస్టర్లు మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. మాంసం, పండ్లు, కాయగూరలని ఈ టెస్టర్‌తో గుచ్చి చూస్తే చాలు. ఇందులో మెతాదుకు మించి క్రిమి సంహారాల వాడకం ఉంటే ఆ విషయాన్ని తెరపై చూపిస్తుంది. అలాగే నీళ్ల పరిశుభ్రతనూ చిటికెలో చెప్పేస్తుంది. ఇవేకాదు బ్యాక్టీరియా వంటివి ఉంటే వాటినీ పసికట్టేస్తుంది. ▫




# జీన్స్ మన్నాలంటే !



ఈ రోజుల్లో చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా మహిళల క్యాజువల్ వేర్‌గా జీన్స్ మారిపోయింది. అయితే, వీటినీ సరిగా ఉంచుకోకపోతే అవి ఎక్కువకాలం నాణ్యంగా, మన్నికగా ఉండవు. ఈ పరిస్థితి తలెత్తకుండా జాగ్రత్తలిలా తీసుకోవాలి.

మొదటి సారి జీన్స్ నానబెట్టే సర్ఫ్ నీళ్లలో కాస్త రాళ్ల ఉప్పు కూడా వేయండి. ఇలా చేస్తే రంగు పోకుండా ఉంటుంది. మురికీ, మరకలూ త్వరగా వదులుతాయి. కొత్తదనమూ పోదు. ముదురు రంగు జీన్స్‌లు మెరుపు తగ్గుతున్నాయా? అయితే వాటిని ఉతికిన తరవాత చివరిలో అరబకెట్ నీటిలో కప్పు బేకింగ్ సోడా కలిపి ముంచితీసి ఆరేయండి చాలు. మరకలు పడితే రెండు చెంచాల వంటసోడాలో కాస్త వినెగర్ కలిపి పేస్టులా చేసి మరక మీద రాయాలి. పావుగంటయ్యాక బ్రష్‌తో రుద్దితే త్వరగా వదిలిపోతుంది. జీన్స్ కాస్త మందంగా ఉంటుంది కదా అని.. వేణ్నీళ్లలో నానబెట్టడం, బండకేసి బాదడం చేయొద్దు. దీనివల్ల దాని ఫైనింగ్‌తో పాటు మన్నికా తగ్గుతుంది. వీలైనంతవరకూ వీటిని చన్నీళ్లతోనే ఉతకాలి. అలానే జీన్స్‌ని వేసుకున్న ప్రతిసారీ ఉతికేయొద్దు. గాలికి ఆరనిచ్చి రెండు మూడుసార్లు వేసుకుంటే మంచిది. ▫

## తెర

# 'సహ' మెదటి సాంగ్ లాంచ్



తాజాగా చిత్ర బృందం మ్యూజికల్ ప్రమోషన్స్‌ను ప్రారంభిస్తూ తొలి పాట 'కాలాన్నే తిరగేసి'ను విడుదల చేసింది. ఈ పాటని 'ఎమోషన్ ఆఫ్ సాహ'గా పరిచయం చేశారు. సంగీత దర్శకుడు శేఖర్ చంద్ర మరోసారి తన మెలోడీ మ్యాజిక్‌ను చూపించారు. నెమ్మదిగా మొదలై క్రమంగా భావోద్వేగాలను పెంచుకుంటూ సాగే ఈ గీతం అద్భుతమైన ఆర్కెస్ట్రేషన్‌తో అందరినీ కదిలిస్తుంది. తన జీవితంలోని ప్రేమను కోల్పోయిన కథానాయకుడు, మళ్లీ ఆమెను కలుసుకోవాలని కలలు కంటూ అనుభవించే ఆవేదన, ఆశలను ఈ పాట అద్భుతంగా ప్రతిబింబిస్తుంది.'మళ్లీ రావా' అనే పల్లవి అతని మనసులోని తపనను హృదయానికి హత్తుకునేలా చేతుంది. పూర్ణాచారి రాసిన సాహిత్యం భావోద్వేగాలకు కవిత్వ రూపం ఇవ్వగా, అనురాగ్ కులకర్ణి తన మధురమైన వోకల్స్‌తో పాటను మరో స్థాయికి తీసుకెళ్లారు.ప్రేమని కోల్పోయిన యువకుడి పాత్రలో శివ కుమార్ కాసారం ఎంతో సహజంగా నటించారు. శ్వేత లక్ష్మణ్ కూడా తన పాత్రలో భావోద్వేగాలను అద్భుతంగా పలికిస్తూ ఆకట్టుకున్నారు. వీరిద్దరి మధ్య కెమిస్ట్రీ ఈ పాటలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# 24న హారర్ మూవీ 'అమెన్' విడుదల



గుండె జబ్బులు ఉన్నవాళ్లు సినిమాకు రావద్దు సంచలన ప్రకటన చేసిన మూవీమేకర్ ఎస్కే బషీద్ తెలుగు సినీ పరిశ్రమలో తనదైన ముద్రతో ముందుకు సాగుతున్న దర్శకుడు, నిర్మాత ఎస్కే బషీద్ నుండి మరో విభిన్నమైన చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఎస్‌బీకే ఫిలిం కార్పొరేషన్ బ్యానర్‌పై, రేగుల నీరజరాణి సమర్పణలో, ఆర్‌ఎన్‌ఆర్ డిస్ట్రిబ్యూషన్ అండ్ ప్రొడక్షన్ ఆధ్వర్యంలో రూపొందిన అత్యంత ప్రతిష్టాత్మక హారర్ సస్పెన్స్ థ్రిల్లర్ 'అమెన్' (AMEN) జూలై 24న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. అభిరుచిగల దర్శకుడు, నిర్మాతగా పేరు తెచ్చుకున్న ఎస్కే బషీద్ పలు భాషల్లో విజయవంతమైన చిత్రాలను అందించి తనకంటూ మంచి గుర్తింపు సంపాదించుకున్నారు. అంచనాలకు అందని అనూహ్యమైన సబ్జెక్టులతో ప్రయోగాలు చేసే బషీద్.. ఇప్పుడు "అమెన్" మూవీతో మరోసారి ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారారు."గుండె జబ్బులు ఉన్నవాళ్లు రావద్దు!" – బషీద్ వార్నింగ్ ఈ సినిమా గురించి ఎస్కే బషీద్ మాట్లాడుతూ, ఇప్పటివరకు వచ్చిన హారర్ సినిమాల ట్రెండ్‌ను పూర్తిగా మార్చేలా 'అమెన్' రూపొందించాం. సరికొత్త సస్పెన్స్, భయానక ఎలిమెంట్స్‌తో ప్రేక్షకులను థ్రిల్ చేయబోతున్నాం. కొత్త నటీనటులతో టెక్నికల్‌గా హై స్టాండర్డ్స్‌తో సినిమా తెరకెక్కింది. ఈ సినిమా ఎంత భయపెడుతుందో చెప్పలేం... గుండె జబ్బులు ఉన్నవాళ్లు థియేటర్‌కు రావద్దు. ఒంటరిగా కూర్చుని చూసే ధైర్యం ఎవరికీ ఉండదు. పోస్టర్‌తోనే భారీ అంచనాలుఇటీవల విడుదలైన 'అమెన్' పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది."హెచ్చరిక: మీ తల్లిదండ్రులను జాగ్రత్తగా ఇంట్లో ఉంచి సినిమాకు రండి.." అనే క్యాప్షన్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రెట్టింపు చేస్తోంది. త్వరలో విడుదల కానున్న ట్రైలర్‌పై కూడా భారీ అంచనాలు నెలకొన్నాయి.

# 'ఫౌజీ' డిసెంబర్ 3న ప్రపంచవ్యాప్తంగా రిలీజ్



రెబెల్ స్టార్ ప్రభాస్ మోస్ట్ ఎవైటెడ్ పాన్ ఇండియా ప్రాజెక్ట్ 'ఫౌజీ'తో వెండితెరపై సందడి చేయడానికి సిద్ధంగా ఉన్నారు. ఈ భారీ పీరియడ్ యాక్షన్ చిత్రం 2026 డిసెంబర్ 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్ల లోకి రానుందని చిత్ర నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. హను రాఘవపుడి దర్శ కత్వంలో, మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణంలో, టిసిరీస్ సమర్పణలో రూపొందిన ఈ చిత్రాన్ని నవీన్ యెర్నేని, వై. రవిశంకర్, భూషణ్ కుమార్ నిర్మించారు. ఈ ప్రాజెక్ట్ ఇప్పటికే అద్భుతమైన టైటిల్ పోస్టర్‌తో అంచనాలు పెంచింది. రిలీజ్ డేట్ తో పాటు విడుదల చేసిన కొత్త పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ పోస్టర్‌లో ఖిఫౌజీఖి ప్రపంచాన్ని, సినిమా భారీ స్థాయిని అద్భుతంగా ఆవిష్కరించారు. ప్రభాస్ ఇప్పటివరకు ఎప్పుడూ కనిపించని రగ్డ్, ఎమోషనల్ అవతార్‌లో కనిపిస్తూ ఆకట్టుకుంటున్నారు.పొడవాటి జుట్టు, గడ్డం, యుద్ధం వల్ల అలసిపోయిన శరీరం, రక్తపు మరకలతో ఉన్న తెల్లటి ధోతీలో ప్రభాస్ చేసిన మేకోవర్ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని కలిగిస్తోంది. తన హావభావాలతోనే బాధ, ధైర్యం, సంకల్పం, ఆత్మవిశ్వాసాన్ని వ్యక్తపరిచే విధంగా పోస్టర్ రూపొందించారు .ముఖ్యంగా ఈ పోస్టర్ సినిమాలోని అత్యంత భారీ యాక్షన్ ఎపిసోడ్‌లలో ఒకదానికి సంబంధించినది. థియేటర్లలో ఈ సీక్వెన్స్ ప్రేక్షకులకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఖిఫౌజీఖి కేవలం యుద్ధ నేపథ్య చిత్రమే కాకుండా, భావోద్వేగాలతో కూడిన గొప్ప సినీ అనుభూతిని అందించే చిత్రంగా రూపొందుతున్నట్లు పోస్టర్ తెలియజేస్తోంది

# 'ది ఒడిస్సీ' 17న ప్రపంచవ్యాప్తంగా విడుదల

క్రిస్టోఫర్ నోలన్ రూపొందించిన 'ది ఒడిస్సీ' IMAX ఫిల్మ్ టెక్నాలజీతో విడుదలకాబోతోందిక్రిస్టోఫర్ నోలన్ యొక్క 'ది ఒడిస్సీ' సరికొత్త IMAX ఫిల్మ్ టెక్నాలజీని ఉపయోగించి ప్రపంచవ్యాప్తంగా చిత్రీకరించబడిన ఒక పౌరాణిక యాక్షన్ ఇతిహాసం. ఇది హోమర్ యొక్క గ్రీకు ఇతిహాసం, ఒడిస్సీకి అనుసరణ. పూర్తిగా IMAX ఫిల్మ్ కెమెరాలతో చిత్రీ కరించబడిన మొట్టమొదటి ఫీచర్ చిత్రంగా ఇది ప్రపంచ వ్యాప్తంగా తెరపైకి వస్తోంది. నోలన్ యొక్క బది డార్క్ నైట్ ట్రయాలజీ, 'ఇన్సెప్షన్', 'ఇంటర్‌స్టెల్లార్', 'డంకిర్క్', 'ఒపెన్‌హైమర్' మొదలైన చిత్రాల తర్వాత, 6 దేశాలలో చిత్రీకరించబడిన ఈ చిత్రం, ఈ కాలంలో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమా! ఇది నోలన్ యొక్క 13వ ఫీచర్ చిత్రం, ఇది ఒక లీనమయ్యే విస్తృతమైన సినిమాటిక్ అనుభవాన్ని అందిస్తుంది!కథా సారాంశం గ్రీకులోని ఒక రాతి ద్వీపానికి రాజు అయిన ఇథాకాకు చెందిన ఒడిస్సియస్, తన ప్రసిద్ధ వ్యూహం, ట్రోజన్ హార్స్‌తో అగమెమ్నన్ కోసం యుద్ధాన్ని గెలుస్తాడు; 'ది ఒడిస్సీ' చిత్రంలో అకాడమీ అవార్డు విజేత మాట్ డామన్ ఇథాకా రాజు ఒడిస్సియస్‌గా; తీతిసీగితి విజేత టామ్ హాలండ్ ఒడిస్సియస్ కుమారుడు టెలిమాకస్‌గా నటించారు; అకాడమీ అవార్డు విజేత ఆన్ హాత్వే ఇథాకా రాణి మరియు ఒడిస్సియస్ భార్య అయిన పెనెలోప్ పాత్రలో; రాబర్ట్ పాటిన్సన్



పెనెలోప్‌ను వివాహం చేసుకోవా లనుకునే ఇథాకా వాసి ఆంటినోస్ పాత్రలో; అకాడమీ అవార్డు విజేత లుపిటా న్యోంగో స్పార్టా రాణి 'హెలెన్ ఆఫ్ ట్రాయ్' ఆమె కవల సోదరి మైసీనే రాణి 'క్లైటెమ్నెస్ట్రా' అనే రెండు పాత్రలలో; రెండుసార్లు అకాడమీ అవార్డుకు నామినేట్ అయిన సమంతా మోర్టన్ శక్తివంతమైన మంత్రగత్తె సిర్సీ పాత్రలో; ఎమ్మీ విజేత జాన్ లెగుయిజామో ఒడిస్సియస్ నమ్మకస్తుడైన సేవకుడు యుమేయస్ పాత్రలో; ఎమ్మీ గోల్డెన్ గ్లోబ్ విజేత జెండయా దేవత ఎథీనా పాత్రలో; అకాడమీ అవార్డు విజేత చార్లిజ్ థెరాన్ (అమరత్వమున్న అప్సరస కాలిప్సో పాత్రలో నటిస్తున్నారు. యూనివర్సల్ పిక్చర్స్ ఈ సినిమాను జులై 17, 2026న ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేయనుంది.

# 'ఓ.! సుకుమారి' ప్రీరిలీజ్ ఈవెంట్



యంగ్ హీరో తిరువీర్, ట్యాలెంటెడ్ హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ విలేజ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ ఓ.! సుకుమారితో అలరించబోతున్నారు. నూతన దర్శకుడు భరత్ దర్శన్ దర్శకత్వంలో గంగా ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై మహేశ్వర్ రెడ్డి మూలి నిర్మిస్తున్నారు. జూలై 17న ఈ సినిమా తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో హీరో తిరువీర్ మాట్లాడుతూ... మసూద సినిమాకి, ఈ సినిమాకి కొన్ని ఆసక్తికరమైన పోలికలు ఉన్నాయి. 'మసూద' సినిమాను ఎస్‌వీసీ రిలీజ్ చేసింది. ఈ సినిమాను కూడా ఎస్‌వీసీనే విడుదల చేస్తోంది. హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ మాట్లాడుతూ...'సంక్రాంతికి వస్తున్నాం' తర్వాత 'ఓ.! సుకుమారి' తో ప్రేక్షకుల ముందుకు రావడం చాలా ఆనందంగా ఉంది. జూలై 17న సినిమా విడుదలవుతోంది. ముందుగా మా నిర్మాత మహేశ్వర్ రెడ్డి గురించి చెప్పాలి. ఆయన ఈ కథను ఎంతో నమ్మారు. . మా సినిమా టోగ్రాఫర్ ఎంతో అందంగా చూపించారు. మ్యూజిక్ డైరెక్టర్ భరత్ అద్భుతమైన సంగీతం అందించారు. "మాట్లాడుతూ... ఈ సినిమాపై నాకు డబుల్ కాన్ఫిడెన్స్ ఉంది. జూలై 17న థియేటర్లలో కలుద్దాం. సినిమా చూసి బయటకు వచ్చిన తర్వాత తిరువీర్, ఐశ్వర్య రాజేష్‌ల నటనను మీరు చాలా కాలం గుర్తుంచుకుంటారు. వాళ్ల పెర్ఫార్మెన్స్ పీక్స్‌లో ఉంటుంది. నాకు ఈ అవకాశం ఇచ్చిన నిర్మాత మహేశ్వర్ రెడ్డికి ధన్యవాదాలు. నిర్మాత మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... మేము చాలా మంచి సినిమా తీశాం. ఈ సినిమాపై నాకు పూర్తి నమ్మకం ఉంది. జూలై 17న సినిమా విడుదలవుతోంది. నటుడు మురళీధర్ గౌడ్ మాట్లాడుతూ... ఇది మంచి కాన్సెప్ట్‌తో రూపొందిన సినిమా. దర్శకుడు తొలి సినిమానే అయినా చాలా అద్భుతంగా తీశారు. డీవోపీ కుషేందర్ మాట్లాడుతూ... దర్శన్ గతంలో నేను చేసిన సినిమాకు అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేశాడు.

# 'హుషార్ పిట్టలు' 'టోంగా.. టోంగా' పాట విడుదల



అన్ను, వాసవి గణేషన్ జంటగా రూపొందు తోన్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ చిత్రం 'హుషారు పిట్టలు'. పద్మ అమ్మ, బీవీజీ స్టూడియోస్ సమర్పణలో రుద్ర క్రాంతి పిక్చర్స్ పతాకంపై వెంకట్ యాదవ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి బిక్షు దర్శకుడు. చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థలు ఏషియన్ సురేష్ ఫిలింస్ సంస్థలు విడుదల చేస్తున్నాయి. ఆగస్టు 15న ఈ చిత్రాన్ని థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నారు. బెక్కెం వేణుగోపాల్ మాట్లాడుతూ ఈ సినిమా చూసి నేను ఎంతో ఇంప్రెస్ అయ్యాను. ఈ సినిమా చూసిన అందరూ పాజిటివ్ స్పందించారు. ఈ సినిమాను ఆగస్టు 15న విడుదల చేయడం లక్కీగా అనుకుంటున్నాను. చరణ్ అర్జున్ మటా్లడుతూ తొలిసారిగా నేను మ్యూజిక్ అందించిన చిత్రంలో ఓ సాంగ్‌కు ఈవెంట్ పెట్టడం సంతోషంగా ఉంది. ఈ పాటను ఎంతో సందడిగా, హుషారుగా చేశాం.నిర్మాత వెంకట్ యాదవ్ మాట్లాడుతూ టీజర్ విడుదలైన ప్పుడు వైరల్ అయ్యింది. కొంత మంది తెలియక బ్యాడ్ కామెంట్లు పెట్టారు. కానీ సినిమా విడుదల తరువాత ఆ సినిమాలో ఉన్న అసలు కథ అందరికి తెలుస్తుంది. అందరి హృదయాలకు హత్తుకునే సినిమా ఇది. ఈ సినిమాలో అన్ని ఎమోషన్స్ ఉన్నాయి. ప్రముఖ నిర్మాత సురేష్‌బాబు గారు ఈ సినిమాను విడుదల చేయడం అంటేనే ఈ సినిమా ఎలాంటి సినిమానో అర్థం చేసుకోవచ్చు. ఈ సినిమా విడుదల తరువాత అందరూ ఓ మంచి సినిమా తీశామన్న అనుభూతికి లోనవుతారు.దర్శకుడు బిక్షు మాట్లాడుతూ ఈ సినిమా టీజర్ తరువాత నన్ను అందరూ సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తూ తిట్టడం స్టార్ట్ చేసి నన్ను పాపులర్ చేశారు. అందరూ ఏదోదో ఊహించుకున్నారు. ఈ సినిమా విడుదల తరువాత సినిమా చూసి అందరూ మీరు సోషల్ మీడియాలో చేసిన నెగెటివ్ కామెంట్స్ వెనక్కి తీసుకుంటారు.

## ఫిఫా వరల్డ్‌కప్‌లో అర్జెంటీనా ప్లేయర్ల వివాదాస్పద బ్యానర్




**అట్లాంటా,జులై 16:** ఫిఫా వరల్డ్‌కప్‌లో అర్జెంటీనా ఫుట్‌బాల్ ప్లేయర్లు వివాదాస్ప రీతిలో బ్యానర్లు ప్రదర్శించారు. ఇంగ్లండ్‌తో జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లో గెలిచిన తర్వాత అర్జెంటీనా ఆటగాళ్లు సంబరాలు జరుపుకున్నారు. అయితే మైదానంలోనే ఆ ప్లేయర్లు ఓ బ్యానర్‌ను ప్రదర్శించారు. ఫాక్‌ల్యాండ్స్‌కు మద్దతు ఇచ్చే రీతిలో ఉన్న బ్యానర్‌ను ఆటగాళ్లు పట్టుకున్నారు. దీనిపై వివాదం చెలరేగింది. లాస్ మాల్వినాస్ సన్ అర్జెంటీనాస్ అని బ్యానర్‌లో రాసింది. అర్జెంటీనాకే ఫాక్‌ల్యాండ్స్ చెందుతాయన్న అర్థం వచ్చే రీతిలో బ్యానర్ ఉన్నది. అట్లాంటిక్ సముద్రంలో ఉన్న ఫాక్‌ల్యాండ్స్ దీవులు ఒకప్పుడు బ్రిటన్ ఆధీనంలో ఉన్నాయి. అయితే ఆ దీవులు తమకే చెందుతాయని అర్జెంటీనా పోరాడుతోంది. ఈ నేపథ్యంలో అర్జెంటీనా ఫుట్‌బాల్ ప్లేయర్లు బ్యానర్లు ప్రదర్శించడం వివాదానికి దారి తీసింది. ఫుట్‌బాల్ ప్లేయర్లు రాజకీయ సంకేతాలు ఇవ్వడం సరికాదు అని అభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. 1982లో ఈ రెండు దేశాల మధ్య ఆ దీవుల కోసం యుద్ధం కూడా జరిగింది. ఆ యుద్ధంలో వందల సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. 2014లో అర్జెంటీనా ప్లేయర్లు ఇలాగే ఓ వివాదాస్పద బ్యానర్‌ను ప్రదర్శించారు. అప్పుడు ఆ జట్టుకు 20 వేల పౌండ్ల జరిమానా వేశారు. అయితే తాజాగా జరిగిన ఘటన పట్ల దర్యాప్తు చేపట్టనున్నట్లు ఫిఫా అధికారులు చెబుతున్నారు. ఆటగాళ్లు నియమావళిని ఉల్లంఘించినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

## ఐపిఎల్ పంజాబ్‌కింగ్స్ రికార్డు బ్రేక్‌చేసిన వాషింగ్టన్ ఫ్రీడమ్!




**న్యూయార్క్,జులై 16:** ఈ ఏడాది ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ పెట్టిన 265 పరుగుల భారీ లక్ష్యాన్ని పంజాబ్ కింగ్స్ ఛేదించిన టీ20 క్రికెట్‌లో రికార్డును మేజర్ లీగ్ క్రికెట్(ఎంఎల్‌సీ) ఫ్రాంచైజీ వాషింగ్టన్ ఫ్రీడమ్ పంజాబ్ కింగ్స్ రికార్డును బ్రేక్ చేసింది. 267 పరుగుల లక్ష్యాన్ని ఉఫ్ అనేసి టీ20 క్రికెట్‌లో వరల్డ్ రికార్డు సృష్టించింది. గురువారం ఎంఎల్‌సీ లీగ్‌లో ఎంఐ న్యూయార్క్‌తో జరిగిన ఎలిమినేటర్‌లో వాషింగ్టన్ ఫ్రీడమ్ ఈ ఘనత సాధించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన ఎంఐ న్యూయార్క్ 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 266 రన్స్ చేసింది. కెప్టెన్ నికోలస్ పూరన్ 33 బంతుల్లో 106 పరుగుతో మెరుపు శతకం బాదాడు. 31 బంతుల్లో సెంచరీ చేసిన అతను ఫ్రాంచైజీ టీ20ల్లో గేల్(30) తర్వాత ఫాస్టెస్ట్ సెంచరీ చేసిన రెండో బ్యాటర్‌గా నిలిచాడు. అతనికితోడు డికాక్(51), కీరన్ పొలార్డ్(64) కూడా హాఫ్ సెంచరీలు చేశారు. దీంతో ఎంఐ న్యూయార్క్ వాషింగ్టన్ ఫ్రీడమ్ ముందు 267 పరుగుల భారీ లక్ష్యాన్ని పెట్టింది. ఈ టార్గెట్‌ను ఆ జట్టు మరో 8 బంతులు మిగిలి ఉండగానే ఛేదించడం విశేషం. 4 వికెట్లు కోల్పోయి 270 పరుగులు చేసి గెలుపొందింది. ఆ జట్టులో ఆండ్రీస్ గౌస్(132), స్టీవ్ స్మిత్(110 నాటౌట్) సెంచరీలతో కదం తొక్కి వాషింగ్టన్ ఫ్రీడమ్‌ను గెలిపించారు. వీరిద్దరే 241 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పడం గమనార్హం. ఈ మ్యాచ్‌లో పలు రికార్డులు కూడా నమోదయ్యాయి. ఓ టీ20 మ్యాచ్‌లో ముగ్గురు సెంచరీలు చేయడం ఇదే తొలిసారి. ఈ గేములో రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 51 సిక్సర్లు వచ్చాయి. టీ20 మ్యాచ్‌లో అత్యధిక సిక్స్‌లు ఇవే. ఇంతకుముందు 42 సిక్సర్లు రికార్డుగా ఉండగా ఈ మ్యాచ్ దాన్ని బ్రేక్ చేసింది.




## ఛాన్సొస్తే కెప్టెన్సీకి నేను రెడీ

### స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన

**లండన్,జులై 16:** టీమిండియా మహిళా క్రికెట్ జట్టు స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన టీమ్ సారథ్య బాధ్యతలను చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించి తన మనసులోని మాటను బయటపెట్టింది. ప్రస్తుత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ స్థానంలో భవిష్యత్తులో కెప్టెన్సీ బాధ్యతలు స్వీకరించేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు స్మృతి మంధాన స్పష్టం చేశారు. జట్టు వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న స్మృతి మంధాన గత కొన్నేళ్లుగా హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్సీలో జట్టు కోసం కీలక పాత్ర పోషిస్తున్నారు. హర్మన్‌ప్రీత్ జట్టుకు అందుబాటులో లేనప్పుడు తాత్కాలిక కెప్టెన్ గా భారత జట్టును విజయ పథంలో నడిపించిన అనుభవం స్మృతి మంధానకు ఉంది. భారత మహిళా జట్టు కెప్టెన్సీ మార్పునకు సంబంధించి వస్తున్న ఊహాగానాలపై స్మృతి మంధానకు ఓ ప్రశ్న ఎదురైంది. ఒకవేళ భవిష్యత్తులో భారత జట్టు సారథ్య బాధ్యతలు అప్పగిస్తే స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నారా అని అడిగితే అవును తప్పకుండా నేను దానికి సిద్ధంగా ఉన్నానని స్మృతి మంధాన ఎంతో నమ్మకంతో సమాధానమిచ్చింది. ఎంతో ఒత్తిడితో కూడిన మ్యాచుల్లో కూడా కూల్ గా నిర్ణయాలు తీసుకుని జట్టును నడిపించిన అనుభవం కూడా స్మృతి మంధానకు ఉంది. ఆ టాలెంటే స్మృతి మంధానను కెప్టెన్ రేసులో నిలబెట్టింది. స్మృతి మంధాన కెప్టెన్సీ రికార్డు భారత మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్సీకి స్మృతి మంధాన బలమైన పోటీదారుగా నిలిచింది. ఆమె 18 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లకు, నాలుగు వన్డేలకు కెప్టెన్‌గా వ్యవహరించి, మొత్తం 15 మ్యాచ్‌లలో జట్టును విజయపథంలో నడిపించింది. ఆమె నాయకత్వంలో ఆడిన నాలుగు వన్డేలలోనూ భారత జట్టు అజేయంగా నిలిచింది. లార్డ్స్ క్రికెట్ గ్రౌండ్‌లో భారత్ చారిత్రాత్మక విజయం సాధించిన అనంతరం స్మృతి మంధాన ఈ ప్రకటన చేసింది. లార్డ్స్‌లో జరిగిన చారిత్రాత్మక మహిళల టెస్ట్ మ్యాచ్‌లో, భారత జట్టు ఇంగ్లాండ్‌పై 270 పరుగుల భారీ విజయాన్ని నమోదు చేసింది. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 285 పరుగులు చేయగా.. రెండో ఇన్నింగ్స్‌లో 7 వికెట్ల నష్టానికి 341 పరుగుల వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. ఆ తర్వాత భారత బౌలర్లు ఇంగ్లండ్‌ను రెండు ఇన్నింగ్స్‌లలోనూ వరుసగా 170, 186 పరుగులకే ఆలౌట్ చేసి విజయాన్ని ఖాయం చేసుకున్నారు. ఈ మ్యాచ్‌లో స్మృతి మంధాన కీలక పాత్ర పోషించింది, తొలి ఇన్నింగ్స్‌లో 83 పరుగులు చేసి, ఆ తర్వాత రెండో ఇన్నింగ్స్‌లో అద్భుతమైన అర్ధశతకం సాధించింది. స్మృతి మంధాన మాట్లాడుతూ, "లార్డ్స్‌లో జరిగిన తొలి మహిళల టెస్ట్ మ్యాచ్‌లో భాగం కావడం, అంతకంటే ముఖ్యంగా దానిని గెలవడం ఒక అద్భుతమైన అనుభవమని స్మృతి చెప్పింది.




## కోహ్లి, రోహిత్‌ల సంయుక్త రికార్డు

### అంతర్జాతీయ క్రికెట్‌లో 8వేల పరుగులు చేసిన జంట

**కార్డిఫ్,జులై 16:** టీమిండియా స్టార్ బ్యాటర్లు విరాట్‌కోహ్లి, రోహిత్‌శర్మలు సంయుక్తంగా మరో రికార్డుసాధించారు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఈ ఇద్దరూ ఎనిమిదివేల పరుగుల భాగస్వామ్యం పూర్తిచేసారు. ఈ ఘటన సాధించినమూడో భారత జోడిగా,ఓవరాల్‌గా తొమ్మిదోజోడీగా రికార్డుల్లోకెక్కారు. అందకుముందు భారత్ తరపున గంగూలీ టెండూల్కర్‌లు 12,400, ద్రవిడ్ టెండూల్కర్ 11,037 పరుగులుచేసారు. ప్రపంచ వ్యాప్తంగా ఈ రికార్డు శ్రీలంక స్టార్ ద్వయం మహేళ జయవర్థనే, కుమార సంగక్కర 13,368 పరుగులుచేసి వారిపేరిట ఉంది. ఈ ఎనిమిదివేల పరుగుల ఘనత కార్డిఫ్‌లో ఇంగ్లండ్‌తో జరుగుతున్న రెండో వన్డేలో చోటుచేసుకుంది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌చేస్తున్న భారత్ 50ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 209 పరుగులుచేసి మరింతగా ఇంగ్లండ్‌కు చెక్‌పెట్టేందుకు దూకుడుగా ఉంది.

## వెయ్యి సిక్సర్ల యోధుడు కీరన్‌పోలార్డ్!



**ముంబయి,జులై 16:** వెస్టిండీస్ విధ్వంసకర బ్యాటర్ కీరన్‌పోలార్డ్ టి20 క్రికెట్‌లో కీలక మైలురాయిని తాకాడు. మేజర్ లీగ్‌క్రికెట్ ఎమ్మెల్సీ 2026లో వాషింగ్టన్‌ఫ్రీడమ్‌తో జరిగిన ఎలిమినేటర్‌మ్యాచ్‌లో 8 సిక్సర్లు బాదిన ఆతడు పొట్టి ఫార్మాట్‌లో 1000సిక్సర్లు పూర్తిచేసాడు. ఈ ఘటన సాధించిన రెండో బ్యాటర్‌గా రికార్డుల్లో నమోదయ్యాడు. మరో క్రికెటర్ కూడా విండీస్ వీరుడేజ క్రిస్‌గేల్ 1056 సిక్సర్లు సాధించాడు. కెరీర్‌లో ఇప్పటివరకూ 746 టీ20 మ్యాచ్‌లు ఆడిన పోలార్డ్ 1001 సిక్సర్లతోపాటు 923 ఫోర్లుకూడా బాదాడు. టి20 క్రికెట్‌లో టాప్ ఐదుగురిలో క్రిస్‌గేల్ 1056, పోలార్డ్ 1001, రసెల్ 792, పూరన్ 764, బట్లర్ 630 సిక్సర్లు బాదారు. మ్యాచ్‌పరంగాచూస్తే పోలార్డ్ 25 బంతుల్లో 64 పరుగులుచేసాడు. 8 సిక్సర్లు ఒక ఫోర్‌సాధించాడు. నికొలస్‌పూరన్ మెరుపుశతకంతో ఎంఐ న్యూయార్క్‌నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లనష్టంతో 266 పరుగులుచేసింది. భారీ స్కోరుచేసిన ఎంఐ బౌలర్లు కాపాడుకోలేకపోయారు. ఫ్రీడం బ్యాటర్లు స్టీవ్‌స్మిత్ 110 నాటౌట్, ఆండ్రియస్ గౌస్ 132 పరుగులుచేసి శతకాలుచేసారు.మరో 8 బంతులు ఉండగానే టార్గెట్‌ను ఛేదించారు.

## సత్తాచూపిస్తున్న బ్యాడ్మింటన్ స్టార్ పివి సింధు!

**టోక్యో,జులై 16:** జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ క్రీడాకారిణి పీవీ సింధు సత్తాచాటుతోంది. వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుంది. రెండో రౌండ్‌లో ఆమె తన కంటే మెరుగైన ర్యాంకర్ అయిన వరల్డ్ నం.5 హాన్ యూ(చైనా)కు షాకిచ్చింది. గురువారం జరిగిన మ్యాచ్‌లో 21-16, 21-14 తేడాతో విజయం సాధించింది. 35 నిమిషాల్లోనే సింధు వరుసగా రెండు గేముల్లోనూ నెగ్గింది. హాన్ యూపై సింధుది తిరుగులేని తిరుగులేని ఆధిపత్యం. ఈ మ్యాచ్‌కు ముందు 8 మ్యాచ్‌ల్లో ఎదురుపడితే ఏడింట సింధునే గెలిచింది. ఈ మ్యాచ్‌లోనూ ఆమె ఆధిపత్యం ప్రదర్శించింది. రెండు గేముల్లోనూ సింధు దూకుడు ముందు ప్రత్యర్థి నిలువలేకపోయింది. ఈ సీజన్‌లో సింధు క్వార్టర్స్‌కు చేరుకున్న 6వ టోర్నీ ఇది. మరోవైపు మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల, తనీషా క్రాస్టో జోడీ రెండో రౌండ్‌లో ఓడిపోయింది. చైనాకు చెందిన ఫెంగ్ యాన్ జీ హువాంగ్ డాంగ్ పింగ్ జంట చేతిలో 22-20, 21-17 తేడాతో పోరాడి ఓడింది. సింగిల్స్‌లో లక్ష్యసేన్, ఆయుశ్ శెట్టి, ఉన్నతి హుడా ఇప్పటికే ఇంటిదారిపట్టిన విషయం తెలిసిందే. పురుషుల డబుల్స్‌లో సాత్విక్,చిరాగ్ జోడీ గాయం కారణంగా తొలి రౌండ్ మధ్యలోనే వైదొలిగింది. దీంతో ఇప్పుడు టోర్నీలో భారత్ తరపున మిగిలిన ఏకైక ప్లేయర్ సింధు.అయితే, క్వార్టర్స్‌లో ఆమెకు కఠిన సవాల్ ఎదురైంది. శుక్రవారం జరిగే క్వార్టర్స్‌లో ఆమె వరల్డ్ నం.1 క్రీడాకారిణి నోజోమి ఒకుహారా(జపాన్)ను ఎదుర్కోనుంది.




# వాణిజ్యం




## విప్రో తొలి త్రైమాసిక లాభం 4.3% తగ్గుదల

### రూ.3,352 కోట్ల నికర లాభం

**ముంబయి, జులై 16:** దేశీయ ఐటీ దిగ్గజం విప్రో తొలి త్రైమాసికం నికర లాభం 4.3 శాతం తగ్గి రూ.3,352 కోట్లకు చేరింది. అంతకుముందు త్రైమాసికంలో కంపెనీ రూ.3,502 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. మార్కెట్ అంచనాలతో పోలిస్తే కూడా కంపెనీ లాభం కొంత నిరాశపరిచింది. విశ్లేషకులు విప్రో నికర లాభం రూ.3,466 కోట్ల వరకు ఉంటుందని అంచనా వేయగా, కంపెనీ ప్రకటించిన లాభం ఆ అంచనాలకు తక్కువగా నమోదైంది.లావాదేవీల ద్వారా వచ్చిన ఆదాయం స్వల్పంగా 1 శాతం పెరిగి రూ.24,479 కోట్లకు చేరింది. గత త్రైమాసికంలో ఇది రూ.24,236 కోట్లుగా ఉంది. ఈ ఆదాయం మార్కెట్ అంచనాలకు అనుగుణంగా నమోదైంది. కంపెనీ వడ్డీ, పన్నులకు ముందు లాభం 8.4 శాతం తగ్గి రూ.3,829 కోట్లకు పడిపోయింది. గత త్రైమాసికంలో ఇది రూ.4,181 కోట్లు. అదే సమయంలో ఆపరేటింగ్ మార్జిన్ 17.2 శాతం నుంచి 15.6 శాతానికి క్షీణించింది. అంటే 160 బేసిస్ పాయింట్లు తగ్గింది. విప్రో ఒక్కో రూ.2 ముఖ విలువ కలిగిన ఈక్విటీ షేరుకు రూ.2 మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. ఇందుకు ఈనెల 27, 2026ను రికార్డు తేదీగా నిర్ణయించింది. డివిడెండ్ చెల్లింపును ఆగస్టు 14 లోపు పూర్తి చేయనున్నట్లు తెలిపింది. కంపెనీ మొత్తం బుకింగ్స్ 2.4 శాతం తగ్గి 3.37 బిలియన్ డాలర్లకు చేరాయి. ఐటీ సర్వీసుల ఆదాయం 1.4 శాతం తగ్గి 2.62 బిలియన్ డాలర్లుగా నమోదైంది. త్రైమాసికం ముగిసే నాటికి కంపెనీ 12 నెలల ఉద్యోగుల నిష్క్రమణ రేటు 13.9 శాతంగా నమోదైంది. మొత్తం ఉద్యోగుల సంఖ్య 2.43 లక్షలుగా ఉంది.కంపెనీ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీని పల్లియా మాట్లాడుతూ, కృత్రిమ మేధస్సు వల్ల మార్కెట్ అవకాశాలు తగ్గడం కాకుండా మరింత విస్తరిస్తున్నాయని తెలిపారు. కంపెనీ డీల్ పైప్‌లైన్ బలంగా కొనసాగుతోందని చెప్పారు.టెక్నాలజీ, కమ్యూనికేషన్స్ విభాగాల్లో మంచి వృద్ధి కొనసాగుతోందని, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ విభాగం రెండో త్రైమాసికంలో వేగం అందుకుంటుందని ఆయన పేర్కొన్నారు.

## ఎక్కడి సూచీలు అక్కడే..

### పశ్చిమాసియా ఎఫెక్ట్‌తో నామమాత్రంగా లాభాలు!



**ముంబై, జులై 16:** దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం దాదాపు నిలకడగా ముగిశాయి. భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరల ఒడిదొడుకులు, ఆసియా మార్కెట్లలో బలహీన ధోరణి నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించడంతో పాటు ఆర్థిక రంగ (ఫైనాన్షియల్) షేర్లలో అమ్మకాల ఒత్తిడి పెరగడం ప్రధాన సూచీలపై ప్రభావం చూపింది. బీఎస్ఈ సెన్సెక్స్ 1.44 పాయింట్ల స్వల్ప లాభంతో 77,186.87 వద్ద ముగియగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 5.75 పాయింట్లు లేదా 0.02 శాతం స్వల్ప నష్టంతో 24,072.75 వద్ద స్థిరపడింది.రోజువారీ ట్రేడింగ్‌లో సెన్సెక్స్ ఒక దశలో 394 పాయింట్లు ఎగబాకి 77,579.69 గరిష్ఠ స్థాయిని తాకింది. అనంతరం లాభాల స్వీకరణ, అమ్మకాల ఒత్తిడి కారణంగా 77,086.42 కనిష్ఠ స్థాయికి చేరింది. ఇదే సమయంలో నిఫ్టీ కూడా 108 పాయింట్లకు పైగా పెరిగి 24,186.50 ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేయగా, తరువాత 24,050 కనిష్ఠ స్థాయిని తాకింది.రంగాల వారీగా చూస్తే వినియోగదారుల అవసరాలకు సంబంధించిన కంపెనీల షేర్లు మెరుగైన ప్రదర్శన కనబర్చాయి. నిఫ్టీ కన్స్యూమర్ డ్యూరబుల్స్ సూచీ 1.48 శాతం లాభంతో అగ్రస్థానంలో నిలిచింది. నిఫ్టీ కెమికల్స్ 1.41 శాతం, నిఫ్టీ మీడియా 1.18 శాతం, నిఫ్టీ ఐటీ 0.67 శాతం, నిఫ్టీ ఆటో 0.46 శాతం చొప్పున లాభపడ్డాయి. నిఫ్టీ50లో ఎటర్నల్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, భారత్ ఎలక్ట్రానిక్స్ (బీఈఎల్), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, శ్రీరామ్ ఫైనాన్స్, సిప్లా, గ్రాసిమ్ ఇండస్ట్రీస్, ఎన్‌టీపీసీ, అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజ్ షేర్లు అత్యధికంగా నష్టపోయాయి. వీటిలో కొన్ని షేర్లు మూడు శాతం వరకు క్షీణించాయి. పశ్చిమాసియా పరిణామాలు, ముడి చమురు ధరల్లో అస్థిరత, ఆసియా మార్కెట్ల బలహీనత వంటి అంశాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించడంతో మార్కెట్ రోజంతా పరిమిత శ్రేణిలోనే కదిలింది.డాలరుతో రూపాయి విలువలు 96.33వద్ద నిలిచింది.ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్ మార్కెట్‌దరలు 0.19శాతం క్షీణించి రూ.1.41,585కి చేరాయి. ముడిచమురు బ్యారెల్‌కు 84.73 డాలర్లుగా కొనసాగింది.

## మెట్రో నగరాల్లో అద్దె డిపాజిట్లు 1.26 లక్షల కోట్లు



**ముంబయి,జులై 16:** దేశంలోని ఆరు ప్రధాన మెట్రో నగరాలు ముంబై మెట్రోపాలిటన్ రీజియన్, బెంగళూరు, ఢిల్లీఎన్‌సీఆర్, చెన్నై, హైదరాబాద్, పుణే నగరాల్లో అద్దె ఇళ్లకు సంబంధించిన భద్రతా డిపాజిట్ల (సెక్యూరిటీ డిపాజిట్లు) రూపంలో సుమారు రూ.1.26 లక్షల కోట్లు ఇళ్ల యజమానుల వద్ద నిలిచిపోయినట్లు ప్రముఖ ప్రాప్‌టెక్ సంస్థ నోబ్రోకర్ నిర్వహించిన తాజా అధ్యయనం వెల్లడించింది. ఈ అధ్యయనం ప్రకారం, ముంబైలో రూ.41,156 కోట్లు, బెంగళూరులో రూ.31,628 కోట్లు భద్రతా డిపాజిట్ల రూపంలో నిలిచిపోయి ఉండగా, దేశంలోని ఇతర మెట్రో నగరాలతో పోలిస్తే ఇవే అత్యధిక మొత్తాలు. బెంగళూరులో 75 శాతం మంది అద్దెదారులు, అధిక సెక్యూరిటీ డిపాజిట్ కారణంగా తాము ఇష్టపడిన ఇంటిలోకి మారలేకపోయిన సందర్భాలు ఉన్నాయి. ప్రధాన మెట్రో నగరాల్లో ఈ శాతం అత్యధికంగా నమోదైంది.అదే సమయంలో ఢిల్లీఎన్‌సీఆర్‌లో లీజు గడువు ముగిసిన తర్వాత 58 శాతం మంది అద్దెదారులు తమ పూర్తి డిపాజిట్‌ను తిరిగి పొందగా, సుమారు 30 శాతం మందికి కొంత మొత్తం కోత పడింది. మరో 12 శాతం మంది డిపాజిట్ తిరిగి పొందడంలో తీవ్ర వివాదాలను ఎదుర్కొన్నారు. నోబ్రోకర్ నివేదిక ప్రకారం, పట్టణ ప్రాంతాల్లో నివసించే అద్దెదారుల నెలవారీ ఖర్చుల్లో ఇంటి అద్దెనే అతిపెద్ద వ్యయంగా మారింది. దాదాపు సగం మంది అద్దెదారులు తమ నెలవారీ ఆదాయంలో 30 శాతానికి పైగా అద్దెకే వెచ్చిస్తున్నారు. ముంబైలో 25 శాతం మంది అద్దెదారులు తమ ఆదాయంలో సగానికి పైగా అద్దెకే ఖర్చు చేస్తుండగా, మరో 15 శాతం మంది 41-50 శాతం ఆదాయాన్ని అద్దెకు చెల్లిస్తున్నారు. ముంబైలో ప్రతి 10 మంది అద్దెదారుల్లో నలుగురు తమ ఆదాయంలో 40 శాతానికి పైగా గృహ అవసరాలకే వెచ్చిస్తున్నట్లు నివేదిక వెల్లడించింది. ఒకే రకమైన ఇంటికి 30 ఏళ్ల గృహ రుణానికి చెల్లించాల్సిన ఈఎంఐ దాదాపు అన్ని ప్రధాన నగరాల్లో నెలవారీ అద్దె కంటే గణనీయంగా ఎక్కువగా ఉంది. బెంగళూరులో ఈఎంఐఅద్దె నిష్పత్తి 2.07 నుంచి 2.38,హైదరాబాద్లో 2.21 నుంచి 2.47, ముంబైలో 2.03 నుంచి 2.19కు పెరిగింది. జెన్‌జెడ్ అంటే 18-24 ఏళ్ల వయస్సు అద్దెదారులు, ఇతర వయస్సు వారితో పోలిస్తే సుమారు 1.5 రెట్లు ఎక్కువగా ఇళ్లు మారుతున్నారు. వీరిలో 30 శాతం మంది ప్రతి ఆరు నుంచి 12 నెలలకోసారి ఇల్లు మారుతుండగా, పెద్ద వయస్సు గల వారిలో కేవలం 10 శాతం మాత్రమే ఉంది. బెంగళూరులో 4.8 శాతం, హైదరాబాద్‌లో 4.6 శాతం అద్దె రాబడితో దేశంలో అగ్రస్థానాల్లో నిలిచాయి.

## అంచనాలను మించి 40% పెరిగిన భెల్ రాబడి!




**న్యూఢిల్లీ, జులై 16:** ప్రభుత్వ రంగ ఇంజినీరింగ్ దిగ్గజం బిహెచ్ఇఎల్ తొలి త్రైమాసికంలో అంచనాలకు మించిన ఆర్థిక ఫలితాలను నమోదు చేసింది. కంపెనీ ఆదాయం, నిర్వహణ లాభదాయకత (ఎబిట్డా), నికర లాభం అన్ని ప్రధాన సూచీల్లో అంచనాలను అధిగమించాయి.గత ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.456 కోట్ల నష్టాన్ని నమోదు చేసిన బీహెచ్ఈఎల్, ఈసారి రూ.378 కోట్ల సమీకృత నికర లాభాన్ని ఆర్జించింది. కంపెనీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 40.3 శాతం పెరిగి రూ.5,487 కోట్ల నుంచి రూ.7,698 కోట్లకు చేరుకుంది.నిర్వహణ లాభం (ఎబిట్డా) గత ఏడాది రూ.537 కోట్ల నష్టంలో ఉండగా, ఈసారి రూ.504 కోట్ల లాభంగా నమోదైంది. ఎబిట్డా మార్జిన్ 6.5 శాతానికి చేరుకుంది. నికర లాభం కూడా నిపుణులు అంచనావేసిన రూ.33.9 కోట్లతో పోలిస్తే ఎంతో ఎక్కువగా నమోదైంది.ఇతర ఆదాయం కూడా గత ఏడాది రూ.171.2 కోట్ల నుంచి ఈసారి రూ.214.1 కోట్లకు పెరిగింది. కంపెనీ వృద్ధికి విద్యుత్ విభాగం ప్రధాన ఆధారంగా నిలిచింది. ఈ విభాగం ఆదాయం గత ఏడాది రూ.3,898.9 కోట్ల నుంచి రూ.5,919.5 కోట్లకు పెరిగింది. పరిశ్రమ విభాగం ఆదాయం కూడా రూ.1,588.1 కోట్ల నుంచి రూ.1,778.2 కోట్లకు పెరిగింది.ఇదిలా ఉండగా, సూడాన్‌లో కొనసాగుతున్న సంక్షోభం కారణంగా మాజీ ఎన్ఈసీ సూడాన్ సంస్థ నుంచి రావాల్సిన రూ.196 కోట్ల బకాయిలు ఇంకా అందలేదని బీహెచ్ఈఎల్ వెల్లడించింది. గురువారం ట్రేడింగ్‌లో షేరు ధర 2 శాతం వరకు పెరిగి రూ.426.15కు చేరుకోగా, అదే సమయంలో ఎన్ఎస్ఈ నిఫ్టీ50 సూచీ కేవలం 0.1 శాతం మాత్రమే లాభపడింది.

## టెక్ మహీంద్ర లాభం రూ.1465 కోట్లు




**ముంబై, జులై 16:** దేశీయ ఐటీ దిగ్గజం టెక్ మహీంద్రా తొలి త్రైమాసికంలో ప్రాతిపదికన పెరిగినప్ప టికీ, మార్కెట్ నిపుణుల అంచనాలను అందుకోలేకపోయింది. త్రైమాసికంలో టెక్ మహీంద్రా సమీకృత నికర లాభం రూ.1,465 కోట్లుగా నమోదైంది. ఇది మార్చి త్రైమాసికంలోని రూ.1,354 కోట్లతో పోలిస్తే 8.2 శాతం అధికం. అయితే, నిపుణులు అంచనా వేసిన రూ.1,607 కోట్ల కంటే తక్కువగా ఉండటంతో మార్కెట్ అంచనాలను అందుకోలేకపోయింది.కంపెనీ కార్యకలాపాల ద్వారా వచ్చిన ఆదాయం 4.2 శాతం పెరిగి రూ.15,712 కోట్లకు చేరుకుంది. గత త్రైమాసికంలో రూ.15,076 కోట్లు కాగా, మార్కెట్ అంచనా రూ.15,422 కోట్లు. దీంతో ఆదాయం అంచనాలకు అనుగుణంగానే నమోదైంది.వడ్డీ, పన్నులకు ముందు లాభం రూ.2,073 కోట్ల నుంచి రూ.2,264 కోట్లకు పెరిగి 9.2%వృద్ధి నమోదు చేసింది. అలాగే ఎబిడిటామార్జిన్ 13.7 శాతం నుంచి 14.4 శాతానికి పెరిగింది. కొత్త ఒప్పందాల మొత్తం విలువ ఏడాది ప్రాతిపదికన 33.3 శాతం పెరిగి 1.08 బిలియన్ డాలర్లకు చేరుకోవడం విశేషం. కంపెనీ సీఈఓ మోహిత్ జోషి మాట్లాడుతూ, వరుసగా మూడు త్రైమాసికాల్లో 1 బిలియన్ డాలర్లకు పైగా కొత్త డీల్ విజయాలు సాధించడం సంస్థ వ్యాపార బలాన్ని ప్రతిబింబిస్తోందన్నారు. అలాగే 50 మిలియన్ డాలర్లకు పైగా ఆదాయం అందించే ఖాతాదారుల సంఖ్య ఏడు పెరగడం, అన్ని వ్యాపార విభాగాలు వార్షిక ప్రాతిపదికన వృద్ధిని నమోదు చేయడం సానుకూల పరిణామమని పేర్కొన్నారు.ఉద్యోగుల నిష్క్రమణ రేటు 12.1 శాతం నుంచి 11.8 శాతానికి తగ్గిందని, కృత్రిమ మేధ రంగాలవారీ ప్రత్యేక సామర్థ్యాలు, ప్లాట్‌ఫారమ్‌లు, ప్రతిభావంతులైన ఉద్యోగులపై పెట్టుబడులు కొనసాగిస్తూ భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా సంస్థను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. ఫలితాల ప్రకటనకు ముందు ఎన్ఎస్ఈలో టెక్ మహీంద్రా షేరు 1.13% పెరిగి రూ.1,515.60 వద్ద ముగిసింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.